

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఎన్‌టీపీసీ రెండో దశకు పచ్చజెండా

- నిర్మాణం కోసం సంప్రదింపులు జరపాలి
- అవసరాలకనుగుణంగా సామర్థ్యాన్ని పెంచాలి
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

13

శుక్రవారం | 5-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 261

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా. 11.47 తదుపరి దశమి; నక్షత్రం: చిత్త రా. 7.50 తదుపరి స్వాతి; వర్జ్యం: రా.1.47-3.30; దుర్ముహూర్తం: ఉ.9.03-9.47, మ.12.43-1.27; అమృతఘడియలు: ఉ.12.49-2.34; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.51

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కాంగ్రెస్‌లోకి షర్మిల

- రాహుల్ సమక్షంలో కండువా కప్పి ఆహ్వానించిన ఖర్గే.. వైఎస్‌ఆర్‌టీపీని విలీనం చేస్తున్నా
- వైఎస్ ఎక్కడున్నా సంతోషించే రోజిది.. రాహుల్ ప్రధాని కావాలని ఆయన కలలుగన్నారు
- దానిని నెరవేర్చేందుకు కృషిచేస్తా.. కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా నిర్వహిస్తా: షర్మిల
- సోనియాగాంధీతోనూ భేటీ.. పీసీసీ పగ్గాలు అప్పగింతపై అధిష్ఠానం మల్లగుల్లాలు

న్యూఢిల్లీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరారు. అగ్ర నేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారమిక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో షర్మిలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, ఏఐసీసీ ఎస్సీ విభాగం నేత కొప్పుల రాజు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు హాజరయ్యారు. వేదికపై కూర్చున్న షర్మిల భర్త అనిల్‌కు కూడా ఖర్గే కండువా కప్పబోయారు. కానీ అనిల్ తాను పార్టీలో చేరడం లేదంటూ సున్నితంగా

మిగతా 3వ పేజీలో...



మణిపూర్ ఘటనలను

ఓ క్రైస్తవురాలిగా జీర్ణించుకోలేకపోతున్నా!

- అక్కడ రెండు వేల చర్చిల ధ్వంసం
- నిరాశ్రయులుగా 60 వేల మంది
- నాడే కాంగ్రెస్‌కు మద్దతివ్వాలనుకున్నా: షర్మిల

3

ఖమ్మం నుంచి సోనియా!

తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీకి సరేనన్న సోనియా.. రాష్ట్ర నేతలకు సమాచారం



- ఆమె తరఫున రేవంత్, భట్టి నామినేషన్
- తెలంగాణ, కర్ణాటకల్లో సోనియా ప్రభావం
- కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మార్చే వ్యూహం
- రెండు రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఎంపీ సీట్లు గెలుచుకుంటే కేంద్రంలో అధికారం!
- సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపించవచ్చని కాంగ్రెస్ అధిష్ఠానం అంచనా
- సోనియాతో రాష్ట్రంలో బహిరంగ సభ?

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీ చేసే విషయమై స్పష్టత వచ్చింది. ఆమె ఖమ్మం నుంచి పోటీ చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ ముఖ్యులకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి సమాచారం అందినట్టు తెలుస్తోంది. తెలంగాణ నుంచి సోనియా లోక్‌సభకు పోటీ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ గత నెలలోనే తీర్మానం చేసి, అధిష్ఠానానికి పంపగా, ఆమె సూత్రప్రాయంగా అంగీకరించారు. ఎక్కడ నుంచి పోటీ చేయాలనే విషయంలో మాత్రం కొంత సందిగ్ధత కొనసాగింది. తాజాగా ఈ విషయంలోనూ స్పష్టత వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. ఆమె పోటీ ద్వారా ఇటు తెలంగాణలోనే కాకుండా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కూడా సానుకూల ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సోనియాగాంధీ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర పార్టీ నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ ప్రజల్లోకి వెళ్లారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు సెప్టెంబరు 17న తుక్కుగూడలో విజయభేరి పేరుతో జరిగిన భారీ బహిరంగ సభలో సోనియాగాంధీ పాల్గొన్నారు. సోనియా హాజరైన తుక్కుగూడ సభ తర్వాతే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిన విషయాన్ని రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల

మిగతా 12వ పేజీలో...




ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

విన్నపాలు వినవలె..

- 'పాలమూరు'కు పెండింగ్ అనుమతులను క్లియర్ చేయండి
- ప్రాధాన్యతల దృష్ట్యా జాతీయ హోదా దక్కేలా చూడండి
- కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్‌కు రేవంత్, ఉత్తమ్ వినతి
- హోదా ఇవ్వలేం.. ఇతర స్కీంల కింద60% నిధులిస్తాం:షెకావత్
- అదనపు ఐపీఎస్ పోస్టులివ్వాలని అమిత్ షాను కోరిన రేవంత్
- సవరించిన ప్రతిపాదనల ప్రకారం మెట్రో రెండో దశ చేపడదాం
- మూసీ రివర్ ఫ్రంట్‌కు సహకరించాలని హర్దీప్ సింగ్‌కు వినతి
- టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై యూపీఎస్సీ చైర్మన్‌తో నేడు రేవంత్ భేటీ

13



కేసీఆర్‌కు శ్రీనివాసుడి చిత్రపటాన్ని అందజేస్తున్న జగన్

చివరిదాకా జనం బయటపడరు

జాగ్రత్త!

- జగన్‌ను అప్రమత్తం చేసిన కేసీఆర్
- బీఆర్‌ఎస్ చీఫ్‌తో ఏపీ సీఎం భేటీ
- ఆయన ఆస్పత్రి నుంచి ఇంటికొచ్చిన 20 రోజుల తర్వాత 'పరామర్శ'
- అందరి సమక్షంలో కుశల ప్రశ్నలు
- ఆపై.. కేటీఆర్‌నూ పంపేసి చర్చలు
- ఓటమి ఊహించలేదన్న కేసీఆర్!
- వైసీపీని చుట్టుముడుతున్న కష్టాలు
- సీట్ల మార్పుపై వికటిస్తున్న ప్రయోగాలు
- కాంగ్రెస్‌లో షర్మిల చేరికతో ఇంటిపోరు

కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవొద్దు!

తల్లి విజయలక్ష్మితో జగన్

(అమరావతి/హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గాయపడి, శస్త్ర చికిత్స చేయించుకుని, ఇంటికి కూడా చేరుకున్నాక.. 20 రోజులకు.. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆయనను పరామర్శించారు. ఏకాంతంగా, 'ప్రత్యేకం'గా కూడా పరామర్శించారు. సహజంగా ఎవరైనా ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడే వెళ్లి పరామర్శిస్తారు. కానీ.. జగన్ ఇన్నాళ్ల తర్వాత వెళ్లడం, అదీ

మిగతా 3వ పేజీలో...



టెస్టు చరిత్రలోనే

చిట్టి మ్యాచ్

- 642 బంతుల్లోనే ముగిసిన టెస్టుగా రికార్డుల్లోకి
- బౌలర్ల హవా.. రోజున్నరలోనే కేప్‌టౌన్ టెస్టు క్లోజ్
- రెండో టెస్టులో సౌతాఫ్రికాపై 7 వికెట్లతో భారత్ ఘనవిజయం
- 1-1తో సిరీస్ సమం

11

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్

విడుదల

- 11 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ
- 29న పోలింగ్, అదే రోజు ఫలితాల వెల్లడి
- కడియం, పాడి కౌశిక్ రెడ్డి రాజీనామాలతో ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన 2 స్థానాలు

హైదరాబాద్/న్యూఢిల్లీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా కింద ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికకు ఈసీ గురువారం షెడ్యూల్‌ను ప్రకటించింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపింది. అదే రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 18తో నామినేషన్ల గడువు ముగియనుంది. 19న నామినేషన్ల పరిశీలన, 22 దాకా ఉప సంహరణకు అవకాశం ఉంటుంది. 29న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఫలితాలు వెల్లడిస్తారు. కొత్తగా ఎన్నికయ్యే ఎమ్మెల్సీల పదవీ కాలం 2027 నవంబరు 30వరకు ఉంటుంది. యూపీలోని ఒక ఎమ్మెల్సీ స్థానానికీ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడించింది.

రెండు సీట్లకు పోటాపోటీ

- ఒకటి బీఆర్‌ఎస్‌కు, మరొకటి కాంగ్రెస్‌కు!
- రెండు పార్టీల్లోనూ భారీగా ఆశావహులు

12

జీతాలు

పడ్డాయోచ్

- 4వ తేదీకల్లా ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లింపు పూర్తి
- కాంగ్రెస్ సర్కారు వచ్చాక.. తొలి నెలలోనే సకాలంలో
- వేతన జీవులకు ఊరట.. ఇది కొనసాగాలని ఆకాంక్ష
- బీఆర్‌ఎస్ హయాంలో 12, 20 తేదీల దాకా చెల్లింపు



హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రోజుకు ఇన్ని జిల్లాల వంతున.. విడతల వారీగా చెల్లింపు.. ఒకటో తేదీన అందాల్సినవి 12 నుంచి 20వ తేదీ వరకు..! ఇదీ మొన్నటివరకు వేతనాల విషయంలో రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొన్న అనుభవం. ఈ పరిస్థితి వారిని తీవ్ర వేదనకు గురిచేసింది. నెల వాయిదాలు చెల్లించలేని ఇబ్బంది కలిగింది. ఇప్పుడా వ్యథ తప్పింది. విపరీతమైన జాప్యానికి తెర దించుతూ.. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తొలి నెలలోనే, ఉద్యోగులకు సకాలంలో జీతాలు పడ్డాయి. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చినట్లుగానే ఉద్యోగులు, పింఛనర్లకు తొలి అనుకూల విధానం అమలైంది. గురువారం (4వ తేదీ)తో అన్ని జిల్లాల్లోని వారికి డిసెంబరు నెల వేతనాలు, పింఛన్ల పంపిణీ పూర్తయింది. రాష్ట్రంలో డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఈ లెక్కన ప్రస్తుత సర్కారు తొలిగా ఇస్తున్న వేతనాలను సకాలంలో మంజూరు చేసింది. బీఆర్‌ఎస్ హయాంలో ప్రతి నెల 12, 20 తేదీ వరకు జీతాలిచ్చిన పద్ధతికి స్వస్తి

మిగతా 13వ పేజీలో...

సర్కారు చేతికి ధరణి!

- ఇకపై రికార్డుల నిర్వహణ ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలోనే..
- ఎన్ఐసీ లేదా టీఎస్‌టీఎస్‌కు చాన్స్
- ముమ్మర కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- ప్రస్తుతం టెర్రాసిస్ అనే ప్రైవేటు సంస్థ నేతృత్వంలో ధరణి రికార్డుల నిర్వహణ

13

68 వేల డబుల్ ఇళ్లు రద్దు?

- టెండర్ దశలో ఉన్నవి, పనులు ప్రారంభంకాని వాటి స్థానంలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకం అమలు
- బీఆర్‌ఎస్ హయాంలో 2.91 లక్షల ఇళ్లు మంజూరు
- నిర్మితమైనవాటికి రూ.11 వేల కోట్లు పైగా ఖర్చు

13

కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి

లైన్‌క్లియర్

- 4 మార్కులు కలపాలన్న తీర్పు కొట్టివేత
- కమిటీ వేసి.. ప్రశ్నలపై నిర్ణయం తీసుకోవాలి
- నెలలో నియామకాల ప్రక్రియ పూర్తిచేయాలి
- ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

13

ప్రచారం చేయకుండా అడ్డుకోవటానికే..

» అందుకే ఎన్నికల ముంగిట సమన్లు పంపారు: కేజ్రీవాల్



న్యూఢిల్లీ, జనవరి 4: తనను అరెస్టు చేయించటం ద్వారా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా అడ్డుకోవాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. తనకున్న అతి పెద్ద సంపద తన నిజాయితీయేనని, తప్పుడు అభియోగాలతో దానిని మసకబార్చాలని చూస్తున్నారన్నారు. ఢిల్లీ మద్యం కేసులో విచారణకు తమ ఎదుట హాజరు కావాలంటూ ఈడీ మూడోసారి బుధవారం సమన్లు జారీ చేయటం, దానికి కేజ్రీవాల్ నిరాకరించటం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కేజ్రీవాల్ గురువారం ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. 'ఈడీ సమన్లు చట్టవ్యతిరేకంగా ఉన్నాయని నా న్యాయవాదులు చెప్పారు. దీని గురించి ఈడీకి లేఖ రాసినా కూడా అక్కడి నుంచి ఎటువంటి స్పందన లేదు' అని తెలిపారు. మద్యం కేసులో రెండేళ్లుగా దర్యాప్తు జరుపుతున్న ఈడీ సరిగ్గా లోక్‌సభ ఎన్నికల ముందు తనకు సమన్లు జారీ చేయటం.. విచారణ కోసం కాదని, బీజేపీ కోరుకున్నట్లుగా తనను అరెస్టు చేయటం కోసమేనని ఆరోపించారు.

ఢిల్లీ మొహల్లా క్లినిక్‌లపై సీబీఐ దర్యాప్తు

» లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సిఫారసు

న్యూఢిల్లీ, జనవరి 4: ఆప్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొహల్లా క్లినిక్‌లలో జరిగిన అవకతవకలపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సిఫారసు చేశారు. ఈ విషయాన్ని రాజ్ నివాస్ అధికారులు గురువారం వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే ఉద్దేశంతో ఆప్ ప్రభుత్వం ఢిల్లీలో మొహల్లా ఆస్పత్రులను ఏర్పాటు చేసింది. అయితే ఈ ఆస్పత్రులు రోగులు లేనప్పటికీ.. రేడియాలజీ, పాథాలజీ వంటి ఖరీదైన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నకిలీ రిపోర్టులు సృష్టిస్తున్నాయనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై దుమారం రేగడంతో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సీబీఐ విచారణకు సిఫారసు చేశారు.

కంది రైతుల కోసం 'ఈ-సమృద్ధి' పోర్టల్!

న్యూఢిల్లీ, జనవరి 4: దేశంలో కంది పప్పు పండించే రైతుల కోసం 'ఈ-సమృద్ధి' పేరుతో కేంద్రం ఓ పోర్టల్‌ను తీసుకొచ్చింది. దీన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా గురువారం ప్రారంభించారు. ఈ పోర్టల్‌లో కంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా తమ పంటను కనీస మద్దతు ధర లేదా మార్కెట్ ధరలకు విక్రయించుకోవచ్చని ఆయన వెల్లడించారు. 2027 డిసెంబరుకల్లా పప్పు ధాన్యాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఉసిరి, ఎర్ర పప్పు, మొక్కజొన్న రైతులకు ఈ పోర్టల్ సౌకర్యాన్ని కల్పిస్తామని వివరించారు. కంది పప్పు విక్రయానికి సంబంధించి 25 మంది రైతుల ఖాతాలకు రూ.68 లక్షలను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా షా బదిలీ చేశారు.

ఇకమీద రక్తంపై ప్రాసెసింగ్ చార్జీలు మాత్రమే: డీసీజీఐ

న్యూఢిల్లీ, జనవరి 4: రక్తం కోసం ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులు ఎక్కువ డబ్బులు వసూలు చేయడాన్ని కట్టడి చేసేందుకు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) ఓ కీలక నిర్ణయం తీసుకుంది. రక్తంపై ప్రాసెసింగ్ రుసుము మినహా మరే ఇతర రుసుములు వసూలు చేయడానికి వీల్లేదని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని డ్రగ్స్ కంట్రోలర్స్, లైసెన్సింగ్ అథారిటీలకు డీసీజీఐ ఆదేశాలు జారీ చేసింది.

హిజాబ్ సక్రమంగా లేదని అఫ్ఘాన్‌లో మహిళల అరెస్టు

న్యూఢిల్లీ, జనవరి 4: అఫ్ఘానిస్థాన్‌లో మహిళలు ఇస్లామిక్ సంప్రదాయాలను కచ్చితంగా పాటించేలా తాలిబన్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. హిజాబ్‌ను సక్రమంగా ధరించలేదన్న కారణంతో కాబూల్‌కు చెందిన కొందరు మహిళలను అరెస్టు చేసింది. హిజాబ్‌ను సక్రమంగా ధరించినందుకు రెండు మూడు రోజుల క్రితం వారిని అరెస్టు చేశామని ధర్మ-అధర్మాల శాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ గఫార్ ఫరూక్ చెప్పారు. తాలిబన్ల నిబంధనల ప్రకారం మహిళలు తల నుంచి పాదాల వరకు బుర్ఖా ధరించాలి. కేవలం కళ్లు మాత్రమే కనిపించాలి. దీనికి విరుద్ధంగా బుర్ఖా ధరిస్తున్నారన్న కారణంతో మహిళలను అరెస్టు చేస్తున్నారు.

ఈ ఏడాది 68 రాజ్యసభ సీట్లు ఖాళీ

» అందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురు సభ్యులు

న్యూఢిల్లీ, జనవరి 4: రాజ్యసభలో ఈ ఏడాది 68 మంది సభ్యుల పదవీ కాలం ముగియనుంది. వీరిలో తొమ్మిదిమంది కేంద్ర మంత్రులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు, తెలంగాణ నుంచి ముగ్గురు సభ్యులు కూడా ఉన్నారు. ఏపీ నుంచి కనకమేడల రవీంద్రకుమార్(టీడీపీ), సీఎం రమేశ్(బీజేపీ), వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(వైసీపీ), తెలంగాణ నుంచి బీఆర్ఎస్ ఎంపీలు జె.సంతోష్‌కుమార్, వి.రవిచంద్ర, బి.లింగయ్యయాదవ్‌ల పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుంది.

బెంగాల్ 'ఇండియా'లో సీట్ల చిచ్చు!


» కాంగ్రెస్‌కు 2 స్థానాలే ఇస్తామన్న తృణమూల్?

» అధీర్ రంజన్ చౌధురి ఆగ్రహం

» మోదీ సేవలో మమత బిజీగా ఉన్నారని మండిపాటు



కోల్‌కతా, జనవరి 4: విపక్షాల 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య విభేదాలు ముదురుతున్నాయి. ముఖ్యంగా బెంగాల్‌లో పాలక టీఎంసీకి, కాంగ్రెస్ మధ్య సీట్ల పేచీ ఏర్పడింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలతో సర్దుబాటుకు ససేమిరా అంటున్న సీఎం మమతా బెనర్జీ.. కాంగ్రెస్‌కు కూడా రెండు స్థానాలు మాత్రమే కేటాయిస్తామని సమాచారమిచ్చినట్లు వార్తలు వచ్చా యి. దీనిపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత, బెంగాల్ పీసీసీ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌధురి మండిపడ్డారు. మమత ప్రధాని మోదీ సేవలో బిజీగా ఉన్నారని విరుచుకుపడ్డారు. 'ఎన్నికల్లో సొంతగా పోటీచేసే సత్తా కాంగ్రెస్‌కు ఉంది. సీట్ల కోసం టీఎంసీని ముష్టెత్తం. మమత దయాదాక్షిణ్యాలు మాకు అక్కర్లేదు. మేం ఎన్ని సీట్లలో పోటీచేయాలో వారెలా నిర్ణయిస్తారు? మాతో పొత్తు కావాలని ఆమే అన్నారు. నిజానికి ఆమెకే ఇది ఇష్టం లేదు. ఈడీ, సీబీఐల నుంచి తప్పించుకోవడానికి మోదీని సంతృప్తిపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు' అని ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 42 ఎంపీ స్థానాలకు గాను టీఎంసీ 22, బీజేపీ 18, కాంగ్రెస్ రెండు చోట్ల గెలిచాయి. కాంగ్రెస్ గెలిచిన బెర్హంపూర్, మాల్దా సౌత్ మాత్రమే ఇస్తామని.. మరీ ఒత్తిడి తెస్తే ఇంకో రెండు ఇద్దామని మమత ప్రతిపాదించినట్లు తెలిసింది. ఆమెపై విమర్శలు గుప్పించిన అధీర్‌ను టీఎంసీ ఎంపీ సౌగతారాయ్ తప్పుబట్టారు. 'కూటమి పార్టీలపై విమర్శలు చేస్తూ సీట్ల సర్దుబాటు అంటే కుదరదు. అధీర్, ఇంకొందరు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు రోజూ మమ్మల్ని అవమానిస్తున్నారు. బెంగాల్లో మాతో పొత్తు కావాలనుకుంటే ఆ పార్టీ అధిష్ఠానం అధీర్‌ను అదుపులో పెట్టాలి' అని డిమాండ్ చేశారు. సీట్ల సర్దుబాటులో ఆయా రాష్ట్రాల్లో సారథ్య పార్టీ మాటే చెల్లుబాటు కావాలని టీఎంసీ పట్టుబడుతోంది.



392 స్తంభాలు.. 44 ద్వారాలు!

అయోధ్య రామమందిరం నాగరా శైలిలో నిర్మాణం

అయోధ్య, జనవరి 4: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయాన్ని జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ గర్భగుడిలో రామ్ లల్లా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. ఈ క్రతువు పూర్తయిన తర్వాత 24వ తేదీ నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ప్రతిష్ఠాపన మహోత్సవానికి ముహూర్తం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆలయానికి సంబంధించిన కీలక విశేషాలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మీడియాతో పంచుకుంది. ఉత్తర భారతానికి చెందిన సంప్రదాయ నాగరా శైలిలో రామమందిరం నిర్మితమవుతోంది. ఈ మందిరం పొడవు (తూరు-పడమర) 380 అడుగులు, వెడల్పు 250 అడుగులు, ఎత్తు 161 అడుగులు. ఆలయంలోని స్తంభాలు, గోడలపై వివిధ దేవతామూర్తుల శిల్పాలను సుందరంగా తీర్చిదిద్దారు. మూడు అంతస్తులుగా ఉండే మందిరంలో ఒక్కో అంతస్తు 20అడుగుల ఎత్తు ఉంటుంది. ఈ ఆలయంలో 392 స్తంభాలు, 44 ద్వారాలు ఉన్నాయి. ప్రధాన గర్భగుడిలో బాల రాముడి విగ్రహం కొలువు తీరుతుంది. మొదటి అంతస్తులో శ్రీరామ దర్బార్ ఉంటుంది. ఇక్కడ మొత్తం ఐదు (నృత్య, రంగ్, సభా, ప్రార్థనా, కీర్తనా) మండపాలు ఉంటాయి. తూర్పువైపు ఉన్న సింహద్వారం నుంచి భక్తులు 32 మెట్లు ఎక్కి ఆలయం లోపలికి ప్రవేశిస్తారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం లిఫ్టులు, ర్యాంపులు ఏర్పాటు చేశారు. మందిరం చుట్టూ 732 మీటర్ల పొడవు, 14 అడుగుల వెడల్పుతో దీర్ఘచతురస్రాకారంలో భారీ ప్రహరీని నిర్మించారు. ఈ ప్రహరీ నాలుగు మూలల్లో సూర్యుడు, దేవీ భగవతి, వినాయకుడు, శివుడి మందిరాలు ఉన్నాయి. ఉత్తరాన అన్నపూర్ణాదేవి, దక్షిణ భాగంలో హనుమాన్ మందిరం ఏర్పాటు చేశారు. ఆలయానికి సమీపంలో పురాతన కాలం నాటి చారిత్రక బావి (సీతా కూప్) ఉంది. మందిర సముదాయంలో వాల్మీకి, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, అగస్త్య మహర్షుల ఆలయాలతో పాటు దేవీ అహల్య, నిషాద్ రాజ్ (గుహుడు), శబరికి ప్రత్యేకంగా మందిరాలు నిర్మించనున్నారు. ఈ సముదాయం నైరుతి భాగంలో కుబేర్ తిలా వద్ద జటాయువు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అక్కడున్న పురాతన శివాలయాన్ని పునరుద్ధరించారు. కాగా, ఇక్కడి నిర్మాణాల్లో ఎక్కడా ఇనుమును వాడలేదు. భూమిలో నుంచి వచ్చే తేమ నుంచి రక్షణ కోసం 21 అడుగుల ఎత్తయిన గ్రానైట్ స్తంభాన్ని నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌లో మురుగునీటి శుద్ధి ప్లాంట్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ కోసం నీటి సరఫరా ఏర్పాట్లు, పవర్ స్టేషన్ ఉన్నాయి. ఒకేసారి 25వేల మందికి వసతి కల్పించేందుకు యాత్రికుల వసతి కేంద్రాన్ని(పీఎఫ్‌సీ) నిర్మిస్తున్నారు. భక్తులకు వైద్య, లాకర్ సదుపాయాలు కల్పిస్తారు. భక్తులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానాల కోసం ప్రత్యేక బ్లాక్ ఉంది. ఈ మందిరాన్ని పూర్తిగా భారత సంప్రదాయ విధానంలో, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నట్లు ట్రస్ట్ వివరించింది. ఆలయ నిర్మాణానికి రూ.1,400 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనా.



ప్రతిష్ఠ రోజునే రాముడి తొలి దర్శనం

అయోధ్యలో జనవరి 22న మధ్యాహ్నం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరిగే వరకూ గర్భగుడిలో ఏర్పాటు చేయనున్న రామ్ లల్లా విగ్రహాన్ని అత్యంత గోప్యంగా ఉంచనున్నారు. స్వామిని ప్రతిష్ఠించే ముందు వరకూ విగ్రహం ముఖాన్ని చూడటం ఎవరికీ సాధ్యం కాదని ఆలయ వర్గాలు స్పష్టం చేశాయి. గర్భాలయంలో ఉంచడానికి ఎంపిక చేసిన మూడు విగ్రహాలలో ఏ విగ్రహాన్ని ఎంపిక చేశారనే దానిపై అధికారిక ప్రకటనతో ఎలాంటి ప్రయోజనం ఉండబోదని పేర్కొన్నాయి. ట్రస్టు సభ్యులు అందరూ కలిసి విగ్రహాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసిన తర్వాత దీనిపై ట్రస్టు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ప్రకటన చేస్తారని ట్రస్ట్ సభ్యుడు కామేశ్వర్ చౌపాల్ తెలిపారు.

రాముడు మా కుటుంబ దేవుడు

» కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): 'శ్రీరామచంద్రుడు మా కుటుంబ దేవుడు. నేను ఆయనకు పరమ భక్తుడిని' అంటూ కర్ణాటకలోని రామనగరం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రామనగరంలో ప్రతియేటా తాము రామోత్సవం జరుపుకొంటామని, ఇది కులమతాలకు అతీతంగా, లౌకిక భావాలను కలిగి ఉంటుందన్నారు. 'రాముడు మనందరి దేవుడు. ఇది ముమ్మాటికీ సత్యం' అని ఆయన పేర్కొన్నారు. బాల్యంలో తామంతా సరస్వతీదేవి, లక్ష్మీదేవి, గణపతిని ఆరాధించే వాళ్లమని, కాంగ్రెస్ ఏనాడూ దేవుళ్లను రాజకీయాలకోసం వాడుకోలేదని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారు అయోధ్య రామమందిరం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

బాలరామ విగ్రహంపై 17న తుది నిర్ణయం

» ఉడుపి పెజావర మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ స్వామిజీ

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో ప్రతిష్ఠించనున్న బాలరామ విగ్రహంపై నిర్ణయాన్ని ఈ నెల 17న అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ విషయాన్ని ఉడుపి పెజావర మఠాధిపతి, అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు విశ్వప్రసన్న తీర్థస్వామిజీ గురువారం ఉడుపిలో మీడియాకు వెల్లడించారు. మొత్తం మూడు పవిత్ర శిలలపై చెక్కిన మూర్తుల విగ్రహాలు చాలా అద్భుతంగా ఉన్నాయని, ఇందులో ఒక మూర్తిని ఎంపిక చేస్తామని తెలిపారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం జరుగుతున్న వేళ పాత కేసులను తిరగదోడి, కరసేవకుడిని అరెస్టు చేయడం సముచితం కాదని ఆయన కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా అయోధ్యలో రామమందిరం ప్రారంభం కానున్న ఈనెల 22న రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు ప్రకటించాలని ఆయన కోరారు.

లోకం తీరు



పొగమంచులోనూ

రైళ్లు రయ్ రయ్..

» ఫాగ్‌పాస్ పరికరాల్ని సమకూర్చిన రైల్వే

» లోకో పైలట్లకు ఎంతో ఉపయోగకరం

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రైళ్లు ఆలస్యంగా నడుస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. గంటకు 130 కి.మీ. వేగంతో ప్రయాణించాల్సి రైళ్లు కూడా 30 నుంచి 40 కి.మీ. వేగంతోనే వెళుతుంటాయి. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోనూ ఈ సమస్య ఉంది. ప్రధానంగా శబరి, ప్రశాంతి, అమరావతి, ఫలక్‌నుమా తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లపై శీతాకాలంలో మంచు ప్రభావం అధికంగా ఉండేది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. అయితే ఈ కష్టాలన్నింటికీ చెక్ పెడుతూ.. పొగ మంచులోనూ రైళ్లు రయ్ రయ్ మంటూ దూసుకెళ్లి సకాలంలో గమ్యస్థానాలకు చేరేలా రైల్వేశాఖ ఇటీవల ఫాగ్‌పాస్ పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. ఇవి అన్ని ఈఎంయూ, మెమూ, డెమూ రైళ్లకూ సరిపోతాయి. సింగిల్ లేన్, డబుల్ లేన్, ఎలక్ట్రిఫైడ్, నాన్ ఎలక్ట్రిఫైడ్ సెక్షన్లలోనూ ఉపయోగపడతాయి. ఎలాంటి వాతావరణంలోనైనా ఈ పరికరాలు పని చేస్తాయని రైల్వేశాఖ చెబుతోంది.

ఈ పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఫాగ్‌పాస్ జీపీఎస్ ఆధారిత నేవిగేషన్ డివైస్. ఇది ఆన్‌బోర్డు రియల్‌టైం సమాచారాన్ని లోకో పైలట్‌కు అందిస్తుంది. డిస్‌ప్లేతోపాటు వాయిస్ ద్వారానూ సమాచారం ఇస్తుంది. రైలు వెళ్లే మార్గంలో వచ్చే సిగ్నల్స్ లెవల్ క్రాసింగ్ గేట్‌లు, వేగ నియంత్రణ, న్యూట్రల్ సెక్షన్ల గురించి తెలియజేస్తుంది. ఈ పరికరానికి 18 గంటల పాటు బ్యాటరీ బ్యాకప్ కలిగిన బిల్ట్-ఇన్-రీచార్జబుల్ బ్యాటరీ ఉంటుంది. దీని బరువు కూడా 1.5 కిలోలే. లోకో పైలట్ విధులకు హాజరయ్యేటప్పుడు తన చేతిలో పట్టుకుని తీసుకెళ్లవచ్చు.

రాష్ట్రాన్ని బట్టి వాటా

సీట్ల పంపకాలకు రాష్ట్రాల్లోని పరిస్థితులే ప్రామాణికం

» 255 స్థానాలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

» త్వరలోనే ఇండియా కూటమితో చర్చలు

» అభ్యర్థుల ఎంపిక కసరత్తు ప్రారంభం

» పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జీలు, పీసీసీ చీఫ్‌లు, సీఎల్పీ నేతలతో మల్లికార్జున ఖర్గే, రాహుల్ భేటీ

న్యూఢిల్లీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో ఎన్నికల మూడ్‌లోకి వచ్చేసింది. పార్టీకి కీలకంగా మారనున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, మేనిఫెస్టో, సీట్ల పంపకాలపై ఏఐసీసీ స్థాయిలో చర్చలు ప్రారంభించింది. మొత్తం లోక్‌సభ సీట్లలో (453 సీట్లలో) గెలుపు అవకాశం ఉన్న 255 నియోజకవర్గాలపై పూర్తిస్థాయిలో శక్తిసామర్థ్యాలను కేంద్రీకరించాలని నిర్ణయించింది. ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులు ఆధారంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్యపక్షాలతో సీట్ల పంపకాలపై చర్చ లు జరపాలని తీర్మానించింది. రానున్న రోజుల్లో రాత్రీ పగలూ శక్తివంచన లేకుండా పనిచేయాలని, లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అందించేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. ఆధునిక భారత నిర్మాణంలో, దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పునాది వేయటంలో కాంగ్రెస్ పోషించిన పాత్రను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, చరిత్రను మరిపోయేవారు చరిత్రను సృష్టించలేరని చెప్పారు. కాంగ్రెస్ కృషిని కావాలనే తెరమరుగు ప్రయత్నం చేసే మోదీ ప్రభుత్వానికి గట్టి సమాధానం చెప్పాలన్నారు. గురువారం కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఖర్గే అధ్యక్షతన పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జిలు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో సమావేశం జరిగింది. మూడు గంటలకు పైగా జరిగిన ఈ భేటీకి పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ కూడా హాజరయ్యారు. సగానికిపైగా లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ పోటీ చేయాలని, గెలిచే అవకాశం ఉన్న స్థానాలపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలని, తొలి జాబితాను అధిష్ఠానానికి పంపించాలని రాష్ట్రాల విభాగాలను ఆదేశించారు. ఈ వారంలో అన్ని రాష్ట్రాలకు స్ర్కీనింగ్ కమిటీలను కూడా పార్టీ హైకమాండ్ నియమించనుంది. వీలైనంత త్వరలో అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇదే సమయంలో ప్రజలకు సానుకూల అజెండాను అందించే లక్ష్యంతో మేనిఫెస్టోను రూపొందించే బాధ్యతను సంబంధిత కమిటీకి అధిష్ఠానం అప్పగించింది. మేనిఫెస్టో కమిటీ తొలిసారిగా సమావేశమై, అజెండాలో చేర్చాల్సిన అంశాలను చర్చించింది. మరోవైపు, భాగస్వామ్య పక్షాలతో సీట్ల పంపకాలపై కసరత్తు కోసం నియమించిన 'జాతీయ అలయన్స్ కమిటీ' ఖర్గేతో ఆయన నివాసంలో సమావేశమై తుదిదఫా చర్చలు జరిపింది. ఈ భేటీలో రాహుల్ కూడా పాల్గొన్నారు. ఇప్పటికే అన్ని రాష్ట్రాల కమిటీలతో చర్చించి నమోదు చేసిన వివరాలను ఖర్గేకు అందించింది. అనంతరం కమిటీ కన్వీనర్ మీడియాతో మాట్లాడుతూ..వేర్వేరు రాష్ట్రాల్లో భిన్న పరిస్థితులు ఉన్నందున రాష్ట్ర స్థాయిలో సీట్ల పంపకాలపై చర్చలు ఉంటాయని, వీలైనంత త్వరలోనే ఇండియా కూటమి పార్టీలతో చర్చలు ప్రారంభిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఇండియా కూటమిని అధికారంలోకి తేవటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అలయన్స్ కమిటీలో మాజీ సీఎంలు అశోక్ గెహ్లోత్, భూపేశ్ బఘేల్‌లతోపాటు సల్మాన్ ఖుర్షీద్, మోహన్ ప్రకాశ్ సభ్యులుగా ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఖర్గే, రాహుల్, ప్రియాంక

అరుణాచల్‌లోనూ రాహుల్ యాత్ర

జనవరి 14న మణిపూర్ నుంచి ప్రారంభమయ్యే రాహుల్ గాంధీ యాత్ర మార్గాన్ని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. తొలుత భారత్ న్యాయ యాత్ర అని అనుకున్నప్పటికీ.. 'భారత్ జోడో'ను కూడా కలిపి భారత్ జోడో న్యాయ యాత్రగా దీని పేరును మార్చారు. రాహుల్ గతంలో జరిపిన భారత్ జోడో యాత్ర గొప్ప ప్రజాదరణ పొందిన దృష్ట్యా.. ఆ పేరును జోడించాలని ఖర్గేతో సహా అందరూ అభిప్రాయపడ్డారని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ మీడియాకు తెలిపారు. కాగా యాత్రలో అరుణాచల్‌ప్రదేశ్‌ను కూడా చేర్చుతూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాలు, 100 లోక్‌సభ, 337 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర సాగనుంది. 67 రోజుల పాటు 6,713 కి.మీ.ల మేర రాహుల్ యాత్ర నిర్వహిస్తారని జైరాం వెల్లడించారు. కాగా, యూపీలో అత్యధికంగా 11 రోజుల పాటు యాత్ర సాగనుంది.

కూటమి కోసం దేనికైనా ఓకే..

వివిధ రాష్ట్రాల్లో బలమైన పొత్తులు ఏర్పర్చుకుని పోటీ చేయాలని, ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోవద్దని సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు అందరూ అభిప్రాయపడ్డారు. ఇండియా కూటమిని బలోపేతం చేయటానికి పార్టీ అధ్యక్షుడు ఖర్గే తీసుకునే ఏ నిర్ణయానికైనా సంపూర్ణంగా మద్దతు ఇస్తామని ముక్తకంఠంతో చెప్పారు. గత పదేళ్ల మోదీ పాలనలో జరిగిన వైఫల్యాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని, దేశ నిర్మాణం కోసం ఎజెండాను ప్రకటించాలని సమావేశం తీర్మానించింది. లోక్‌సభ ఎన్నికల కోసం పార్టీ చేపట్టిన విరాళాల సేకరణ ఆశించిన స్థాయిలో జరగటం లేదని, రెండు వారాల్లో కేవలం రూ.11 కోట్లు మాత్రమే వచ్చాయని, అన్ని రాష్ట్రాల పార్టీల విభాగాలు దీనిపై శ్రద్ధ పెట్టాలని నిర్ణయించారు.

బీజేపీ అబద్ధాలను తిప్పికొట్టాలి

ఏఐసీసీలో జరిగిన కాంగ్రెస్ నేతల సమావేశాన్ని ప్రారంభిస్తూ ఖర్గే ప్రసంగించారు. మోదీ పదేళ్ల పాలన తాలూకు వైఫల్యాలను కప్పిపుచ్చటానికి బీజేపీ భావోద్వేగపూరిత అంశాలను లేవనెత్తుతున్నదని విమర్శించారు. బీజేపీ వాళ్లు కావాలనే ప్రతి అంశంలో కాంగ్రెస్‌పై బురద చల్లుతున్నారని, పార్టీ శ్రేణులు సమైక్యంగా ఉండి ఈ అబద్ధాలను తిప్పికొట్టాలన్నారు. తమ మధ్య ఉండే విభేదాలను పక్కనపెట్టి ఒకే టీమ్‌లాగా పని చేయాలని, పార్టీలోని అంతర్గత అంశాలను మీడియా ముందు లేవనెత్తవద్దని, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని నేతలకు సూచించారు. ఇండియా కూటమి క్షేత్రస్థాయిలో కార్యకర్తల బలం, బలమైన సిద్ధాంతంతో కూడిన పార్టీల వేదిక అని ఖర్గే చెప్పారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుందనే భరోసాతో పని చేయాలని, తద్వారా కూటమి గెలుపునకు అవసరమైన విధంగా ప్రజాభిప్రాయాన్ని మలచాలని సూచించారు. పార్టీని నష్టపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని, పార్టీ క్రమశిక్షణ పాటించని వారిపై అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

అవహేళన చేసిన టీఎంసీ ఎంపీకి ఉపరాష్ట్రపతి జన్మదిన శుభాకాంక్షలు

» విందుకు కూడా ఆహ్వానించిన ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, జనవరి 4: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజకీయ పరిణతి చూపారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సమయంలో మిమిక్రీ ద్వారా తనను అవహేళన చేసిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడమే గాక.. విందుకు రావాలని ఆహ్వానించారు. ఇందుకు గాను బెనర్జీ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. బెనర్జీ పార్లమెంటు మకర ద్వారం వద్ద ధన్‌ఖడ్‌ను అపహసిస్తూ మిమిక్రీ చేస్తుండగా.. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ వీడియో తీసిన సంగతి తెలిసిందే. ఎంపీ ప్రవర్తనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తినా ఆయన విచారం కూడా వ్యక్తంచేయలేదు. పైగా వెయ్యి సార్లు మిమిక్రీ చేస్తానని ప్రకటించారు. గురువారం బెనర్జీ పుట్టిన రోజు కావడంతో ఉపరాష్ట్రపతి స్వయంగా ఫోన్ చేసి ఆయన భార్యతో సంభాషించారు. 'నాకు శుభాకాంక్షలు చెప్పడమే గాక.. నా కుటుంబాన్ని ఉపరాష్ట్రపతి ఆశీర్వదించారు. విందుకు రావాలని ఆహ్వానించారు' అని కల్యాణ్ బెనర్జీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

మోదీ సాహస ఈత



ప్రధాని నరేంద్రమోదీ లక్షద్వీప్ పర్యటనలో భాగంగా సముద్రంలో స్నార్కెలింగ్(సాహసంతో కూడిన ఈత) చేశారు. సముద్రపు అడుగున ఉండే జీవరాశులను పరిశీలించారు. సముద్రపు ఒడ్డున నడుస్తూ.. దీవులలోని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. కొద్దిసేపు అక్కడే సేద తీరారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆయన తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పోస్టు చేశారు. 140 కోట్ల భారతీయుల సంక్షేమం కోసం ఇంకెంత కష్టపడాలో తనకు ఈ వాతావరణం నేర్పిందని, సాహసాలు చేయాలనుకునేవారు తమ లిస్టులో లక్షద్వీప్‌ను కూడా చేర్చుకోవాలని మోదీ సూచించారు.

అమెరికా సెక్స్ కుంభకోణంలో.. బిల్ క్లింటన్, ట్రంప్, ప్రముఖుల పేర్లు

» పత్రాలను బహిర్గతం చేసిన కోర్టు

న్యూయార్క్, జనవరి 4: అమెరికాను కుదిపేసిన హైప్రొఫైల్ సెక్స్ కుంభకోణంలో పత్రాలను న్యూయార్క్ కోర్టు బుధవారం బహిర్గతం చేసింది. జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఈ కేసులో.. అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, డొనాల్డ్ ట్రంప్, పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్, బ్రిటన్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్స్ ఆండ్రూ సహా.. పలువురు ప్రముఖులు, సంపన్నుల పేర్లు ఉన్నాయి. తొలివిడతగా 40 పత్రాలను విడుదల చేసిన న్యాయమూర్తి.. ఈ పత్రాలు ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లాయని, అందుకే బయటపెడుతున్నట్లు తెలిపారు. ప్రముఖ ఫైనాన్సర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ బాలికలు, యువతులకు డబ్బు ఎరవేసి, వారిని సెక్స్ కుంభకోణంలోకి లాగినట్లు అభియోగపత్రాలు స్పష్టం చేస్తున్నాయి. పేద, మధ్యతరగతి బాలికలకు భారీమొత్తంలో డబ్బు ఎరవేసి.. పామ్‌బీచ్(ఫ్లోరిడా)తోపాటు.. న్యూయార్క్, వర్జిన్ ఐల్యాండ్స్, న్యూమెక్సికోలోని తన ఇళ్లకు పిలిపించుకుని, అఘాయిత్యాలకు పాల్పడేవాడు. ఈ చీకటి వ్యవహారం 2005లో తొలిసారి బయటపడింది. 2019లో ఓ కేసులో జెఫ్రీ జైలుకెళ్లాడు. అదే ఏడాది ఆగస్టులో జెఫ్రీ జైల్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు.

రైలులో ప్రయాణికురాలిపై

వీర్య స్కలనం..

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రైలులో నిద్రిస్తున్న మహిళ ముఖంపై వీర్యస్కలనం చేసిన వ్యక్తిని ఉత్తరకన్నడ జిల్లా గోకర్ణలో బుధవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. కేరళ రాష్ట్రం కోజికోడ్‌కు చెందిన ఓ యువతి, ఆమె స్నేహితులు ఇద్దరు సినిమాటోగ్రఫీ, వీడియో గ్రాఫర్‌లుగా పనిచేస్తున్నారు. వీరు గోవాలో కొన్ని వీడియోలు చిత్రీకరించేందుకు కేరళ నుంచి గోవాకు వెళ్లే రైలులో బయలుదేరారు. ఆమె స్నేహితులిద్దరికి ఒక చోట, ఆమెకు మరోచోట బెర్త్ లభించడంతో అక్కడే నిద్రపోయారు. రైలు బుధవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో గోకర్ణ స్టేషన్‌కు చేరింది. ఆ సమయంలో మహారాష్ట్రలోని సాంగ్లి పట్టణానికి చెందిన దత్తాత్రేయ చవాన్ అనే వ్యక్తి యువతి బెర్త్ వద్దకు వచ్చి హస్త ప్రయోగం చేశాడు. అలికిడి నిద్రలేచిన యువతి.. గట్టిగా కేకలు వేసింది. దీంతో ఆమె స్నేహితులు, తోటి ప్రయాణికులు మేల్కొని అతడిని పట్టుకుని చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించారు.


ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో షర్మిల

కాంగ్రెస్‌లోకి షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

వారించారు. అనంతరం షర్మిల ప్రసంగిస్తూ.. తన వైఎస్ఆర్‌టీపీని కాంగ్రెస్‌లో సంతోషంగా విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి ఆ పార్టీ వేరు కాదని.. కాంగ్రెస్‌లో అంతర్భాగమని స్పష్టం చేశారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితమంతా కాంగ్రెస్ కోసమే పనిచేశారని, కాంగ్రెస్ సేవలోనే మరణించారని, తన జీవితాన్ని పార్టీ కోసమే బలిచేశారని చెప్పారు. ఆయన కూతురుగా ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నానని తెలిపారు. ఇవాళ ఆయన బిడ్డ కాంగ్రెస్‌లో చేరుతున్నందుకు ఆయన ఎక్కడున్నా సంతోషిస్తారని, గర్వపడతారని అన్నారు. అనంతరం షర్మిల 10-జన్‌పథ్‌కు వెళ్లి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీని కలుసుకున్నారు.

అండమాన్‌లో పనిచేయాలన్నా..

కాంగ్రెస్ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా విధేయతతో, నిజాయితీగా నిర్వహిస్తానని, అండమాన్‌లో పనిచేయమన్నా మనస్ఫూర్తిగా పనిచేస్తానని షర్మిల విలేకరులకు చెప్పారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలని తన తండ్రి కల గన్నారని, దానిని నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు ఏ బాధ్యతలు అప్పజెబుతారన్నది ఒకట్రెండు రోజుల్లో తెలుస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా అని అడుగగా.. పార్టీ ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని బదులిచ్చారు. 'కాంగ్రెస్ దేశంలో అతి పెద్ద లౌకిక పార్టీ. అది దేశ సంస్కృతిని కాపాడింది. ఈ దేశ పునాదిని నిర్మించింది కాంగ్రెస్ పార్టీయే. దేశంలో అన్ని వర్గాలకు సేవలందించింది. రాహుల్ భారత్ జోడో యాత్ర ద్వారా భారత ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. ఆయన వల్లే కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించింది. తెలంగాణలో కూడా గెలవడం ఖాయమని తెలిసి.. కేసీఆర్ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండేందుకు కాంగ్రెస్ కు మద్దతిచ్చాను. తెలంగాణలో కాంగ్రెస్ విజయంలో ఆ రకంగా నా పాత్ర కూడా ఉన్నందుకు సంతోషంగా ఉంది. కుల, మత, వర్గ తేడాల్లేకుండా ప్రతి సెవర్గానికీ నమ్మకం కలిగించే పార్టీ కాంగ్రెస్. రాహుల్, ఖర్గే నాయకత్వంలో ప్రజలకు మేలు చేస్తుందన్న విశ్వాసం నాకుంది' అని తెలిపారు.

మణిపూర్ క్రూర ఘటనలను క్రైస్తవురాలిగా జీర్ణించుకోలేకపోతున్నా: షర్మిల

'మణిపూర్‌లో క్రూర ఘటనలను ఓ క్రైస్తవురాలిగా ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాను. అక్కడ 2 వేల చర్చిలను ధ్వంసం చేశారు. 60 వేల మంది నిరాశ్రయులయ్యారు. లౌకిక పార్టీ అధికారంలో లేకపోతే ఏం జరుగుతుందో నాకు అప్పుడే తెలిసింది. ఆ రోజే కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని నిర్ణయించాను' అని షర్మిల అన్నారు.

పీసీసీ బాధ్యతలపై మల్లగుల్లాలు

మరోవైపు.. షర్మిలకు ఏ బాధ్యతలు అప్పజెప్పాలన్న అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం తర్జనభర్జన పడుతోంది. గురువారం ఉదయం పార్టీలో చేరకముందు షర్మిల, ఆమె భర్త అనిల్.. కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు కూడా ఉన్నారు. ఆ తర్వాత షర్మిల, అనిల్ తమ శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ మధ్యవర్తులతో చర్చలు జరిపారు. పీసీసీ అధ్యక్ష పదవి నుంచి స్టార్ క్యాంపెయినర్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పదవులు ఇవ్వడంపైనా చర్చలు జరిగాయి. రాహుల్ మాత్రం ఆమెకు రాష్ట్ర సారథ్యమే అప్పజెప్పే ఉద్దేశంతో ఉన్నట్లు ఏఐసీసీ వర్గాలు అంటున్నాయి. ఏ పదవి ఇచ్చేదీ ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని చెబుతున్నాయి.


పోస్టాఫీసులో బాధితులతో మాట్లాడుతున్న సీఐ భీసన్న

కోర్టులో లొంగిపోయిన
బెట్టింగ్ 'మాస్టర్'

- తండ్రి పేరుతో ఖాతా తెరిచి పోస్టాఫీసు ఖాతాదారుల సొమ్ము మళ్లించినట్టు గుర్తింపు

నాగార్జునసాగర్, జనవరి 4: క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి ఖాతాదారుల సొమ్ము రూ.1.50 కోట్లు కాజేసిన సబ్ పోస్టుమాస్టర్ పెరుమాళ్ల రామకృష్ణ నల్లగొండ కోర్టులో లొంగిపోయాడు. అతను నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని బ్రాంచి పోస్టాఫీసులో ఈ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. రెండేళ్లుగా అతను ఈ పోస్టాఫీసులో పనిచేస్తున్నాడు. పోస్టాఫీసులో తన తండ్రి వెంకటేశ్వర్లు పేరిట ఖాతా తెరిచి... దానిలోకి ప్రజల సొమ్ము మళ్లించాడని పోలీసుల విచారణలో తేలింది. ఈ ఖాతా తెరిచినట్టు అతని తండ్రికి సైతం తెలియదు. ఆ ఖాతాకు సంబంధించి మెసేజ్‌ల వచ్చేందుకు తన సొంత మొబైల్ నంబరు లింక్ చేసుకున్నాడు. ఖాతాదారుల సొమ్ము మళ్లించిన విషయం వారికి తెలియకుండా ఉండేందుకు వారి ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లకుండా బ్లాక్ చేశాడు. రామకృష్ణ స్వయంగా గత నెల 30న నల్లగొండ కోర్టుకు వెళ్లి లొంగిపోయాడు. రామకృష్ణ తండ్రి వెంకటేశ్వర్లు, సోదరుడు నవీన్, స్నేహితులను పోలీసులు విచారణ చేశారు. రామకృష్ణ కాజేసిన సొమ్మును ఏం చేశాడు?.. ఏమైనా ఆస్తులు కొన్నాడా?.. అన్న కోణంలో ఆరా తీశారు. ఆ సొమ్మును బెట్టింగులు, జల్సాలకు ఖర్చు చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. బాధితులకు న్యాయం చేస్తామని నాగార్జునసాగర్ సీఐ భీసన్న తెలిపారు. ఆయన సబ్ పోస్టాఫీసుకు వెళ్లి రికార్డులు, ఖాతాదారుల పాస్ పుస్తకాలను పరిశీలించారు.

చివరిదాకా జనం
బయటపడరు జాగ్రత్త!

(మొదటి పేజీ తరువాయి)

ఏకాంతంగా చర్చలు జరపడం గమనార్హం. ఆరోగ్య పరామర్శతోపాటు రాజకీయ కోణంలోనూ ఈ సమావేశం జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

అందరితో కలిసి వెళ్లి...

ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో కలిసి వైఎస్ జగన్ ప్రత్యేక విమానంలో గురువారం హైదరాబాద్‌కు వచ్చారు. ఉదయం 11.40 గంటలకు బేగంపేట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకుని, గంటకుపైగా గడిపారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స, ప్రస్తుత పరిస్థితి, కోలుకునేందుకు ఎంత సమయం పడుతుంది... ఇలాంటి వివరాలను కేసీఆర్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఏకైక 'రాజకీయ గురువు'

జాతీయ రాజకీయాల్లో జగన్ ఒంటరి! ఏ కూటమిలోనూ ఉండరు. ఎవరితోనూ సన్నిహితంగా మెలగరు. ఢిల్లీలో ముఖ్యమంత్రుల సదస్సులో పాల్గొన్నా అటూఇటూ దిక్కులు చూస్తారే తప్ప ఒక్కరితోనూ మాట కూడా కలపరు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ఆయనవి పక్కా సొంత అవసరాలే! 'ఉభయ కుశలోపరి' తరహాలో కేంద్రంతో ఆయన సంబంధాలు ఉంటాయి. ఇక ఆయనకు ఏకైక సన్నిహితుడు, రాజకీయ గురువు కేసీఆర్ ఒక్కరే. వీరిద్దరి రాజకీయ శత్రువు చంద్రబాబు కావడంతో శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా కేసీఆర్‌కు దగ్గరయ్యారు. గత ఎన్నికల్లో జగన్ గెలుపు కోసం... అప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న కేసీఆర్ సంపూర్ణ సహకారం అందించారు. తాజాగా జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుపుకోసం జగన్ లోపాయికారీగా సహకరించారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ కోసం జగన్ ఎంతగానో పరితపించారు. కానీ... నిరాశే మిగిలింది. 'తదుపరి వంతు జగన్‌దే. ఏపీలో ఆయన ఓటమి ఖాయం' అనే ప్రచారం జోరందుకుంది. సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఇవ్వడమే కేసీఆర్ ఓటమికి కారణమనే సూత్రీకరణ నేపథ్యంలో... జగన్ ఇక్కడ సిట్టింగ్‌లను మార్చే పనిలో పడ్డారు. కానీ... ఆయన చేస్తున్న ప్రయోగాలన్నీ వికటిస్తున్నాయి. ఐప్యాక్‌తో సహా ఇతర అన్ని సర్వేల్లో జగన్‌కు ప్రతికూల ఫలితాలే కనిపిస్తున్నాయి. సిట్టింగ్‌ల మార్పు ప్రక్రియ వికటిస్తోంది. కొందరి విషయంలో బెట్టు వీడి మెట్టు దిగాల్సి వస్తోంది. ఇప్పుడు కంట్లో నలుసులా.. సొంత చెల్లెలు షర్మిల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టికెట్లు దక్కని వారు ఎదురు తిరుగుతున్నారు. కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. దీంతో రాజకీయంగా జగన్‌కు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలోనే 'పాహిమాం' అంటూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ వద్దకు సలహాల కోసం పరుగులు తీసినట్లు తెలుస్తోంది.


కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీ సీఎం జగన్

పనిలో పనిగా తల్లి వద్దకు...

కేసీఆర్‌ను పరామర్శించేందుకు హైదరాబాద్ వచ్చిన జగన్... పనిలోపనిగా లోటస్‌పాండ్‌లో ఉన్న తల్లి వద్దకు కూడా వెళ్లారు. షర్మిల ఢిల్లీకి వెళ్లడంతో విజయలక్ష్మి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. అక్కడ జగన్ అరగంట మాత్రమే ఉన్నారు. సోదరి కాంగ్రెస్‌లో చేరినప్పటికీ... తల్లిని మాత్రం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవొద్దని జగన్ కోరినట్లు తెలుస్తోంది.

ఏకాంతంగా చర్చించి...

పరామర్శ తర్వాత కేటీఆర్ సహా అందరినీ బయటికి పంపించారు. కేసీఆర్‌తో జగన్ కొద్దిసేపు ఏకాంతంగా చర్చించుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... చుట్టుముడుతున్న సమస్యల నుంచి బయటపడి, వచ్చే ఎన్నికల్లో గట్టెక్కడంపై కేసీఆర్ సలహాలు, సూచనలు తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమిని ఊహించలేదని కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ తర్వాతే పరిస్థితి మారిందని చెప్పినట్లు సమాచారం. "అంతా బాగుందనుకున్నాం. కానీ... ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక 40 రోజుల్లో మార్పు కనిపించింది. ఇది ఊహించని పరిణామం" అని పేర్కొన్నట్లు తెలిసింది. దీంతోపాటు... 'అధికారంలో ఉన్న పార్టీపై ప్రజలు తమ వ్యతిరేకతను ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు బయట పెట్టరు.. జాగ్రత్త' అని జగన్‌ను హెచ్చరించినట్లు తెలుస్తోంది.

ఈఎంఐ తేదీలు మార్చుకోండి!

- హోంగార్డులకు అధికారుల సలహా
- జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం.. హోంగార్డుల ఇబ్బందులు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హోంగార్డుల పరిస్థితులు మారడం లేదు. ప్రతినెలా జీతం కోసం వేయి కళ్లతో ఎదురు చూడక తప్పడం లేదు. పోలీస్ శాఖలో కానిస్టేబుళ్లకు సమానంగా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రతి నెలా 12వ తేదీ తర్వాతే వేతనం జమ అవుతోంది. దాంతో ఈఎంఐలు సమయానికి కట్టలేక తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్తే ఈఎంఐల తేదీలు మార్చుకోవాలని అధికారులు సలహా ఇస్తున్నారని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 వేల మందికిపైగా హోంగార్డులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తుండగా వారిలో 6 వేల మంది హైదరాబాద్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు. కానిస్టేబుళ్లతో పాటే తమకు 1వ తేదీనే జీతం చెల్లించాలని హోంగార్డులు కోరుతున్నారు. వేతనం ఆలస్యమవుతుండంతో దాని ప్రభావం ఈఎంఐ చెల్లింపులపై పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత కారణాలతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తరచూ ఎక్కడో ఒకచోట హోంగార్డులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోందని, ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గొర్రెలైనా ఇవ్వండి.. డీడీలైనా వాపస్ చేయండి!

యూనిట్లు అందని గొల్ల, కురుమల డిమాండ్.. జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ పదక్షిణలు

- రూ. 3 వడ్డీకి అప్పుతెచ్చి కట్టామని ఆవేదన
- శాఖకు మంత్రి లేకపోవడంతో అధికారుల్లో అయోమయం
- నేడు సర్కారుకు లేఖ రాయనున్న ఆ శాఖ డైరెక్టర్



హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించి డీడీలు కట్టిన గొల్ల-కురుమలు.. గొర్రెలైనా ఇవ్వండి.. లేదంటే కట్టిన డబ్బులైనా వాపస్ చేయండి అని డిమాండ్ చేస్తున్నారు. మూడు రూపాయాల మిత్తికి అప్పుతెచ్చి మరీ రూ.43,750 మొత్తంతో డీడీలు కట్టామని, ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటి? ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు హామీ ఇచ్చినట్లుగా గొర్రెలు ఇస్తారా? లేదంటే పైసలైనా తిరిగి చేస్తారా? ఏదో ఒకటి చెప్పాలని నిలదీస్తున్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 82వేల మంది లబ్ధిదారులు జిల్లా కలెక్టర్, జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. లబ్ధిదారుల నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో ఎటూ పాలుపోని కలెక్టర్లు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్‌కు లేఖలు రాస్తున్నారు. కాగా, ఈ అంశమ్మీద స్పష్టత కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి శుక్రవారం లేఖ రాయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ రాంచందర్ వెల్లడించారు. గొల్ల-కురుమలకు గొర్రెల పంపిణీ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. లబ్ధిదారులకు యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు యూనిట్ ధరను రూ.1.75 లక్షలుగా నిర్ణయించింది. ఇందులో లబ్ధిదారులు 25శాతం వాటా.. అంటే రూ.43,750 చెల్లిస్తే.. మిగతా రూ.1,31,250 రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా పథకానికి రూపకల్పన చేసింది. నిధులు సర్దుబాటు కాకపోవడం, జాతీయ బ్యాంకుల నుంచి రుణాలూ రాకపోవడంతో గత సర్కారు పథకాన్ని పూర్తిగా అమలు చేయలేకపోయింది. మొత్తం 7లక్షల మంది లబ్ధిదారుల్లో 3.38 లక్షల మందికి యూనిట్లు అందలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది ముందు కొన్ని నిధులు విడుదలచేసి 31,352 మందికి యూనిట్లు ఇచ్చారు. వీరిని మినహాయిస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా 3,06,448 మందికి యూనిట్లు అందాల్సి ఉంది. వీరికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలంటే... వాటాధనం పోగా మరో రూ. 4,023 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అయితే నాలుగైదు నెలల క్రితం.. డీడీలు తీయండి.. గొర్రెలు పంపిణీ చేస్తాం అని గత ప్రభుత్వం చెప్పడంతో 1.16 లక్షల మంది రూ.43,750 చొప్పున డీడీలు తీశారు. వీరిలో 34 వేల మందికే యూనిట్లు పంపిణీచేశారు. మరో 82 వేల మందికి యూనిట్లు అందాల్సి ఉంది. వీరు చెల్లించిన వాటా ధనం రూ.359 కోట్లు నాలుగైదు నెలలుగా ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో మూలుగుతున్నాయి. కొన్ని జిల్లాల పశుసంవర్ధకశాఖ అధికారులు డీడీ తాలూకు డబ్బులు తిరిగి ఇప్పిస్తామంటూ లబ్ధిదారులను సముదాయిస్తున్నారు. మరోవైపు.. లబ్ధిదారుల వాటాధనం తాలూకు రూ.359 కోట్లు తమ ఖాతాల్లోనే ఉంచుకోవాలా? లబ్ధిదారులకు తిరిగి ఇవ్వమంటారా? ఏదో ఒకటి తేల్చాలని పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్‌కు కలెక్టర్లు లేఖలు రాశారు.

సర్కారుకు లేఖ రాయనున్న డైరెక్టర్

గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ రాంచందర్ నిర్ణయించారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న ఒత్తిడి, క్షేత్రస్థాయిలో అధికారుల నివేదికలు, కలెక్టర్ల నుంచి వస్తున్న లేఖలను పరిగణనలోకి తీసుకొని శుక్రవారం లేఖ రాయనున్నారు.

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఈ పథకం

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ విడుదలచేసిన అభయహస్తం ఎన్నికల మేనిఫెస్టోలో గొర్రెల పంపిణీ పథకం ఉండటం గమనార్హం. తాము అధికారంలోకిచ్చిన వంద రోజుల్లో రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియ చేపడతామని ఆ పార్టీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి నెలరోజులైంది. ఇప్పటిదాకా గొర్రెల పంపిణీ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష చేయలేదు. కేబినెట్ విస్తరణ పూర్తయితేనే పశుసంవర్ధక శాఖకు మంత్రి వచ్చే అవకాశాలున్నాయి. దీంతో ఇప్పుడు అధికారులు కూడా కొంత అయోమయానికి గురవుతున్నారు. శాఖాపరమైన అంశాలను ఎవరితో చర్చించాలి? నిర్ణయాలు ఎలా తీసుకోవాలి? అనే మీమాంసలో ఉన్నారు. అయితే కొత్త ప్రభుత్వం ఈ పథకంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు 100 రోజులు పూర్తయ్యేలోపు ఈ పథకాన్ని పాలకులు అమలు చేస్తారా? అనేది తేల్చాల్సి ఉంది? అదేక్రమంలో డీడీలు వాపస్ ఇస్తారా? లబ్ధిదారులు మరి కొన్ని రోజులు వేచిచూడాలని విజ్ఞప్తి చేస్తారా? అనే స్పష్టత రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

ఏప్రిల్ 17న శ్రీరామ నవమి

- 18న మహాపట్టాభిషేకం
- 9 నుంచి 23 వరకు భద్రాద్రిలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు



భద్రాచలం, జనవరి 4: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఏప్రిల్ 17న శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజు మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభిత కల్యాణ మండపంలో సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మరుసటి రోజు 18న మహాపట్టాభిషేకం, రథోత్సవం జరుపుతారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 9 నుంచి 23 వరకు వసంతపక్ష తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 9న క్రోధి నామసంవత్సర ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం, తిరువీధి సేవలు ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో 13న బ్రహ్మోత్సవాలకు అంకురారోపణం, 14న ధ్వజపట లేఖనం, 15న ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, 16న ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించనున్నారు. 19న మహదాశీర్వచనం, 20న తెప్పోత్సవం, దొంగలదోపు, 21న ఊంజల్ సేవ, 22న వసంతోత్సవం, 23న చక్రతీర్థం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షణలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్పయాగం నిర్వహించనున్నారు. తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు జరిగే ఏప్రిల్ 9 నుంచి 23 వరకు నిత్యకల్యాణాలు, 13 నుంచి 23 వరకు దర్బారు సేవ, ప్రభుత్సోత్సవం నిలిపివేయనున్నారు. మే 2న నూతన పర్యంకోత్సవం నిర్వహించనున్నారు.

ఈసారి ముత్యాల తలంబ్రాలతో సీఎం!

ఈ ఏడాది శ్రీరామనవమి రోజున నిర్వహించే సీతారామచంద్రస్వామి కల్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలతో వస్తారని రామభక్తులు ఎదురుచూస్తున్నారు. 2016లో శ్రీరామనవమికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అప్పటి సీఎం కేసీఆర్ ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు.

భాష రాక బందీ అయిన దళిత ప్రవాసి

- సహాయం చేయబోయి జైలుపాలైన తెలంగాణవాసి
- కేసు పూర్తయ్యే దాకా శ్రీలంకను విడిచి వెళ్లలేని దుస్థితి

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, జనవరి 4: విమానంలో మానవతా దృక్పథంతో ఒక చిన్నారికి సహాయపడిన తెలంగాణకు చెందిన ఓ దళిత ప్రవాసి, భాష రాకపోవడంతో పరాయి దేశంలో బందీ అయ్యాడు. సౌదీ నుంచి తెలంగాణకు వస్తూ.. చేయని తప్పుకు శ్రీలంకలో నేర శిక్షాస్మృతితోపాటు అంతర్జాతీయ విమానయాన చట్టాలలో ఇరుక్కొని విలవిలలాడుతున్నాడు. జగిత్యాల జిల్లాలోని పొలాస గ్రామానికి చెందిన బి.శంకరయ్య సౌదీలో పనిచేస్తున్నాడు. గత నెల 12న ఆయన రియాద్ నుంచి హైదరాబాద్‌కు శ్రీలంక విమానంలో బయలుదేరాడు. అదే విమానంలో శ్రీలంకకు చెందిన ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో కొలంబోకు వెళ్తోంది. భాష రాకపోడంతో... చలి కారణంగా విమానం క్యాబిన్‌లోని దుప్పటి తీసి పాపకు కప్పాలని ఆమె తనను కోరినట్లుగా భావించిన శంకరయ్య, దుప్పటి తీసి పాపపై కప్పాడు. దీంతో తన పాప పట్ల శంకరయ్య అనుచితంగా ప్రవర్తించాడని ఆమె విమాన సిబ్బందికి ఫిర్యాదు చేసింది. తెలుగు తప్ప ఇంగ్లీషు, తమిళం, సింహళం లాంటి ఏ ఇతర భాష తెలియకపోవడంతో శంకరయ్య తన వాదనను స్పష్టంగా వినిపించలేకపోయాడు. విమానం కొలంబోలో దిగిన వెంటనే పైలట్ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శంకరయ్యను శ్రీలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత కోర్టులో ప్రవేశపెట్టగా ఆయనకు బెయిల్ లభించింది. కానీ అందుకు ఇద్దరు శ్రీలంక జాతీయుల పూచీకత్తు ఇవ్వాల్సి ఉంది. శ్రీలంక జాతీయులెవరూ తనకు తెలియకపోవడంతో బెయిల్ మంజూరైనప్పటికీ ఆయన బయటకు రాలేకపోతున్నాడు. ఎవరైనా కరుణించి బెయిల్ ఇచ్చినా శంకరయ్య జైలు నుంచి బయటకు వస్తాడు కానీ కేసు విచారణ పూర్తయ్యే వరకూ శ్రీలంకను విడిచి, హైదరాబాద్‌కు గానీ, గల్ఫ్‌కు గానీ వెళ్లలేడు. న్యాయస్థానం కేసు విచారణను మార్చి 1కి వాయిదా వేసింది. అప్పటిలోగా ఆయన సౌదీ వీసా గడువు ముగిసిపోయి, తిరిగి వచ్చే అర్హత, ఉద్యోగం కోల్పోతాడని కేసును చూస్తున్న రియాద్‌లోని సామాజిక కార్యకర్త, సాటా ప్రతినిధి ముజమ్మీల్ షేక్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధ రాజకీయం!

గాజాయుద్ధాన్ని సుదీర్ఘకాలం కొనసాగించడంతోపాటు, పరిధినీ, క్షేత్రాన్నీ మరింత విస్తరించేందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ కుట్రపన్నుతున్నారని కొందరు విశ్లేషకుల అనుమానం. మంగళవారం లెబనాన్ రాజధాని బీరూట్‌లో హమాస్ డిప్యూటీ లీడర్ సలేహ్–అల్–అరౌరీని ఇజ్రాయెల్ డ్రోన్‌దాడిలో హతమార్చింది. గాజాయుద్ధం మొదలైన ఈ మూడునెలల కాలంలో, హమాస్ ఉన్నతస్థాయి నాయకుడు ఒకరు హత్యకు గురికావడం ఇదే తొలిసారి. తమ దేశంలోకి చొరబడి ఇజ్రాయెల్ జరిపిన ఈ ఘాతుకానికి ప్రతీకారం తీర్చుకుంటామని హిజ్బుల్లా ప్రకటించింది. శత్రువులు ఎక్కడ దాక్కున్నా వెతికి వేటాడతామని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది. ఈ సంఘటన జరిగిన మర్నాడు, ఇరాన్‌లోని కెర్మాన్ నగరంలో రెండు వరుస పేలుళ్లలో వందమంది మరణించారు, రెండువందల మంది గాయపడ్డారు. నాలుగేళ్ళక్రితం అమెరికా డ్రోన్‌దాడిలో మరణించిన ఇరాన్ సైనిక జనరల్ సులేమానీ సంస్మరణ కార్యక్రమంలో, వేలాదిమంది ఆయన సమాధివైపు పోతుండగా ఈ ఘోరం జరిగింది. ఇందులో తమ పాత్రేమీలేదని అంటూ, ఇజ్రాయెల్‌కు ఈ పనిచేయాల్సిన అవసరం లేదని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి సమర్థించుకొచ్చారు. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా ఖమేనీ తన సందేశంలో శత్రువుల పేర్లు ఎత్తకుండా తీవ్రంగా దండిస్తామని మాత్రమే ప్రకటిస్తే, మిగతా నాయకులంతా అమెరికా, ఇజ్రాయెల్‌ను నేరుగానే తప్పుబడుతున్నారు. ఈ రెండు వరుస ఘటనలకు సంబంధం ఉన్నదా, కారకులు ఎవరన్న ప్రశ్నలను అటుంచితే, పశ్చిమాసియాలో పరిస్థితులను ఇవి మరింత ఉద్రిక్తంగా మార్చాయి.

ఇరాన్ సైన్యంలోని విదేశీ సైనిక విభాగమైన ఖుర్ద్ ఫోర్స్‌కు సులేమానీ నాయకత్వం వహిస్తూ, హమాస్, హిజ్బుల్లా, హౌతీ మిలిటెంట్ గ్రూపులకు ఆయుధాలు, నిధులు అందించి వాటిని బలోపేతం చేశారు. ప్రజల్లోనూ కీర్తిప్రతిష్ఠలున్న ఈయనను, ఇరాన్‌తో అణుఒప్పందం నుంచి వైదొలిగిన తరువాత అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హత్యచేయించారు. ఇప్పుడు ఇరాన్ పరోక్ష సహకారంతో ఈ మిలిటెంట్ సంస్థలు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న తరుణంలో, ఈ వరుస పేలుళ్ళలో ఇజ్రాయెల్, అమెరికాల ప్రమేయం ఉన్నదన్న అనుమానాలు రేగడం సహజం. పేలుళ్ళ తరువాత అమెరికాలోని చాలా ప్రభుత్వ భవనాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇక, లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడిని హిజ్బుల్లా అధినేత హసన్ నస్రుల్లా చొరబాటుగా అభివర్ణిస్తూ, ఇజ్రాయెల్‌కు దీటైన సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రస్తుతానికి హిజ్బుల్లా నేరుగా యుద్ధాన్ని ప్రకటించకపోయినా బీరూట్‌లో జరిగిన ఈ దాడి దానిని మరింత వేడెక్కిస్తుందనడంలో సందేహం లేదు.

ఈ రెండు ఘటనల తరువాత, ఏ కారణాలవల్లనైతేనేమి, ఇరాన్, హిజ్బుల్లా అధికారిక ప్రతిస్పందనలు ప్రస్తుతానికి మితంగానే ఉన్నాయి. కానీ, ఇజ్రాయెల్ రక్షణమంత్రి గల్లాంట్ మాత్రం గాజాలో ఇప్పుడు మేము చేస్తున్నది రేపు బీరూట్‌లో చేయడానికి ఏ మాత్రం వెనుకాడబోమని అంటున్నారు. అనేక మితవాద, అతిమితవాద పార్టీలను కూడగట్టుకొని అతికష్టంమీద అధికారంలోకి వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గాజా యుద్ధంతో రాజకీయంగా మరింత బలపడవచ్చునని తలపోశారు. కానీ, యుద్ధానంతరం ఆయనను ప్రధానిగా కొనసాగించేందుకు పదిహేనుశాతం మంది ప్రజలు మాత్రమే అనుకూలంగా ఉన్నట్టు ఇటీవలి సర్వేలు తేల్చాయి. యుద్ధం ముగిసినవెంటనే ఎన్నికలు జరగాల్సిందేనని 70శాతం మంది ప్రజలు స్పష్టం చేశారు. దీనికితోడు, పలు కేసులు ఎదుర్కొంటున్న ఆయన న్యాయవ్యవస్థ ప్రక్షాళనపేరిట గత ఏడాది తెచ్చిన రాజ్యాంగ సవరణను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. విపక్షాలు తప్పుబడుతున్నా, లక్షలాదిమంది వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేసినా ఆయన ఖాతరుచేయలేదు. తన రాజకీయ మనుగడ కోసం న్యాయవ్యవస్థ పరిధులను కుదించడానికి ఆయన చేసిన ఈ ప్రయత్నాన్ని ఇజ్రాయెల్ చరిత్రలో తొలిసారిగా పదిహేనుమంది న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం విఫలం చేసింది. నిఘావైఫల్యంతో హమాస్ దాడికి వీలుకల్పించి, ప్రతీకారంతో యుద్ధం ఆరంభించి, మూడునెలలుగా లక్ష్యం సాధించలేకపోయిన నెతన్యాహూ, ఈ పరిస్థితుల మధ్య యుద్ధాన్ని ముగించడం కంటే, దానిని విస్తరించడం ద్వారా ఉనికిని, అధికారాన్ని కొనసాగించుకోవచ్చునని భావిస్తున్నట్టు కనిపిస్తోంది.

మోదీ హ్యాట్రిక్‌ను అడ్డుకోవడమెలా?



నరేంద్ర మోదీ అజేయుడా? వరుసగా మూడోసారీ కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోకుండా భారతీయ జనతా పార్టీని నిలువరించడం సాధ్యం కాదా? ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ సీట్లను గెలుచుకోకుండా 2024 సార్వత్రిక ఎన్నికలలో అధికార పక్షాన్ని విజయవంతంగా అడ్డుకునే వ్యూహం ఏదైనా ఉన్నదా? నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమనే నిశ్చిత అభిప్రాయాన్ని ఇప్పటికే చాలా మంది రాజకీయ పరిశీలకులు, స్వతంత్ర విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష నాయకుల గురించి చెప్పేదేముంది? వారితో వ్యక్తిగతంగా సంభాషించండి, తమ మనసులో మాట స్పష్టంగా చెబుతారు : మోదీ హ్యాట్రిక్ నిశ్చితం.

ఈ వ్యక్తావ్యక్త అభిప్రాయాలతో నేను విభేదిస్తున్నాను. చివరి నిమిషంలో ఏదో అద్భుతం జరుగుతుందనే నమ్మకంతో కాదు సుమా. ఇటీవల మూడు ఉత్తరాది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ తిరుగులేని విజయాన్ని, ప్రధాని మోదీకి అచంచల ప్రజాదరణ ఉందని ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడవుతున్న విషయాన్నికూడా నేనేమీ ఉపేక్షించడం లేదు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' ఘనవిజయం సాధించగలదని, బీజేపీకి ఘోర పరాజయం అనివార్యమని సునిశ్చితంగా విశ్వసించేందుకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలుగానీ, ప్రస్తుత సందర్భంలో వివిధ సర్వేలు వెల్లడిస్తున్న వాస్తవాలు గానీ మనకు ఏ మాత్రం ఆస్కారమివ్వడం లేదు. అదే సమయంలో, వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో 273 సీట్లు (ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ) స్వాయత్తం చేసుకోకుండా బీజేపీని అడ్డుకోవడం సాధ్యమే అన్న అంశాన్ని కూడా అవి కొట్టివేయడం లేదు. ప్రతిపక్షానికి ఒక వినూత్న వ్యూహం ఉండి, దానిని పటిష్ఠంగా అమలుపరిచేందుకు పరిపూర్ణ రాజకీయ సంకల్పం ఉంటే బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారానికి రాకుండా అడ్డుకోవడం సుసాధ్యమేనని స్పష్టంగా చెప్పవచ్చు.

ఆ వ్యూహం ఎలా ఉండాలి? 2024 సార్వత్రిక సమరాన్ని మూడు యుద్ధ క్షేత్రాలుగా పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. అవి: ప్రాథమిక లేదా ప్రధాన; గౌణ లేదా అప్రధాన; యుద్ధక్షేత్రం. ఈ మూడు విభిన్న యుద్ధ క్షేత్రాలలో విజయానికి అవసరమైన వేర్వేరు ఎత్తుగడలు రూపొందించుకోవడం తప్పనిసరి అన్నది ఈ వ్యూహపు మౌలిక భావన.

తొలుత మూడో యుద్ధ రంగంపై మన దృష్టిని సారిద్దాం. బీజేపీకి విజయావకాశాలు లేని, కనీసం పోటీ ప్రధానంగా ఉండే రెండు ప్రత్యర్థి పార్టీలలో ఒకటిగా లేని రాష్ట్రాలు ఈ మూడో యుద్ధ రంగం పరిధిలోకి వస్తాయి. ఇది దక్షిణ భారతావని అని మరి చెప్పనవసరం లేదు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్. ఇప్పుడు వీటితో పాటు తెలంగాణను కూడా చేర్చవచ్చు. అలాగే పంజాబ్, కశ్మీర్, మిజోరం, నాగాలాండ్ కూడా. ఈ ఎనిమిది రాష్ట్రాలలో మొత్తం 120 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 2019లో జాతీయ అధికార పక్షం ఈ 120లో కేవలం 6 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది : తెలంగాణ నుంచి 4, పంజాబ్ నుంచి 2. పంజాబ్‌లో అకాలీదళ్‌తోనూ, తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితితో లోపాయికారీ పొత్తు ఏమైనా ఉంటే తప్ప, సాధారణ పరిస్థితులలో ఈ 6 సీట్లనూ బీజేపీ 2024లో నిలబెట్టుకోవడం అసాధ్యం. 'ఇండియా' కూటమి ఈ రాష్ట్రాలలో అనుసరించాల్సిన ప్రధాన వ్యూహం బీజేపీని అడ్డుకోవడమే. ప్రస్తుత ఆరు స్థానాలతో పాటు, బీజేపీ కైవసం చేసుకోదలిచిన తిరువనంతపురం (కేరళ), కన్యాకుమారి, కోయంబత్తూరు (తమిళనాడు) మొదలైన నియోజకవర్గాలలో అధికార పక్షాన్ని గట్టిగా ఎదుర్కోవడమే ప్రతిపక్ష కూటమి ప్రధాన వ్యూహంగా ఉండి తీరాలి. 'ఇండియా' భాగస్వామ్య పక్షాలు, పౌర సమాజమూ ఈ నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అవసరమైతే భాగస్వామ్య పక్షాల మధ్య ఓట్ల బదిలీ జరగాలి. తద్వారా బీజేపీని ప్రస్తుత స్థానాలకు మాత్రమే పరిమితం చేయడం సుసాధ్యమవుతుంది. మరి కొంచెం కష్టపడితే, అదృష్టం కూడా కలిసివస్తే ఈ ఎనిమిది రాష్ట్రాల యుద్ధ రంగంలో బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా చేయవచ్చు.

> 2024 సార్వత్రిక పోరులో 'ఇండియా' ఘన విజయం సాధించగలదని, బీజేపీకి ఘోర పరాజయం అనివార్యమని విశ్వసించేందుకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలుగానీ, ఇప్పుడు వివిధ సర్వేలు వెల్లడిస్తున్న విషయాలు గానీ మనకు ఏ మ్రాతం ఆస్కారమివ్వడం లేదు. వచ్చే వేసవిలో లోక్‌సభ ఎన్నికలలో 273 సీట్లు స్వాయత్తం చేసుకోకుండా బీజేపీని అడ్డుకోవడం సాధ్యమే అన్న అంశాన్నీ అవి కొట్టివేయడం లేదు. విపక్షానికి ఒక వినూత్న వ్యూహం ఉండి, దానిని పటిష్ఠంగా అమలుపరిచే రాజకీయ సంకల్పం ఉంటే బీజేపీ వరుసగా మూడోసారి అధికారానికి రాకుండా అడ్డుకోవడం సుసాధ్యమవుతుంది.

223 లోక్‌సభా నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రాలు రెండో యుద్ధరంగం పరిధిలోకి వస్తాయి. ఇవి ప్రధానంగా హిందీ భాషా ప్రాంతాలు. ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, రాజస్థాన్ మొదలైన రాష్ట్రాలలో బీజేపీ ఒక ప్రబల శక్తిగా ఉన్నదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వచ్చే మూడు నెలల వ్యవధిలో ఆ రాష్ట్రాలలో ఆ పార్టీని పరాజితను చేయడం చాలా చాలా కష్టమైన పని. వీటికి తోడు గుజరాత్, అసోంతో పాటు త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ లాంటి చిన్న రాష్ట్రాలు కూడా ఈ అప్రధాన యుద్ధ రంగంలోకే వస్తాయి. 2019 సార్వత్రిక సమరంలో ఈ 223 స్థానాలలో 190 బీజేపీకి కైవసమయ్యాయి. ఈ రాష్ట్రాలలో సాధించిన తిరుగులేని విజయాలే బీజేపీని అజేయ శక్తిగా నిలబెడుతున్నాయి. రాబోయే సార్వత్రిక ఎన్నికలలోనూ ఈ రాష్ట్రాలలో అధికార పక్షం ఘన విజయాలు సాధించడం ఖాయమని ప్రతీ ఒక్కరూ నిశ్చితంగా భావిస్తున్నారు. అయితే లోక్‌సభలో తన మెజారిటీని పూర్తిగా నిలబెట్టుకునేందుకు ఈ రాష్ట్రాలలోని సీట్లు అన్నిటినీ బీజేపీ గెలుచుకోవల్సిన అవసరముందని కొంత మంది విశ్లేషకులు తెగేసి చెప్తున్నారు. ఇదిగో, ఇక్కడే ప్రతిపక్ష కూటమికి జయపతాకను ఎగురవేసేందుకు ఒక స్పష్టమైన అవకాశమున్నది.

'ఇండియా' కూటమి ఏమి చెయ్యాలి? ఈ రాష్ట్రాలలో బీజేపీని 'ఓడించడానికి' ప్రయత్నించే బదులు ఆ పార్టీ స్థానాలను సాధ్యమైనంతగా తగ్గించేందుకు పూనుకోవాలి. ఎంపిక చేసిన ప్రాంతాలలో బీజేపీ తన ప్రస్తుత సీట్లను మళ్లీ గెలుచుకోకుండా చూడాలి. గుజరాత్‌నే తీసుకోండి. ఆ రాష్ట్రం బీజేపీకి కంచుకోట. అక్కడ 4 సీట్లను, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలలో కైవసం చేసుకోవడాన్ని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకోవాలి. రాజస్థాన్ ఆగ్నేయ ప్రాంతాలలో అరడజన్ సీట్లలో విజయం సాధించేందుకు కాంగ్రెస్‌కు అవకాశాలున్నాయి. భారతీయ ఆదివాసీ పార్టీతో పొత్తు పెట్టుకుంటే రాజస్థాన్ దక్షిణ జిల్లాల్లో రెండు సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలదు. దళితుల– ఓబీసీల ప్రాబల్యమున్న మధ్యప్రదేశ్ ఉత్తర ప్రాంతాలలో కూడా కాంగ్రెస్‌కు ఇటువంటి విజయాలు దక్కే అవకాశమున్నది. బీజేపీ ఓటు బ్యాంకును స్వాధీనం చేసుకోవలసిన అవసరం కాంగ్రెస్‌కు లేదు. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో తనకు లభించిన ఓట్లను ఎటువంటి మినహాయింపు లేకుండా కాపాడుకోవలసిన అవసరం కాంగ్రెస్‌కు ఎంతైనా ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల సమరం చాలా క్లిష్టంగా ఉంటుంది. అయినప్పటికీ సమాజ్ వాది పార్టీ– రాష్ట్రీయ లోక్‌దళ్– కాంగ్రెస్ కూటమి దాదాపు 25 సీట్లను లక్ష్యంగా పెట్టుకుని సంపూర్ణ విజయం సాధించవచ్చు.



■ యోగేంద్ర యాదవ్

సమస్త నియోజకవర్గాలలోనూ విజయం సాధించేందుకు ప్రయత్నించడం కాకుండా స్థానిక పార్టీలతో పొత్తులు, సామాజిక సంకీర్ణాలతో సాధ్యమైనన్ని సీట్లను కైవసం చేసుకునేందుకు ప్రతిపక్షం తన శక్తి సామర్థ్యాలను కేంద్రీకరించడమే ఈ వ్యూహంలోని కీలక అంశం. ఉత్తరప్రదేశ్‌లో మినహా ఇక్కడ కూడా ప్రతిపక్షాలు ఒక మహా కూటమిగా ఏర్పడవలసిన అవసరం లేదు. ఎంపిక చేసుకున్న స్థానిక పార్టీలతో పొత్తు పెట్టుకోవడమే ప్రస్తుత అవసరం. అలాంటి ఏర్పాటుతో ప్రస్తుతం బీజేపీ అధీనంలో ఉన్న 190 సీట్లలో 20 నుంచి 25 సీట్లను ప్రతిపక్షం తప్పక గెలుచుకోగలదు.

మిగిలిన 200 నియోజక వర్గాలే ప్రధాన, అసలైన యుద్ధ రంగం. 2019 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ ఈ రెండు వందల నియోజక వర్గాలలో గణనీయమైన విజయాలు సాధించింది. అయితే ఇప్పుడు ఆ స్థానాలలో అది బలహీనపడింది. ఇందుకు పలు వేర్వేరు కారణాలు ఉన్నాయి. మహారాష్ట్ర, బిహార్‌లలో రాజకీయ శక్తుల పునరేకీకరణ జరిగింది. ఈ కొత్త శక్తులతో సరికొత్త పొత్తు పెట్టుకునేందుకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి మంచి అవకాశమున్నది. 2019 అనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో పరాజయాలను బీజేపీ మూటగట్టుకున్నది. మోదీ ప్రభుత్వం తెచ్చిన కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన రైతుల ఉద్యమంతో హర్యానా ప్రజల రాజకీయ వైఖరులు మారాయి. ఒడిషాలో బిజూ జనతాదళ్ 2019లో వలే లోక్‌సభ సీట్లను ఈ సారి బీజేపీకి కానుకగా ఇచ్చే అవకాశం లేదు. ఈ ప్రధాన యుద్ధ రంగ రాష్ట్రాల జాబితాలో మణిపూర్, మేఘాలయతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు లద్దాఖ్, లక్షదీవులు, పుదుచ్చేరి కూడా ఉన్నాయి. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోనే 2024 సార్వత్రిక ఎన్నికల అసలు సమరం జరగనున్నది. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ 200 సీట్లలో 107ను (మిత్రపక్షాలు గెలుచుకున్న వాటిని కూడా కలుపుకుంటే మొత్తం 147) బీజేపీ స్వాధీనం చేసుకున్నది. ఈ సీట్లు అన్నిటినీ ప్రతిపక్ష కూటమి 'ఇండియా' లక్ష్యం కావాలి. తద్వారా బీజేపీని గణనీయంగా దెబ్బ తీయాలి. అయితే ఇందుకు ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 'ఇండియా' కూటమి ఒక పటిష్ఠ రాజకీయ పక్షంగా పని చేయవలసిన అవసరమున్నది. భాగస్వామ్య పక్షాలు అన్నీ కలసికట్టుగా పోరాడని పక్షంలో 'ఇండియా'కు విజయం దక్కదు. సమైక్యంగా పోరాడగలిగితే ఈ ప్రధాన యుద్ధ రంగంలో బీజేపీ 25 నుంచి 35 సీట్లను ఖాయంగా కోల్పోతుంది. ఇదే జరిగితే లోక్‌సభలో బీజేపీ ప్రస్తుత సంఖ్యా బలాన్ని 40 నుంచి 60 సీట్ల దాకా తగ్గించడం సాధ్యమవుతుంది. ఇదొక పెనుమార్పుకు కారణమవుతుంది. దేశ రాజకీయ వాతావరణాన్ని పూర్తిగా మార్చివేస్తుంది. మరి ఇటువంటి మార్పు నిజంగా సంభవిస్తుందా? సంభవించడం సాధ్యమవుతుందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు 'ఇండియా' కూటమి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నేను విపులీకరించిన వ్యూహాన్ని పటిష్ఠంగా అమలుపరుస్తుందా అన్నదానిపై ఆధారపడివున్నాయి.

సామరస్యానికి లాకులెత్తండి!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల ప్రధానమంత్రిని కలిసినపుడు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అలా కోరడంలో తప్పులేదు. కానీ, వాస్తవంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నికర జలాల కేటాయింపులు లేవు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచలేదు. తుదకు అపెక్స్ కౌన్సిల్ ఆమోదమూ లేదు.

సాగునీటి రంగంలో తెలంగాణకు అన్యాయం జరిగిన మాట వాస్తవం. తెలంగాణతో పాటు అవశేష ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకూ అపకారం జరిగింది. తెలంగాణకు గాని రాయలసీమకు గాని సాగునీటి రంగంలో సరైన న్యాయం జరగలేదంటే అది బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ జరిగినపుడు తప్ప రాష్ట్ర విభజన తరువాత కాదు. అందువల్లనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ మధ్యంతర తీర్పు సమయంలోనూ, తుది తీర్పు వచ్చినపుడు 2013లో సుప్రీంకోర్టు తలుపు తట్టి గెజిట్ నోటిఫికేషన్ జరగకుండా స్టే తెచ్చింది. ఇన్నేళ్లు గడిచినా ఈ కేసు సుప్రీంకోర్టులోనే వుంది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కూడా కలుపుకొని ట్రిబ్యునల్ తీర్పు పునఃసమీక్ష కోసం ప్రయత్నించి వుండాలి. అలా చేయలేదు. తన రాజకీయ అవసరార్థం ఆంధ్రప్రదేశ్‌తో అంతర్ రాష్ట్ర జల వివాదాన్ని అట్టే పెట్టుకొన్నారు.

బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉరితాడు. కర్ణాటకకు గంపగుత్తగా నేరుగా వాడుకొనేందుకు 170 టియంసిలు, మహారాష్ట్రకు 78 టియంసిలు ఇచ్చి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 39 టియంసిలు మాత్రమే కేటాయించింది. కన్నీటి తుడుపుగా 145 టియంసిలు క్యారీ ఓవర్ కింద చూపారు. ఇంత అన్యాయం జరిగితే కేసీఆర్ ఏనాడూ పల్లెత్తుమాట అనకపోగా, అవశేష ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే తమకు అన్యాయం జరిగిందని వాదించేవారు.. అంతేకాదు, అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోను, సుప్రీంకోర్టులోను రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తిరిగి కృష్ణ జలాలు పంపకం చేయాలని పట్టుపట్టారు. కాని బేసిన్ మొత్తంలో తెలుగు రాష్ట్రాలకు జరిగిన అన్యాయం గురించి పట్టించుకోలేదు. తుదకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని బుట్టలో వేసుకొని కొత్త ట్రిబ్యునల్ నియామకానికి మార్గం సుగమం చేసుకున్నారు. కొత్త ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకైనా రేవంత్ రెడ్డి ఆగి వుండాల్సింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించమని వెంటనే కోరకపోతే తనకు కేసీఆర్ దక్షిణ తెలంగాణలో పొగ బెడతారని భావించి వుండవచ్చు.

ఒక రాష్ట్రం రెండుగా విభజింపబడితే వాటి మధ్య సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సంధానకర్తగా వ్యవహరించాలి. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంశంలో కేంద్ర ప్రభుత్వం సైంధవ పాత్ర పోషించింది. బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య ఒక ట్రిబ్యునల్ తీర్పు వచ్చింది, కోర్టు కేసులతో పెండింగ్‌లో వుంది. దాని అతీగతీ తేలక ముందే రాష్ట్ర విభజన చట్టం మేరకు అదే ట్రిబ్యునల్ విచారణ జరిపేందుకు నోటిఫై చేసింది. ఆ తీర్పు రాలేదు. తిరిగి అదే రెండు రాష్ట్రాల మధ్య మరో ట్రిబ్యునల్ నియామకం చేసింది. బహుశా భారతదేశ చరిత్రలో అంతర్ రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి ఇన్ని ట్రిబ్యునల్‌ల నియామకం ఎక్కడా జరిగివుండదేమో. మరోవేపు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై చేసేందుకు కర్ణాటక మహారాష్ట్ర ప్రభుత్వాలు యత్నాలు చేస్తున్నాయి. ఒక వేళ సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తే రాష్ట్రాల మధ్య తంపులు పెట్టి పబ్బం గడుపుకొనేందుకు సిద్ధంగా ఉన్న కేంద్రం నోటిఫై చేస్తే తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలు అంతటితో ఖతమౌతాయి. తదుపరి సుప్రీంకోర్టు పరిధి కూడా దాటిపోతుంది.



> రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఏకకంఠంతో 2013లో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు తమకు సమ్మతం కాదని, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య కృష్ణ జలాల పునఃపంపిణీ జరగాలని గట్టిగా పోరాడాలి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ట్రిబ్యునల్ తీర్పుపై సమీక్ష కోసం న్యాయం పోరాటం చేస్తే, రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడిన వారవుతారు.

ఈ సందర్భంలో, రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు ఏకకంఠంతో 2013లో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు తమకు సమ్మతం కాదని, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య కృష్ణ జలాల పునఃపంపిణీ జరగాలని గట్టిగా పోరాడాలి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ట్రిబ్యునల్ తీర్పుపై సమీక్ష కోసం న్యాయం పోరాటం చేస్తే, రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడిన వారవుతారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతవరకు సహకరిస్తారో అనుమానమే. జగన్‌కు పొగబెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో వైయస్ షర్మిలను దింపుతోందన్న వార్తల నేపథ్యంలో, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో కలసి పోరాటానికి జగన్ సిద్ధపడతారా? ఇక, రేవంత్ రెడ్డి చొరవ తీసుకున్నా లేకున్నా ఈ అంశంలో జగన్మోహన్ రెడ్డి సిద్ధం కాకపోతే మరోమారు ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన వారవుతారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ బేసిన్‌లో మొత్తం 448 టియంసిలు రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నేరుగా ఉపయోగించుకొనేందుకు దక్కింది 39 టియంసిలు మాత్రమే. ఇది సరిదిద్దబడితే తెలుగు రాష్ట్రాల్లో మిగులు జలాల ఆధారంగా గల ప్రాజెక్టులకు అటు ఇటుగా సర్దుబాటు చేసుకోవచ్చు. ముందు, బేసిన్‌లో న్యాయమైన వాటా లభించిన తరువాత తెలుగు రాష్ట్రాలు తమ లెక్కలు తేల్చుకోవచ్చు. ఆ ఆలోచన చేయకుండా కేవలం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కయ్యానికి ప్రాధాన్యత ఇస్తే చివరకు ఎవరికీ దక్కేదేమీ ఉండదు.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

ధరణిని తీసేస్తారా, సంస్కరిస్తారా?

ధరణిలో అవకతవకలు ఇప్పటికీ బయటపడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ధరణి పోర్టల్ ఫిలిపీన్స్ కంపెనీ టెర్రాసిస్ బోర్డు ద్వారా నడుస్తోంది. ఈ పోర్టల్ పట్ల, దాని నిర్వహణ పట్ల రైతుల్లో అనేక భయాలు నెలకొన్నాయి. విదేశీ కంపెనీలో మా భూ రహస్యాలను దాచి ఉంచితే ఎలా? మొన్ననే ఫిలిపీన్స్‌లో భూకంపం వచ్చిందంటున్నారు. దీని ప్రధాన సర్వర్ అక్కడే ఉన్నట్లయితే భూముల వివరాల పరిస్థితి ఏమిటి? బీఆర్ఎస్ ప్రభుత్వం వారు డబ్బులు ఖర్చు చేసి వాళ్లకు పెత్తనం ఇచ్చారు. భూమి సంగతులు, భూమి రహస్యాలు అన్నీ పరాయి దేశం వాళ్ల దగ్గర దాచారు. ఈ విషయం గురించి అడిగితే వెటకారంగా మాట్లాడారు. భూములకు సంబంధించిన వివరాలతో భూమి యాజమాన్య హక్కులలో మార్పులు చేర్పులు జరగవని గ్యారంటీ ఏమిటి? నిజానికి ప్రభుత్వంలో అధికార మార్పిడి జరిగితే, ప్రభుత్వానికి సంబంధించిన అన్ని ఫైళ్ల యథాతథంగా ట్రాన్స్‌ఫర్ అవుతాయి. ధరణి విషయంలో ఏం జరుగనుందో ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా దాదాపుగా వంద సభలలో నలభై రోజులపాటు కేసీఆర్ మాట్లాడారు. ధరణి రద్దయితే మళ్లీ గ్రామ కరణాల వ్యవస్థ వస్తుందంటూ రైతులు భయపడేలా బెదిరింపుగా మాట్లాడారు. ప్రజల్లో పది శాతం మంది కూడా తెలపని ఆమోదాన్ని మొత్తం ప్రజల ఆమోదంగా అనుకున్నారు. ప్రజలు తమ వ్యతిరేకతను ఓటు రూపంలో గట్టిగా వెల్లడించారు.



ప్రస్తుత ప్రభుత్వం ప్రతి అంగుళానికీ బాధ్యత తీసుకోవాలి. రెవెన్యూ వవస్థను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలి. వీఆర్‌ఏ, వీఆర్‌ఓలను తిరిగి విధులలోకి తీసుకోవాలి. వీరి సహాయంతో గ్రామ స్థాయిలో మీటింగ్‌లు నిర్వహించి 2017–18 చేతి రాత పహణీల ఆధారంగా చిన్న చిన్న పొరపాట్లను సవరించాలి. కొత్త రెవెన్యూ రికార్డులను తయారు చేయాలి. ఇది వ్యయప్రయాసలతో కూడిన పని అయినా చేయాలి. ప్రతి ఏటా అనివార్యంగా చేతి రాత పహణీని రాసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వీటి ఆధారంగా రెవెన్యూ వ్యవస్థలో భూమి లెక్కలు సరిగ్గా ఉండేలా చూడాలి. దీనికోసం ప్రతి ఏటా జమాబందీ తప్పనిసరిగా చేయాలి.

రైతు బంధు గురించి రైతులకు చాలా ఆలస్యంగా అర్థం అయింది. దీనివల్ల సాధారణ రైతులకంటే భూస్వాములకే ఎక్కువ లాభం చేకూరింది. వ్యవసాయ భూములు కొన్ని పరిశ్రమల భూములుగా మారినప్పటికీ రికార్డులలో సరైన మార్పులు జరగక వాటికి కూడా రైతు బంధు అందింది. అంతేకాకుండా, కొన్ని సంవత్సరాల నుంచి బీడుగా పడి ఉన్న భూములకు, ఏ భూమి ఎక్కడ ఉందో కూడా తెలియని వందల ఎకరాలకు, కొన్ని ప్రాంతాలలో సంపన్న వర్గాల వారు పది నుంచి యాభై ఎకరాల దాకా కొని వేసుకున్న ఫాం హౌసులకు కూడా ఈ రైతు బంధు డబ్బులు వెళ్లాయి. వీటి విషయంలో కూడా ధరణి పోర్టల్‌లో క్షేత్రస్థాయిలో చాలా మార్పులు రావాలి. హైదరాబాద్ నుంచి వంద కిలోమీటర్ల పరిధిలో ఎటు వెళ్లినా లేఅవుట్ చేసిన ప్లాట్లు కనిపిస్తాయి. వీటిని వ్యవసాయేతర భూముల కింద నమోదు చేసి రైతు బంధు నిలిపివేయాలి. ప్రభుత్వ ఉద్యోగస్థులు, ఆదాయ పన్ను కట్టేవారు, సర్వీస్ పెన్షన్ తీసుకుంటున్న వారికి రైతు బంధును ఆపాలి. దీనితో ప్రభుత్వానికి వేల కోట్లు మిగులుతాయి.

గత ఐదు నెలల నుంచి పైసా జీతం తీసుకోకుండా వీఆర్ఏలు ఎలక్షన్ డ్యూటీలు నిరాటంకంగా నిర్వహించారు. గత ప్రభుత్వం వీరికి హామీ ఇచ్చినప్పటికీ రావలసిన గౌరవ వేతనం ఆగిపోయింది. కొత్త పేస్కేల్ ఊసే లేదు. కావున, కొత్త ప్రభుత్వం తక్షణం గ్రామ రెవెన్యూ సహాయకుల జీతాల సమస్యను పరిష్కరించాలి. ప్రతి గ్రామానికి ఆ గ్రామ జనాభా ఆధారంగా ఒకరు లేదా ఇద్దరిని రెవెన్యూ పనుల కోసం నియమించాలి. మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు టెక్నాలజీతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రతనిస్తూనే, వీరిపై ప్రత్యేకమైన సైబర్ నిఘా అవసరం. ప్రధాన భూ కమీషనర్‌కు పూర్తిస్థాయిలో ధరణిని బాగు చేసేలా బాధ్యతలు అప్పగించాలి.

ధరణి స్థానంలో భూమాతను తీసుకొస్తామంటున్నారు. ఇది వీలయినంత సులభంగా పారదర్శకంగా ఉండాలి. పట్టాదారుకు భద్రతను, భరోసాను ఇవ్వాలి. కౌలు రైతు హక్కులు కూడా కాపాడాలి. కౌలు రైతు పేరును ఖాస్తు కాలమ్‌లో నమోదు చేయాలి. కౌలు రైతుకు ఒక గుర్తింపు కార్డు ఇవ్వాలి. దీని ద్వారా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట అమ్ముకోవటానికి ఈ కార్డు ఉపయోగపడేలా చూడాలి. ప్రస్తుతం 35 మాడ్యూల్స్‌తో కలిపి మరో పది వరకు మాడ్యూల్స్ ఉన్నాయి. ఇందులో నిషేధిత భూములను గుర్తించే మాడ్యూల్స్, పెండింగ్ డిజిటల్ సంతకాలను జాగ్రత్తగా పరిశీలించాలి. రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణ కోసం ఈసారి బడ్జెట్‌లో డబ్బులు కేటాయించాలి. దానితో పాటు లక్షలాదిగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి చట్టసవరణ చేయాలి. విదేశీ కంపెనీ నుంచి ధరణిని తీసివేసి, స్థానికంగా ఉండే కంపెనీకే బాధ్యతలు అప్పగించాలి.

○ వి. బాలరాజు
తహశీల్దారు రిటైర్డు

తొమ్మిదేళ్ల విద్యా విధ్వంసం కొత్త ప్రభుత్వానికి ఓ సవాల్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి దాదాపు 43 వేల ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రంలో ఉండేవి. మారుమూల గ్రామంతో సహా రాష్ట్రవ్యాప్తంగా ఈ పాఠశాలలు పేద విద్యార్థులకు అందుబాటులో ఉండేవి. 2014 నాటికి ఉపాధ్యాయుల కొరత కూడా పెద్దగా ఉండేది కాదు. అంతేగాక, ఆ ఏడాది రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో దాదాపు 12 శాతం నిధులు విద్య రంగానికే కేటాయించారు. కానీ 2014 తర్వాత రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 2014తో పోలిస్తే సుమారు ఐదు వేల నుంచి ఆరు వేలకు తగ్గించి కొన్ని పాఠశాలలను మూసివేశారు, మరికొన్ని పాఠశాలలను ఇతర పాఠశాలల్లో విలీనం చేశారు. 2014కు ముందు నాలుగింట మూడవ వంతు విద్యార్థులు (75 శాతం) ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించేవారు. కానీ 2023 నాటికి మొత్తం విద్యార్థులలో కేవలం 50శాతం మాత్రమే ప్రభుత్వ రంగ పాఠశాలలకు పరిమితమయ్యారు. దీనితోపాటు ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు పూర్తిగా నిర్వీర్యం అయినాయి. విశ్వవిద్యాలయాల్లో దాదాపు 70 నుంచి 75 శాతం బోధనా సిబ్బంది ఖాళీలు ఉన్నాయి. ఇక అనుబంధ, బోధనేతర సిబ్బంది ప్రభుత్వ పాఠశాలలో దాదాపు కనుమరుగయ్యారు. విశ్వవిద్యాలయాలకు చాలీచాలని నిధులు కేటాయించారు. 2014 తర్వాత ఎంతో గొప్పగా ప్రచారం చేస్తూ స్థాపించిన గురుకుల పాఠశాలలు కూడా సిబ్బంది కొరత, నిధుల కొరతతో నామమాత్రంగానే మిగిలిపోయాయి. 2014లో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి సుమారు 12 శాతం నిధులను కేటాయిస్తే, 2022–23 సంవత్సరంలో కేవలం 6 శాతం నిధులు మాత్రమే కేటాయించబడ్డాయి.

దేశంలో వివిధ రాష్ట్రాల విద్య ప్రమాణాల సూచికలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం దిగువన ఉంది. బోధన సిబ్బందికి తగిన శిక్షణ లేకపోవడం, నాణ్యమైన బోధన సిబ్బందిని నియమించకపోవడం, కేవలం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని నియమించి పాఠశాలలను, కళాశాలలను నడపటం, కనీస మౌలిక వసతులు లోపించటం, బోధన, మౌలిక వసతులను ఆధునీకరించకపోవడం లాంటివి రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు గణనీయంగా తగ్గడానికి గల కారణాలు.

అలాగే ప్రతిభలేని వారిని విద్యాసంస్థల అధిపతులుగా నియమిస్తూ వచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తల్లాగా పని చేసిన బోధనా సిబ్బందిని విశ్వవిద్యాలయ ఉపకులపతులుగా, విద్యాసంస్థల అధిపతులుగా నియమించడం కూడా విద్యా వ్యవస్థ ధ్వంసం కావడానికి మరో కారణం. బీఆర్ఎస్ హయాంలో నియమితులైన చాలామందికి విజన్, జాతీయ, అంతర్జాతీయ అనుభవం లేకపోవడం, చాలామంది పార్టీ కార్యకర్తలుగా వ్యవహరించడం వల్ల విశ్వవిద్యాలయాల పనితీరు కుంటుపడింది.

అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యా మండలి పనితీరుపై అనుమాన మేఘాలు అలుముకున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన వివిధ ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి. ఉన్నత విద్యా మండలిలోని కీలక అధికారులు బీఆర్ఎస్ కీలక నాయకుల కనుసన్నల్లో పని చేసినట్టుగా వివాదాలు వెల్లువెత్తాయి. ఉన్నత విద్యా సంస్థల ప్రమాణాలు పెంచి వాటిని రాష్ట్ర అభివృద్ధి సాధకాలుగా తీర్చిదిద్దాల్సిన ఉన్నత విద్యా మండలి కొందరు బీఆర్ఎస్ నాయకుల చేతిలో బందీగా మారిందని విమర్శలు వచ్చాయి.

> విద్యా వ్యవస్థతో నైపుణ్య అభివృద్ధిని సంఘటితం చేసి నాణ్యమైన, సృజనాత్మక మానవ వనరులను తయారు చేసే విధంగా ముఖ్యమంత్రి అధ్యక్షతన తెలంగాణ విద్యా మిషన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వచ్చే ఐదేళ్లలో స్పష్టమైన లక్ష్యాలతో ఈ విద్యామిషన్ పనిచేసినట్లయితే విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే విధంగా తయారు చేయవచ్చు.




ఈ పరిస్థితుల్లో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి రాష్ట్ర సామాజిక ఆర్థిక అభివృద్ధిలో విద్యారంగాన్ని కీలక భాగస్వామిగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. దీనికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తుంది. విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి నాంది పలికే విధంగా విద్యావ్యవస్థను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తదనుగుణంగా అభయ హస్తంలో పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో, రెండు గ్యారెంటీలు విద్యారంగానికి సంబంధించినవే కావడం గమనార్హం. అవి ఐదు లక్షల విద్యా భరోసా కార్డ్, ప్రతి మండలంలోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాల ఏర్పాటు. అంతేకాకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులను 6 శాతం నుండి 15 శాతానికి పెంచి విద్యారంగానికి పెద్దపీట వేస్తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అంతేగాక, విద్యాశాఖను ముఖ్యమంత్రి తన పరిధిలో పెట్టుకోవటాన్ని బట్టి ఆయన ప్రత్యక్షంగా విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు అభివృద్ధికి కంకణం కట్టుకున్నట్టుగా అర్థమవుతుంది. ఇందులో భాగంగా మెగా డీఎస్సీ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షణీయం. అంతేగాక ఉన్నత విద్యా మండలిని వెంటనే పూర్తిగా ప్రక్షాళన చేసి, ప్రతిభతో పాటు జాతీయ, అంతర్జాతీయ అనుభవం ఉన్న మేధావులను అధికారులుగా నియమించి ఇక ముందు ఎలాంటి ప్రవేశ పరీక్షల పేపర్లు లీక్ కాకుండా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ ప్రవేశ పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలి. దీనితోపాటు విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకంలో కూడా ఇలాంటి మేధావులను నియమించినట్లయితే విశ్వవిద్యాలయాలను రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వాములుగా మార్చవచ్చు.

విద్యా వ్యవస్థతో నైపుణ్య అభివృద్ధిని సంఘటితం చేసి నాణ్యమైన, సృజనాత్మక మానవ వనరులను తయారు చేసే విధంగా ముఖ్యమంత్రి అధ్యక్షతన తెలంగాణ విద్యా మిషన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా పారిశ్రామిక అభివృద్ధికి నైపుణ్యం గల మానవులను అందించడమే కాకుండా, లక్షలాది నిరుద్యోగ యువతకు నైపుణ్యం కల్పించి ఉపాధి మార్గాన్ని సుగమం చేసినట్లవుతుంది. వచ్చే ఐదేళ్లలో స్పష్టమైన లక్ష్యాలతో ఈ విద్యా మిషన్ పనిచేసినట్లయితే విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే విధంగా తయారు చేయవచ్చు.

• ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోరియల్ పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6 కనిష్ఠం 18.7

ఓఆర్ఆర్ రెండోదశకు గ్రహణం
● నత్తనడకన పనులు
● వేసవి నాటికి పూర్తయ్యేనా?
8



గ్రేటర్‌లో చలి తీవ్రత తగ్గడం లేదు. రాత్రి పది గంటల తర్వాత ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శీతలగాలులకు పిల్లలు, పెద్దలు ఇబ్బందులు పడుతున్నారు.





పసి ప్రాణాలకు ముప్పు.. అజాగ్రత్త వద్దు

స్కూల్ బస్సుల కింద నలిగిపోతున్న చిన్నారులు

ఉదయం స్కూల్‌కు వెళ్లేందుకు కొందరు చిన్నారులు మారం చేస్తుంటారు. చెల్లి, తమ్ముళ్లతో ఆడుతుంటారు. వారికి సర్దిచెప్పి, రెడీ చేసి స్కూల్ బస్సు రాగానే.. అమ్మ లేదా నాన్న హడావిడిగా తీసుకెళ్తుంటారు. అదే ఇంట్లో ఉండే మరో చిన్నారి కూడా అన్న/అక్కకు టాటా చెప్పేందుకు బస్సు వద్దకు పరుగులు తీస్తుంటారు. పెద్దబిడ్డను బస్సులో ఎక్కించే తొందరలో కొందరు కుటుంబ సభ్యులు మరోబిడ్డను ఆదమరుస్తున్నారు. వారు ఒక్కోసారి స్కూల్ బస్సు ముందుకు చేరుతున్నారు. డ్రైవర్లు వారిని గమనించకుండా ఒక్కోసారి ముందుకు పోనీయడంతో బస్సు చక్రాల కింద పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటువంటి వరుస ఘటనలు గ్రేటర్‌లో ఆవేదనను వి ంగులుస్తున్నాయి.

● అన్న, అక్కకు టాటా చెప్పేందుకు వచ్చి..
● డ్రైవర్ల నిర్లక్ష్యం.. తల్లిదండ్రుల అజాగ్రత్తతో ప్రమాదాలు
● గ్రేటర్‌లో కలవరపెడుతున్న వరుస ఘటనలు
● తాజాగా ఉప్పల్‌లో బస్సు కింద పడి చిన్నారి దుర్మరణం

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో స్కూల్ బస్సు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. వరుస సంఘటనలతో తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతేడాది డిసెంబర్ 16న కుషాయిగూడలో మూడేళ్ల చిన్నారి స్కూల్‌కు వెళ్తున్న అక్కకు, అన్నకు టాటా చెప్పేందుకు వెళ్లి బస్సు చక్రాల కింద నలిగి మృతిచెందింది. తాజాగా గురువారం హబ్సిగూడ రవీంద్రనగర్‌లో ఏడాదిన్నర పసిపాప కానరాని లోకాలకు వెళ్లింది. ఈ సంఘటనలకు ఎవరిది తప్పు.. ఎవరికి ముప్పు..

మిగతా 8వ పేజీలో..

జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద నిరసన

రామంతాపూర్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): హబ్సిగూడ ఘటనలో మృతిచెందిన చిన్నారి జావాలనా మృతికి కారణమైన హబ్సిగూడ జాన్సన్ గ్రామర్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద నిరసన తెలిపారు. వీరిని పోలీసులు అరెస్ట్ చేసి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్‌రావు, మనీష్, నిఖిల్, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

శుద్ధి జరుగుతోందా?

● దుర్గంచెరువు ఎస్టీపీలపై అనుమానాలు
● రోజు రోజుకూ పడిపోతున్న నీటి ఆక్సిజన్ స్థాయిలు
● చెరువును సందర్శించిన నిపుణుల కమిటీ

ఒకనాడు తాగునీటి తటాకంగా కళకళలాడిన దుర్గంచెరువు నేడు మురుగునీటితో కంపుకొడుతోంది. శుద్ధి చేసిన నీటినే చెరువులోకి వదులుతున్నట్లుగా వాటర్ బోర్డు అధికారులు చెబుతున్నా ఎన్నడూ లేనివిధంగా ఇటీవల చేపలు చనిపోవడంతో నీటిశుద్ధిపై అనుమానాలు తలెత్తుతున్నాయి. దుర్గంచెరువు ఎస్టీపీ-1 నుంచి ఎన్నో ఏళ్లుగా మురుగును శుద్ధి చేస్తున్నారు. తాజాగా మరో కొత్త ఎస్టీపీని అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేయగా, దీని పనితీరుపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



దుర్గంచెరువులో మృతిచెందిన చేపలు(ఫైల్)

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దుర్గంచెరువు ప్రస్తుతం టూరిస్ట్ స్పాట్. కొన్నేళ్ల క్రితం పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి చెరువుగా ఉండేది. ప్రస్తుతం కాలుష్య కోరల్లో చిక్కింది. చుట్టుపక్కల భారీగా నిర్మించిన అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, ఆస్పత్రుల నుంచి వ్యర్థాలు పెద్దఎత్తున చెరువులో కలుస్తున్నాయి. ఇటీవల ఓ వర్సిటీ విద్యార్థులు చేసిన పరిశోధనలో చెరువు నీటిలో డ్రైనేజీ, కెమికల్స్‌తోపాటు యూరిన్ మెటాబొలైట్స్, పెయిన్ కిల్లర్స్, యాంటీ ఒబేసిటీ మెడిసిన్స్, కొకైన్ లాంటి విష పదార్థాలు ఉన్నట్లు తేలింది. ఆక్సిజన్ స్థాయిలు రోజురోజుకూ పడిపోతున్నాయి. చెరువులోని నీటి శాంపిల్స్ సేకరించి పరీక్ష చేయగా అందులో 183 రకాల సేంద్రియ సూక్ష్మ కాలుష్య కారకాలు ఉన్నట్లు గుర్తించారు. ఫార్మాస్యూటికల్స్, హెర్బిసైడ్లు, శిలీంధ్ర సంహారిణులు, పురుగు మందులు, యూవీ ఫిల్టర్లు, ప్లాస్టిసైజర్లు, సైనోటాక్సిన్లు, హార్మోన్లు, స్టెరాయిడ్లు, మెటాబోలైట్లు వంటివి ఉన్నట్లు తేల్చారు. 50 శాతం ఫార్మాస్యూటికల్స్, 9

మిగతా 8వ పేజీలో..

పోలీస్ బాస్‌ల యాక్షన్

● శాఖల్లో భారీ మార్పులు
● సైబరాబాద్‌లో భారీగా బదిలీలు
● రాచకొండలో నలుగురు సరెండర్
● క్రిమినల్స్‌తో పాటు కమిషనరేట్ల సిబ్బందిపైనా నిఘా
● అవినీతికి పాల్పడితే వేటు
● రౌడీషీటర్లకూ వార్నింగ్

పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన జరుగుతోంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. అవినీతి ఆరోపణలు వచ్చిన కొందరిని సరెండర్ చేశారు. మరోవైపు సీపీలు రౌడీషీటర్లకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. 6



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీపీ శ్రీనివాసరెడ్డి

విద్యార్థి ఫెయిలైతే.. ఉపాధ్యాయులదే తప్పిదం

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
● విద్యాశాఖ అధికారులతో సమీక్ష
6

గోల్డ్ ప్లేస్‌లో రోల్డ్ గోల్డ్

● బంగారు దుకాణాలకు టోకరా
● కిలాడీ లేడీ అరెస్ట్..



బంగారు దుకాణంలో గౌతమి(ఫైల్)

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కోసం బంగారు దుకాణాలకు వెళ్తూ.. నకిలీవి పెట్టి బంగారు ఆభరణాలను దోచేస్తున్న కిలాడీ లేడీని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన గోనెల గౌతమి(24) సంవత్సరం క్రితం భర్త నరేందర్‌తో కలిసి నగరానికి వచ్చి కర్మన్‌ఘాట్ భూపేష్‌గుప్తానగర్‌లో నివాసం ఉంటోంది. నరేందర్ సినీరంగంలో జూనియర్ ఆర్టిస్ట్. ఈయన సంపాదన సరిపోవడం లేదని, సులువుగా డబ్బులు సంపాదించడం కోసం దొంగతనాలను మార్గంగా ఎంచుకుంది. ఇందులో భాగంగా జువెల్లరీ షోరూంలకు వెళ్లి నగలు కొనుగోలు చేస్తున్నట్లు నటించి, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కళ్లు గప్పి బంగారు ఆభరణాలను తస్కరిస్తుంది. వాటి స్థానంలో నకిలీ ఆభరణాలను పెడుతోంది. ఈ క్రమంలో డిసెంబర్ 31న మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో చైతన్యపురిలోని లలితా జువెల్లర్స్‌కి వచ్చింది. తనకు చైన్స్ చూపించాలని కోరడంతో సేల్స్ ఎగ్జిక్యూటివ్ వివిధ డిజైన్‌లతో కూడిన చైన్‌లను

మిగతా 8వ పేజీలో..

'బంజారా చరిత్ర' ఆవిష్కరణ

తార్నాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బంజారా సాహిత్య అకాడమీ సహకారంతో రచించిన బంజారా చరిత్ర గ్రంథాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. పుస్తక రచయితలు హైకోర్టు న్యాయవాది డా. ధనంజయ్‌నాయక్, ఓయూ ప్రొఫెసర్ సూర్యాధనంజయ్ గురువారం సచివాలయంలో సీఎంను కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంజారా చరిత్ర గ్రంథాన్ని వారితో కలిసి ఆవిష్కరించారు. పుస్తక రచయితలు మాట్లాడుతూ.. లిఖిత రూపంలో లేని బంజారా గిరిజన తెగ ఘనమైన చరిత్రను పుస్తక రూపంలో సమాజానికి అందించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారని తెలిపారు.


బంజారా చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు


నానక్‌రామ్‌గూడ ప్రథాన్ కన్వెన్షన్‌లో జరిగిన మమత, శ్రీనివాసరావుకట్టా దంపతుల కుమారుడు షణ్ముఖ హరీష్‌చంద్ర-సాయి మౌనిక వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఎండీ వేమూరి రాధాకృష్ణ


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

విద్యార్థి ఫెయిలైతే..
ఉపాధ్యాయులదే తప్పిదం

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఏ విద్యార్థి అయినా ఫెయిలయితే ఉపాధ్యాయుల తప్పిదం కూడా ఉంటుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో గురువారం జరిగిన సమావేశంలో గతేడాది టెన్త్ ఫలితాలను ఆయన సమీక్షించారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. విద్యార్థికి పాస్ మార్కులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. డిప్యూటీ ఈవోలు, డీఐఓలు శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాల కోసం ఎక్కువగా స్లిప్, మాక్ టెస్టులు పెట్టి వాటిపై రివిజన్ చేసినప్పుడు విద్యార్థులకు ఫైనల్ పరీక్షలంటే భయం పోతుందన్నారు. విద్యార్థులకు ప్రాక్టీస్ ఎక్కువగా చేయించాలన్నారు. పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల వెనుకబాటుపై చర్చించి వారికి సూచనలు చేయాలని కోరారు. జిల్లా విద్యాధికారి రోహిణి, ఉప విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ధోబీఘాట్ సమస్యలను పరిష్కరిస్తాం

రజకుల జీవనాధారమైన ధోబీఘాట్ సమస్యలను త్వరతగతిన పరిష్కరిస్తామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రజక వృత్తిదారుల కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లాలో ఉన్న ధోబీఘాట్‌లను సంబంధిత అధికారులు సందర్శించి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. రజక సంఘం సభ్యులు కొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. సానుకూలంగా స్పందించారు. మోడల్ ధోబీఘాట్ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని, గతంలో కట్టిన మోడల్ ధోబీఘాట్‌ను వినియోగించుకోవాలని కోరారు. హైదరాబాద్ ఆర్డీవో సూర్యప్రకాష్, సికింద్రాబాద్ ఆర్డీవో రవి, తహసీల్దార్లు, బీసీ సంక్షేమాధికారి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-కాకినాడ టౌన్ స్పెషల్ (రైల్ నెంబర్: 07021) ఈనెల 11వ తేదీ రాత్రి 9 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడ టౌన్ చేరుతుంది. కాకినాడ టౌన్- సికింద్రాబాద్ స్పెషల్ (రైల్ నెంబర్: 07022) కాకినాడ టౌన్ నుంచి ఈనెల 12వ తేదీ సాయంత్రం 5.40 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5.55 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. హైదరాబాద్- కాకినాడ టౌన్ స్పెషల్ (రైల్ నెంబర్: 07023) హైదరాబాద్ నుంచి ఈనెల 12వ తేదీ రాత్రి 6.30గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.10 గంటలకు కాకినాడ టౌన్ చేరుతుంది. కాకినాడ టౌన్-హైదరాబాద్ స్పెషల్ (రైల్ నెంబర్: 07024) కాకినాడ టౌన్ నుంచి ఈనెల 13వ తేదీ రాత్రి 10 గంటలకు బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

నిమ్స్‌లో త్రిపుర న్యాయమూర్తికి వైద్య పరీక్షలు


నిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి టి. అమర్నాథ్ గౌడ్

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి టి. అమర్నాథ్‌గౌడ్ గురువారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయన గతంలో మాదిరిగానే ఈసారి సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్డియాలజీ విభాగం సీనియర్ వైద్యులు సాయిసతీశ్, జనరల్ మెడిసిన్ సీనియర్ వైద్యులు నాగేశ్వరరావు, శెట్టి, పల్మనాలజీ సీనియర్ వైద్యులు పరంజ్యోతి ప్రత్యేక పర్యవేక్షణలో వైద్య బృందం అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. అనంతరం న్యాయమూర్తి నిమ్స్ డైరెక్టర్ బీరప్పను కలిసి నిమ్స్‌లో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పేదలకు అందిస్తున్న చికిత్సలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పోలీస్ బాస్‌ల యాక్షన్

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహంతి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏకధాటిగా అధికారులపైన నిఘా పెట్టి నలుగురు ఇన్‌స్పెక్టర్లపై వేటు వేయడంతోపాటు రెండు విడతలుగా మొత్తం 40 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ రికార్డు సృష్టించారు.

సైబరాబాద్ డిఫరెంట్

గతంలో సైబరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేసేవారు. ఏ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా చాన్స్ దొరికినా.. ఎగిరి గంతేసేవారు. కార్పొరేట్ హబ్‌గా మారిన కంపెనీలు.. పెద్ద, పెద్ద ఐటీ సంస్థలు, ప్రముఖ బ్యాంక్‌ల ప్రధాన కార్యాలయాలు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు, రాజకీయనేతలతోపాటు సెలబ్రిటీలు తమ నివాసాలను, ఆవాసాలను సైబరాబాద్ పరిధిలోకి మార్చుకుంటున్నారు. పెద్ద, పెద్ద రోడ్లు.. ఒకేసారి పెరిగిన భూముల ధరలు, ఎక్కడ చూసినా విదేశాలను తలపించే విధంగా భవనాలు.. ఇలా కొన్ని దశాబ్దాలుగా ఎంతో ఉన్నతస్థాయికి చేరుకున్న సైబరాబాద్‌లో పనిచేయాలంటే అధికారులకు ఆసక్తి ఉండడం సహజమే. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు సైబరాబాద్‌లో పోస్టింగ్ అంటేనే వణుకుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం సైబరాబాద్‌లో ఎస్‌హెచ్‌ఓగా చేయాలంటే వెనకడుగు వేస్తున్నారు. నిజాయితీగా పనిచేసే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకున్నా.. అడ్డదారులు తొక్కే అధికారులకు మాత్రం మహంతి ఓ సింహ స్వప్నమేనని సైబరాబాద్‌కు చెందిన ఓ అధికారి వర్ణించడం గమనార్హం.

రౌడీషీటర్లకు సీపీ కౌన్సెలింగ్

అసాంఘిక శక్తులు, రౌడీల కదలికలపై నిఘా పెట్టాలని అధికారులను సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఇటీవల ఆదేశించారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధుల్లోని క్రిమినల్ కేసుల్లో నేరస్థులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వేర్వేరు పీఎస్‌లకు సంబంధించిన 12 మందిని సీపీ హెచ్చరించారు. ఆయా నేరస్థుల గురించి కాలాపత్తర్ పోలీసులు ఓ రిపోర్టు తయారు చేసి సీపీకి గురువారం నివేదిక సమర్పించగా వారిని కమిషనరేట్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. వారితో సెక్యూరిటీ బాండ్లు, ష్యూరిటీలు తీసుకున్న తర్వాత నేరాలకు పాల్పడకుండా జాగ్రత్తగా మెలగాలని హెచ్చరించి వదిలేశారు. ఆ తర్వాత బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఆరుగురిని కూడా సీపీ హెచ్చరిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు.

నలుగురు ఇన్‌స్పెక్టర్ల సరెండర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లను వారి పేరెంట్ యూనిట్(మల్టీ జోన్-2)కు సరెండర్ చేస్తూ రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఉప్పల్ ఎస్‌హెచ్‌ఓ శ్రవణ్‌కుమార్, నేరేడ్‌మెట్ ఎస్‌హెచ్‌ఓ శివకుమార్, వనస్థలిపురం ఎస్‌హెచ్‌ఓ జలంధర్‌రెడ్డి, కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్‌ను సరెండర్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

శుద్ధి జరుగుతోందా?

(5వ పేజీ తరువాయి)

శాతం మెటాబోలైట్లు, 8 శాతం హెర్బిసైడ్లు ఎక్కువగా ఉన్నాయని, ఇవి నీటిలోని జీవులకు ప్రమాదరమని నిర్ధారించారు.

ఆ రెండు ఎస్టీపీలపై అనుమానాలు

దుర్గంచెరువులో మురుగుజలాలు చేరకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయగా, వర్షం వచ్చిన సందర్భంలో మాత్రమే వరద వచ్చేలా వ్యవస్థ ఉంది. ఎస్టీపీల నుంచి శుద్ధి చేసిన నీరు మాత్రమే చెరువులో కలిసేలా ఏర్పాట్లు చేశారు. చెరువు వద్ద ఐదు మిలియన్ గ్యాలన్ల సామర్థ్యం కలిగిన ఎస్టీపీ ఉండగా, దానిని వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆ ఎస్టీపీ శుద్ధి చేసిన నీటిని మాత్రమే నిత్యం చెరువులోకి వదులుతారు. అధికంగా మురుగు వచ్చిన సందర్భంలో చెరువులోకి వదలకుండా వేరే నాలా ద్వారా మళ్లిస్తారు. అయితే, చెరువు పరిసర ప్రాంతాల్లో పెరిగిన జనసాంద్రత వల్ల మురుగు భారీగా ఉత్పత్తి అవుతోంది. మొత్తం శుద్ధి చేసేందుకు ఏడు మిలియన్ గ్యాలన్ల సామర్థ్యం కలిగిన మరో ఎస్టీపీని సరికొత్తగా విదేశీ సాంకేతికతతో ఓ సంస్థ నిర్మించింది. మూడు నెలల క్రితం ప్రారంభించారు. ఈ ఎస్టీపీ ద్వారా శుద్ధి చేసిన నీటిని చెరువులోకి వదులుతున్నారు. తాజాగా, చెరువులో చేపలు చనిపోవడంతో నీటి శుద్ధిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిపుణుల కమిటీ పరిశీలన

చేపలు మృతిచెందడంపై పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా విచారించిన హైకోర్టు దుర్గంచెరువులోని కాలుష్యంపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. నాగ్‌పూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌ఈఈఆర్‌ఐ) డైరెక్టర్ అతుల్ నారాయణ్‌ను చైర్మన్‌గా, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి ఎం.శాంతివర్ధిని సభ్యులుగా కమిటీని నియమించారు. దాంతో ఈ కమిటీ గురువారం దుర్గంచెరువును సందర్శించింది. వివిధ శాఖల అధికారులతో వచ్చి పరిశీలించిన కమిటీ చెరువులోని శాంపిల్స్‌ను సేకరించినట్లు తెలిసింది. వాటిని పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి దుర్గంచెరువు కాలుష్యమవడానికి కారణాలను విశ్లేషించనున్నారు.

జేఎన్‌టీయూ ఉద్యోగులకు అందని వేతనాలు

● అధికారుల నిర్లక్ష్యం.. పెన్షనర్ల ఆక్రందన
● రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి వీసీ చీవాట్లు
● తప్పంతా బ్యాంకు వారిదేనంటున్న రిజిస్ట్రార్



హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న వేలాదిమంది రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. వర్సిటీకి సమృద్ధిగా నిధులున్నప్పటికీ, ఉద్యోగులకు నెలవారీ వేతనాలను చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకే కాకుండా, రిటైరైన ఉద్యోగులకు పెన్షన్లు కూడా అందకపోవడంతో ఈ విషయం వర్సిటీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. వైస్ చాన్స్‌లర్‌కు సన్నిహితంగా ఉండే పలువురు మాజీ ఉద్యోగులు తమకు పెన్షన్ అందకపోవడంపై ఆయనకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సకాలంలో వేతనాలు, పెన్షన్లను అందించడంలో విఫలమైన రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను, సిబ్బందిని వీసీ చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. డిసెంబర్ 31న బ్యాంకులు పనిచేసినప్పటికీ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సెలవు తీసుకోవడం, జనవరి ఒకటో తేదీన బ్యాంకులు సెలవు కావడంతో ఈ సమస్య ఉత్పన్నమైనట్లు తెలిసింది. 2వ తేదీ సాయంత్రం వేతనాల మొత్తానికి చెక్కు సిద్ధం చేసి, బ్యాంకుకు పంపినప్పటికీ అప్పటికే సమయం అయిపోవడంతో ఉద్యోగుల ఖాతాల్లో సొమ్ము జమకాలేదు. మూడవ తేదీ ఎస్‌బీఐ ఖాతాలున్న ఉద్యోగులకు మాత్రమే వేతనాలు అందగా, యూనియన్ (ఆంధ్రా) బ్యాంకు ఖాతాలున్న జేఎన్‌టీయూ హైదరాబాద్, వివిధ జిల్లాల్లోని అనుబంధ కళాశాలల రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు అందలేదని తెలిసింది.

ప్రతినెల ఒకటో తేదీన అందే జీతాలు అందకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు వేతనాలు అందకపోవడంపై రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్‌ను వివరణ కోరగా.. బ్యాంకు వారు జమ చేయకపోతే మాకేం సంబంధమని అన్నారు. వేతనాల చెల్లింపులో జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వీసీ కట్టా నర్సింహారెడ్డి రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, సిబ్బందిని హెచ్చరించినట్లు తెలిసింది.



షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితా రెడ్డి

గత ప్రభుత్వ పథకాలు కొనసాగించాలి

పహాడిషరీఫ్, జనవరి4(ఆంధ్రజ్యోతి): గత తొమ్మిదిన్నర ఏళ్లుగా కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్‌లతోపాటు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కేసీఆర్ అమలు చేశారని, వాటిని కొనసాగించాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన 77మందికి కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న కాలంలో ఈ చెక్కులతోపాటు తులం బంగారంతో లబ్ధిదారులు అందుకుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలోనే కొంతమందికి చెక్కులు మంజూరైన, ఎన్నికల కోడ్ కారణంగా లబ్ధిదారులకు అందించలేక పోయామని, చెక్కులు పొందిన వారు వెంటనే బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాధి, వైస్ చైర్మన్ ఫర్హానాజ్ యూసుఫ్, బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డి, మునిసిపల్ కమిషనర్ వసంత, కౌన్సిలర్లు, సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ స్థానాలు



షర్ఫుద్దీన్ హమేద్

పహాడిషరీఫ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్ సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ హస్తగతం చేసుకుంటుందని జల్‌పల్లి మున్సిపాలిటి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్ అన్నారు. తెలంగాణలో నెల రోజుల్లోనే ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగి పోయారని, రైతుబంధు, పెన్షన్ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెట్టేందుకు 5 గ్యారంటీల పేరుతో ప్రజా పాలన పథకాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. ఇవి ఉంటాయా.. లేదా అని ప్రజలు అయోమయంలో ఉన్నారన్నారు. దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ఎన్ని రోజులకు అమలుచేస్తారో ప్రజలకు తెలియజేయాలని అన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



డీఈ రాజారాంరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

పహాడిషరీఫ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కందుకూర్ డివిజన్లో ఉన్న విద్యుత్ బకాయిలను వసూలు చేసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని విద్యుత్ శాఖ డీఈ రాజారాంరెడ్డి అన్నారు. విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం ప్రతినిధులు డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ అభ్యున్నతికి కోసం కార్మికులు, సిబ్బంది పాటుపడాలన్నారు. కందుకూరు డివిజన్లో రూ. 3.25 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నాయని వాటి వసూలు చేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఈ కేవీయన్ రెడ్డి, ఏఈ ఎల్‌వి సత్యనారాయణ, ఏఈ చంద్రశేఖర్, విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం ప్రతినిధులు ప్రెసిడెంట్ రమేష్, వైస్ ప్రెసిడెంట్, శ్రీనువాసు, సెక్రటరీ నరేందర్ రెడ్డి, లక్ష్మణ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించండి



కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు మొక్కను బహూకరిస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

గోషామహల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు సత్యనారాయణ, యాదగిరి, రఫీ, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సారస్వత పరిషత్తు వచన కవిత అధ్యయన శిబిరం

గోషామహల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల నిర్వహించిన యువ రచయిత్రుల సమ్మేళనానికి కొనసాగింపుగా ఫిబ్రవరి 11న వచన కవిత్వంలో అధ్యయన శిబిరం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్యలు తెలిపారు. అబిడ్స్ తిలక్ రోడ్డులోని పరిషత్తు ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరంలో కవిత్వ భాషా శైలి, శీర్షిక, వస్తువు, శిల్పం, ఎత్తుగడ, నిర్వహణ ముగింపు మొదలైన అంశాలపై ప్రముఖ కవులు, విమర్శకులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యువ రచయిత్రుల సమ్మేళనంలో పాల్గొన్న వారిలో సుమారు 50 మందిని వారి కవితలను పరిశీలించి ఎంపిక చేశామని.. ఎవరైనా పాల్గొనదలిస్తే ఇటీవల రాసిన స్వీయ కవితను, ఇతర వివరాలతో దరఖాస్తు చేస్తే ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను 9603727234 వాట్సాప్ నంబర్‌కు ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తులను పంపాలని కోరారు.

దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు



ధనుర్మాసం పురస్కరించుకుని గురువారం నారాయణగూడలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక రథ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ హేమలత యాదవ్, బీఆర్ఎస్ నేత బాబుయాదవ్, ఆలయం కమిటీ నిర్వాహకులు సుధీర్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. - హిమాయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజ్‌నారాయణ్ ఏకగ్రీవం



అఫ్జల్‌గంజ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ టీసీసీ రాష్ట్ర అధ్యక్షులుగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ మిర్యాడి రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని టీసీసీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ త్వరలోనే రిటైర్డ్ న్యాయమూర్తులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, మేధావులు, ఇంజనీర్లతో నూతన కమిటీలను ఎంపిక చేసి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడుతానని తెలిపారు.

కేటీఆర్‌కు శుభాకాంక్షలు



గోషామహల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌ను గురువారం గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం కావాలి..

● ప్రొఫెసర్ కోదండరాం



సదస్సులో మాట్లాడుతున్న కోదండరాం

చార్మినార్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణే అందరి ధ్యేయం కావాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. సిటీ కాలేజ్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరాం మాట్లాడుతూ నాగరిక జీవితం గడపాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సూత్రాలను పాటించాలన్నారు. రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తేనే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల, రాజ్యాంగంలోని కీలకమైన సాంకేతిక పదాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలనే సంకల్పంతో ఈ సదస్సు నిర్వహించామన్నారు. ప్రొఫెసర్ డా.కె.భాస్కర్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులకు ప్రొఫెసర్ కోదండరాం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ఉపసంచాలకులు డా.షహజాద్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థ బలపడింది

●ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ ప్రాధాన్యం పెరిగింది

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా రవాణా వ్యవస్థ బలపడిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ ప్రాధాన్యం పెరిగిందని ప్రొఫెసర్ ఎం.కోదండరాం పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో దెబ్బతిన్న ఆర్టీసీని అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణ ప్రణాళిక చేపట్టబోతున్నారని తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సికింద్రాబాద్, హైదరాబాద్ రీజియన్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోదండరాం హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమూద్, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశం, అదనపు ప్రధాన కార్యదర్శి అబ్రహం మాట్లాడారు. ఆర్టీసీలోని వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు చెల్లించాలని, వేతన సవరణ చేయాలని, ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.సత్యనారాయణరెడ్డి, ఆర్.డి.చంద్రశేఖర్, నాగన్నగౌడ్, తిరుమలేష్, జె.గోపాల్, అఫ్జల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయినా ప్రమోట్ చేయాలి



రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో నిరసనకు దిగిన విద్యార్థులు

రాజేంద్రనగర్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలనుంచి ఉద్యాన విద్యనభ్యసించడానికి వస్తున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు కొన్ని నిబంధనలను సడలించాలని కోరుతూ గురువారం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి నిరసనకు దిగారు. ఉద్యాన బీఎస్సీ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తృతీయ సంవత్సరానికి వెళ్లాలంటే మొదటి సంవత్సరం సబ్జెక్టులన్నీ ఉత్తీర్ణులు కావాలనే నిబంధన ఉందని, దాన్ని సడలించాలన్నారు. తెలుగు మీడియం నుంచి గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉద్యాన విద్యనభ్యసించడానికి వస్తుంటారని, వారికి ఇంగ్లీషు అర్థం కాక చాలామంది ఫెయిల్ అవుతుంటారని గుర్తు చేశారు. వారందరిని దృష్టిలో ఉంచుకుని మూడవ సంవత్సరంలోకి విద్యార్థులందరినీ ప్రమోట్ చేయాలన్నారు. రాజేంద్రనగర్ నుంచి తొలగించిన ఉద్యాన ఎంఎస్సీ పీహెచ్‌డీ కోర్సులను తిరిగి ఇక్కడే కొనసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి

రాజేంద్రనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కారణంగా విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపినట్లు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. లేనిపక్షంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్యతో కలసి ఆందోళన చేపడతామన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు



బుద్వేల్‌లో ఇంటింటికి అయోధ్య రామ మందిర అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

రాజేంద్రనగర్, జనవరి4(ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలు గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ కట్ట మైసమ్మ దేవాలయానికి చేరుకున్నాయి. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బుద్వేల్ పురవీధులలో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు కోరని శ్యామ్, కోరని నరేందర్, వెంకటేష్, గుంటి రమేష్, కె.ఎల్ బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

కాల్వగడ్డలో వితరణ..

బహదూర్‌పురా, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర సద్భావన ప్రముఖ్ చార్మినార్ బాగ్ అలంపల్లి దశరథ్, చార్మినార్ బాగ్ ధర్మజాగరణ ప్రముఖ్ కొత్తకోట రామ్‌రాజ్ ఆధ్వర్యంలో అలియాబాద్ కాల్వగడ్డలో నిర్వహించిన శ్రీరామ అక్షింతల వితరణ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాజన్నబావి, ఫూల్‌బాగ్ చమన్, కాల్వగడ్డ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి శ్రీరాముని అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ బస్తీ ప్రముఖ్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి, సహదేవ్, సంతోష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీనగర్‌లో పూజలు



అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలకు ఉప్పుగూడ డివిజన్ శివాజీనగర్ ఫేజ్-త్రీ దుర్గా పోచమ్మ దేవాలయంలో గురువారం పూజలు చేశారు. డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు మగుటం వెంకటేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాట సత్యనారాయణ, చంద్రమౌళి, జి.బాలరాజ్, ఎం.శంకర్, ఇ.రాజు, ఎ.రామస్వామి, జె.మల్లేశం, కె.శంకర్, ఆర్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. - చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)

శివగంగానగర్‌లో వితరణ..



లక్ష్మీనగర్ శివగంగానగర్ శివాలయం కమిటీ ఆధ్వర్యంలో గురువారం శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర అక్షింతల వితరణ జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కొడి మహేందర్, దేవాలయ కమిటీ చైర్మన్ రాజలింగం, దశరథ్, రామరాజు, శ్రీనివాస్, మహేశ్ యాదవ్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. - చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

పహాడిషరీఫ్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. వేగంగా వచ్చిన లారీ ఢీకొని ఓ వ్యక్తి, కిరాణా దుకాణానికి వెళ్లి వస్తుండగా బైక్ ఢీకొని మరోవ్యక్తి, ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిల మృతిచెందారు.

బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేగంగా వచ్చిన లారీ ఓ బైక్‌ను ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ యూసుఫ్ జానీ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చాంద్రాయణగుట్ట నుంచి బైక్ (ఏపీ 29 ఏఆర్ 5053) పై పహాడిషరీఫ్ వైపు వెళ్తుండగా.. ఎర్రకుంట చౌరస్తా వద్ద గుంతల మయంగా ఉన్న రోడ్డులో వేగంగా వచ్చిన లారీ (ఏపీటీ 5487) ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిరాణా దుకాణానికి వెళ్లి వస్తుండగా..

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల సీబీసీఐడీ అపార్ట్‌మెంట్‌లో సంగారెడ్డి జిల్లా అంతెర్‌గాన్ గ్రామానికి చెందిన భూతలి బాలరాజు(41) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటో తేదీ రాత్రి 10 గంటల సమయంలో కిరాణా షాపునకు వెళ్లాడు. తిరిగి వస్తూ హైదర్‌నగర్ పోచమ్మగుడి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు బాలరాజు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని...

ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రంగారెడ్డినగర్‌కు చెందిన ఆదెపు శైలజ(34) కేపీహెచ్‌బీ కాలనీలో నెక్సస్ ఫోరం మాల్ సమీపంలోగల ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గురువారం ఉదయం జగద్గిరిగుట్టలో ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కార్యాలయానికి వెళ్తోంది. కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శైలజను స్థానికంగాగల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ఎం.వెంకటరమణ, తదితరులు

బీసీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

రాజేంద్రనగర్, జనవరి4(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024వ సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ శివాజీ, డిప్యూటీ రిజిస్ట్రార్ మహేశ్వర్, డిప్యూటీ రిజిస్ట్రార్ టీచింగ్ కుమారస్వామి, డిప్యూటీ కంట్రోలర్ సత్యనారాయణ, బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి దశరథ, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడిగా బాల్‌రాజ్



నియామక పత్రం అందుకుంటున్న బాల్‌రాజ్

చాంద్రాయణగుట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడిగా సాయిబాబానగర్‌కు చెందిన బొడిగల్ల బాల్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డి నియామక పత్రం అందజేశారు.

మూర్ఛవ్యాధితో కిందపడి వ్యక్తి మృతి

గోషామహల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధితో బాత్‌రూమ్‌లో కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జియాగూడ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన బి.నర్సింగ్ (55) గురువారం ఉదయం 5 గంటల బాత్‌రూమ్‌కు వెళ్లగా అదే సమయంలో మూర్ఛవ్యాధి రావడంతో కిందపడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు నర్సింగ్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు వెల్లడించారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ సాయి సరస్వతి అపార్ట్‌మెంట్స్‌లో ఈడుపుగంటి చిన సాంబశివరావు(65) నివసిస్తున్నాడు. గతంలో ప్రైవేటు ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. కొంతకాలం కోల్‌కతాలో కుమార్తె వద్ద ఉన్నాడు. 20 రోజుల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీలో ఒంటరిగా ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం వరకు సాంబశివరావు తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అతడు రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు ఆర్‌పీఎఫ్ కృషి

693 మంది అరెస్ట్.. రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తి స్వాధీనం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : దక్షిణమధ్య రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) నేరాల నివారణకు నిరంతరం కృషి చేస్తూనే అక్రమార్కులను అరెస్టు చేసి ప్రయాణికుల్లో విశ్వసనీయత పెంచింది. రైళ్లు, రైల్వేస్టేషన్లలో నేర కార్యకలాపాలను విజయవంతంగా నియంత్రించినట్టు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది రైల్వే వస్తువులు అపహరించిన, ఆస్తులను ఆక్రమించిన 693 మందిని అరెస్టు చేసి రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లు రువ్వినందుకు 401 కేసులు నమోదు చేసి 327 మందిని అరెస్టు చేశారు. 161 మందిని అరెస్టు చేసి 23.09 కోట్ల విలువైన 3,239 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లను అనధికారికంగా విక్రయించినందుకు 261 మందిని అరెస్టు చేసి రూ.2,30,59,680 విలువ చేసే 8770 టిక్కెట్లను రైల్వే రక్షణ దళం స్వాధీనం చేసుకుంది. టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీలో ప్రయాణించిన 702 మంది నుంచి రూ. 1.47 లక్షల జరిమానా వసూలు చేసినట్టు తెలిపారు.

ఫుట్‌బోర్డ్‌లపై ప్రయాణించినందుకు 627 మందిని పట్టుకున్నారు. టిక్కెట్ లేకుండా ప్రయాణించిన 1903 మంది వద్ద రూ.1.36 లక్షల జరిమానా వసూలు చేశారు. రైళ్లలో ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను తీసుకెళ్తున్న 19 మందిని అరెస్టు చేశారు. రైల్వే ప్రాంగణంలో ప్రయాణికుల వస్తువులను దొంగిలించిన 454 మందిని అరెస్టు చేసి 9.36 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

వన్నోజ్ రవికుమార్‌కు డాక్టరేట్



రవీంద్రభారతి, జనవరి4 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వన్నోజ్ రవికుమార్ జేఎన్టీయూ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఎం.ఎల్.ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ పూర్ణచందర్ రావు పర్యవేక్షణలో సీక్వెన్షియల్ ప్యాటర్న్ మైనింగ్ ఓవర్ లార్జ్ డాటాసెట్స్ విత్ ఆప్టిమల్ ఫ్రేమ్ వర్క్ అనే అంశంపై పరిశోధన చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా దేవుని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రవికుమార్ గత 18 సంవత్సరాలుగా బోధనారంగంలో సేవలు అందిస్తున్నారు.

జన్‌సంఘ్ నాయకుడు హనుమంతురావు మృతి

కార్వాన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, జన్‌సంఘ్ నాయకులు ఆకుల హనుమంతురావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు పాండు యాదవ్ తదితరులు సంతాపం తెలిపారు. నేడు లంగర్ హౌజ్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నట్లు కార్వాన్ బీజేపీ కన్వీనర్ గోవర్ధన్ తెలిపారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో 14,545 దరఖాస్తులు

రాజేంద్రనగర్, జనవరి4(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లో గురువారం ప్రజా పాలనలో 14,545 అభయ హస్తం దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తెలిపారు. వాటిలో ఆరు గ్యారంటీలకు సంబంధించి 9,870 దరఖాస్తులు, ఇతర సమస్యలు, రేషన్ కార్డుల కోసం 4,675 దరఖాస్తులు వచ్చాయన్నారు. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయాలు, కేంద్రాలలో ప్రజా పాలన గురించి తెలుసుకోవడానికి సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ రాధారాణి పర్యటించారు. ప్రజా పాలన కార్యక్రమం సాఫీగానే జరుగుతున్నదని ఆమె తెలిపారు.

7న పూజారులకు స్వెటర్ల పంపిణీ

యాకుత్‌పురా, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మజ్లిస్ బచావో తహరిక్(ఎంబీటీ) పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న పూజారులకు ఈనెల 7న పాతబస్తీ గౌలిపుర పటేల్‌నగర్‌లోని గాలి పోచమ్మ దేవాలయం వద్ద ఉలన్ స్వెటర్, ప్లేట్, స్టీల్ గ్లాస్‌లను పంపిణీ చేస్తున్నట్లు ఆ పార్టీ సంయుక్త కార్యదర్శి బుంగ శివకుమార్ తెలిపారు. ఎంబీటీ అధికార ప్రతినిధి మహ్మద్ అంజతుల్లాఖాన్ సహకారంతో వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న పూజారులకు వీటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్ 9346472829లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మైనర్‌ను మోసం చేసిన నిందితుడికి పదేళ్ల శిక్ష

రంగారెడ్డి కోర్టులు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో మైనర్‌ను మోసం చేసిన నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.30 వేల జరిమానా, రూ.5 లక్షల నష్టపరిహారం విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు వెల్లడించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునిద వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. గడ్డిఅన్నారానికి చెందిన వినయ్ 16 సంవత్సరాల మైనర్‌ను ప్రేమ, పెళ్లి పేరిట లోబరచుకుని, ఆ తరువాత బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన పోక్సో కోర్టు న్యాయాధికారి ఎం.కె.పద్మావతి నిందితుడికి శిక్ష విధించారు.



సెక్రటేరియట్ రోడ్డును కమ్మేసిన మంచు

తగ్గని చలి.!

- రాత్రి పూట పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- చలితో వణికిపోతున్న పిల్లలు, పెద్దలు

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో చలి ప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణ కనిష్ఠ ఉష్ణోగ్రతల కంటే మూడు, నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదవుతుండడంతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రధానంగా ఉదయం వేళలో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులతోపాటు ఉద్యోగులు, చిరువ్యాపారులు, కూరగాయలు విక్రయించేవారు చలికి వణికిపోతున్నారు. కాగా, తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గురువారం నగరంలో సాధారణ కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.7 డిగ్రీలుండగా.. పలుచోట్ల నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. రాజేంద్రనగర్‌లో అత్యల్పంగా 14.6 డిగ్రీలు, మల్కాజిగిరిలో 15.5, హయత్‌నగర్‌లో 16.5, చాంద్రాయణగుట్టలో 16.8, కాప్రాలో 17.0, కూకట్‌పల్లిలో 17.5, మలక్‌పేట్‌లో 17.6, గాజులరామారం, కుత్బుల్లాపూర్‌లో 17.7, అల్వాల్‌లో 17.8, బేగంపేట్, సికింద్రాబాద్‌లో 17.9, సంతో‌ష్‌నగర్‌లో 18.0 డిగ్రీలు నమోదయ్యాయి.

ఓఆర్‌ఆర్ రెండోదశకు గ్రహణం

నత్తనడకన పనులు



- గతేడాది వేసవికే నీరు ఇవ్వాలని లక్ష్యం
- ఇప్పటికీ 70 శాతం పనులే..
- వచ్చే వేసవికైనా పూర్తయ్యేనా?

రాష్ట్రంలో ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నట్లుగా ఓ వైపు అధికారులు లెక్కలు చెబుతున్నప్పటికీ నగర శివారు ఔటర్ పరిధిలోని అత్యధిక ప్రాంతాలకు ఇంటింటికి నీరు అందడం లేదు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఓఆర్‌ఆర్ ఫేజ్-2 పనులకు గ్రహణం పట్టుకుంది. పనులు చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా, నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది వేసవికే ఓఆర్‌ఆర్‌ఫేజ్-2 ప్రాజెక్టు కింద కొన్ని ప్రాంతాలకైనా నీరు ఇచ్చేవిధంగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా, ఇప్పటికీ చుక్కనీరు సరఫరా చేయలేదు. డిసెంబర్ నాటికి ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేయాలని భావించినా, ఇప్పటి వరకు పనులు 70శాతం కూడా పూర్తవ్వలేదు. మరో మూడు నెలల్లో వేసవి రానుంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బోర్లపై ఆధారపడిన ఇళ్లకు నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితి నెలకొంది.

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు తాగునీటిని అందించే బాధ్యతలను వాటర్‌బోర్డుకు అప్పగించింది. దాంతో ఓఆర్‌ఆర్‌ఫేజ్-1 ప్రాజెక్టులో భాగంగా రూ.756 కోట్లతో కొంత మేరకు పనులు పూర్తి కాగా, ఓఆర్‌ఆర్ ఫేజ్-2లో భాగంగా రూ.1200 కోట్లతో ఔటర్ పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలకు తాగునీటి అందించే పనులను 2022లో ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తగా 73 సర్వీసు రిజర్వాయర్లు (138 మిలియన్ లీటర్ల సామర్థ్యం), 2988 కిలోమీటర్ల మేర నూతన పైపులైను నెట్‌వర్క్‌ను నిర్మించాల్సి ఉంటుంది. అయితే, ఈ ప్రాజెక్టు పూర్తయి రిజర్వాయర్లు అందుబాటులోకి వస్తే మొత్తంగా ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయతీలు 3.6 లక్షల కుటుంబాలు, 25 లక్షల జనాభాకు ప్రయోజనం కలుగుతుంది.

గతేడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

రూ.1200కోట్లతో చేపట్టిన ఈ పనులు గతేడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో అప్పట్లో వాటర్‌బోర్డు ఎండీగా ఉన్న దానకిశోర్ రెండు భాగాలుగా విభజించారు. ప్యాకేజ్-1లో రూ.613.14 కోట్లతో 1571 కిలోమీటర్ల మేర కొత్తగా పైపులైన్ వేయడంతో పాటు 65.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన 34 రిజర్వాయర్లు నిర్మించాలని, ప్యాకేజ్-2లో రూ.586.86 కోట్లతో 1094 కిలోమీటర్ల మేర పైపులైన్ విస్తరణ, 36 రిజర్వాయర్లు నిర్మించాలని భావించారు. గతేడాది వేసవి నాటికి 272 కాలనీలకు తాగునీటిని అందివ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించగా, ఆ దిశగా పనులు సాగలేదు. డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని భావించగా, ఇప్పటివరకూ కనీసం 70శాతం కూడా పూర్తవ్వలేదు.

నిర్లక్ష్యమే కారణం..

ఓఆర్‌ఆర్‌ఫేజ్-2 ప్రాజెక్టు పనులు ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో అధికారులు సైతం స్పష్టతనివ్వడం లేదు. ఓఆర్ ఆర్‌ఫేజ్-2 ప్రాజెక్టులో 73 రిజర్వాయర్లకు 23 మాత్రమే ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక మిగతా 50 రిజర్వాయర్ల పనులు ఇంకా సాగుతున్నాయి. మొత్తం 2988 కిలోమీటర్ల పైపులైన్‌కు గానూ 2032 కిలోమీటర్ల పైపులైన్ నెట్‌వర్క్ నిర్మాణం పూర్తయింది. ఇంకా956 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉన్నది. తాగునీటి సరఫరా పనులను సత్వరమే పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల అలసత్వమే కారణమని, దాంతో పనులు పూర్తి చేయడానికి నిర్మాణఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటర్‌బోర్డు ఎండీగా కొత్తగా నియమాకమైన సుదర్శన్‌రెడ్డి ఎన్నికల విధులకు వెళ్లడంతో పనులన్నీ ఎక్కడేసిన గొంగడి అక్కడే చందంగా మారాయి.

వారికి బోర్లే ఆధారం..

ఔటర్ పరిధిలోని ఆవాసాలు అత్యధికంగా బోర్లపైనే ఆధారపడి ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు పడిపోతున్నాయి. వేసవి నాటికి ఆయా ప్రాంతాల దాహార్తి తీర్చే బోర్లు కూడా వట్టిపోయే ప్రమాదముంది. వేసవి నాటికి భూగర్భ జలాలు అందకుండా పోతాయని శివారు ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఓఆర్‌ఆర్‌ఫేజ్-2 పనులు పూర్తి చేసి, ఇంటింటికి తాగునీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని శివారు ప్రజలు కోరుతున్నారు.

పేదల జోలికొస్తే తాట తీస్తాం

- దానం నాగేందర్ అనుచరులను వెంటనే అరెస్టు చేయాలి
- బాధితులకు సీపీఐ అండగా ఉంటుంది
- బేగంపేటలోని ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పర్యటించిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ

బేగంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పేదల ఇళ్లు అన్యాయంగా కూల్చి కబ్జాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులపై కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో భూకబ్జాదారులు పేదల ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఈ.టి నరసింహ, జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, సనత్‌నగర్ నియోజకవర్గం కార్యదర్శి ఎండి సలీం ఖాన్‌లతో కలిసి సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. కూల్చివేసిన ఇళ్లు తిరిగి నిర్మించుకోవడానికి ప్రభుత్వం సహాయం అందించాలన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని బస్తీ వాసులకు హామి ఇచ్చారు. దానం నాగేందర్ అనుచరులు తిరిగి పేదల జోలికొస్తే తాట తీస్తామని ఈ సందర్భంగా నారాయణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇంతియాజ్ ఖాన్, సైఫ్‌ఖాన్, జావీద్, వెంకటేష్, దశరథ్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

నిజ నిర్ధారణ కమిటి పర్యటన...

బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ పేదల ఇళ్లను నాయకులు బెదిరించి ఖాళీ చేయిస్తున్నారని జనవరి 2న బస్తీ వాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ విషయం మీడియాలో రావడంతో అసలు విషయం తెలుసుకునేందుకు ఈనెల 3వ తేదిన మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ బృందం ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లోని ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ ఉపాధ్యక్షులు బిలాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌తో కూడిన బృందం నిజ నిర్ధారణ జరిపింది. జిల్లా కలెక్టర్ విచారణ జరిపి ఆ బస్తీ వాసులకు చట్టరీత్యా నివాస హక్కులు కల్పించాలని కమిటీ డిమాండ్ చేసింది. బస్తీ వాసులకు రౌడీల నుంచి పోలీస్ కమీషనర్ పూర్తి రక్షణ కల్పించాలని, ఎమ్మెల్యే దానం నాగేందర్ పాత్రపై ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది.

పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీ: మల్లారెడ్డి

మేడ్చల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధిష్ఠానం ఆదేశిస్తే లోకసభ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చెప్పారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. మంత్రి హోదాలో పనిచేసిన తాను ఎమ్మెల్యే పదవిలో ఇమడలేకపోతున్నానన్నారు. ఎంపీగా పోటీ చేసి పార్లమెంటుకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ భవన్‌లో పార్లమెంటు నియోజకవర్గ విస్తృతస్థాయిలో సమావేశాలు జరుగుతున్న తరుణంలో మల్లారెడ్డి వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం కూడా ఈనెల 21న నిర్వహించనున్నారు.

బాలికపై అత్యాచారం

జీడిమెట్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నాను, పెళ్లిచేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి ప్రాంతంలోని అమీన్‌పూర్‌కు చెందిన మల్లా రవి (23) స్విగ్గీబాయ్‌గా పనిచేస్తున్నాడు. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన మైనర్ బాలికను నమ్మించి మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వుయ్ ఆర్ పీజీస్.. నాట్ బేబీస్..!

- స్వేచ్ఛను కాలరాస్తున్నారని హాస్టల్ విద్యార్థినుల ఆందోళన
- వారి మంచికోసమే నిబంధనలు : ప్రిన్సిపాల్



ఆందోళన చేస్తున్న పీజీ హాస్టల్ విద్యార్థినులు

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ పేరిట యూనివర్సిటీలో కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారని, ఇది పూర్తిగా తమ స్వేచ్ఛను కాలరాయడమేనని జేఎన్‌టీయూ పీజీ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలో, హాస్టల్లో అధికారులు అమలుచేస్తున్న నిబంధనలను వ్యతిరేకిస్తూ గురువారం వర్సిటీ ప్రధాన గేటు వద్ద రోడ్డుపైనే బైఠాయించారు. చాలీచాలని గదుల్లో ఊపిరాడని పరిస్థితులు ఉన్నాయని, ఆహ్లాదం కోసమని బయటకు వెళితే.. పేరెంట్స్‌కు అనుమానం వచ్చేలా ఫోన్ చేసి చెబుతున్నారని విద్యార్థినులు వాపోయారు. ఎందుకిలా అని ప్రశ్నిస్తే హాస్టల్ ఖాళీ చేయమని, అడ్మిషన్ రద్దు చేస్తామని వార్డెన్లు, ప్రిన్సిపాల్ బెదిరిస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన పీజీ విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకొని యూనివర్సిటీలో కొన్ని నియమనిబంధనలను అమలు చేస్తున్నాం అని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయకుమార్ రెడ్డి తెలిపారు. విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు డిప్యూటీ వార్డెన్లను అక్కడ్నుంచి బదిలీ చేశామని, దీంతో ఆందోళన సద్దుమణిగిందన్నారు.

- ఓయూలో నిరసన..

తార్నాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందుబాటులో ఉండని ఉస్మానియా యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ డైరెక్టర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు గురువారం ఓయూ లేడీస్ హాస్టల్ ముందు ప్రధాన రహదారిపై బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి రవినాయక్ మాట్లాడుతూ.. నెల రోజులుగా లేడీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కారణంగా నలుగురు విద్యార్థినిలు అనారోగ్యానికి గురయ్యారని తీవ్రంగా మండిపడ్డారు. హాస్టల్ సమస్యలపై పలుమార్లు విద్యార్థి సంఘాల నాయకులు లేడీస్ హాస్టల్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు శ్రీకాంత్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ ప్లేస్‌లో రోల్డ్ గోల్డ్



కిలాడి లేడి వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిశ్రీ

(5వ పేజీ తరువాయి)

ఒక ట్రేలో తీసుకువచ్చి ఆమె ముందు పెట్టింది. ఆ చైన్‌లను పరిశీలిస్తున్నట్లు గౌతమి నటించింది. ఈ లోపు సేల్స్ ఎగ్జిక్యూటివ్ పక్కన ఉన్న ట్రేలు సరిచేస్తుండగా, గౌతమి తన దగ్గర ఉన్న రోల్డ్‌గోల్డ్ చైన్‌ను ఆ నగల ట్రేలో పెట్టి, అందులో ఉన్న బంగారు చైన్‌ను మాయం చేసింది. అనంతరం తనకు చైన్ డిజైన్స్ నచ్చలేదని చెప్పి అక్కడి నుంచి మెల్లగా జారుకుంది. గౌతమి వెళ్లిపోయిన తర్వాత చైన్‌లను ట్రేలో నుంచి తీసి షో కేసులో పెడుతున్న సమయంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ రోల్డ్ గోల్డ్ చైన్‌ను గుర్తించి, దుకాణ యజమాన్యానికి సమాచారం ఇచ్చింది. దీంతో వారు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుట్టురట్టు చేసిన సీసీ కెమెరాలు..

సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఐ యాదగిరి, క్రైం ఎస్ఐ సునిల్‌లు లలితా జ్యువెల్లర్స్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. గౌతమి వెళ్లిన ఆటోను గుర్తించారు. చైతన్యపురి నుంచి కర్మన్‌ఘాట్ వరకు ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా భూపేష్‌గుప్తానగర్‌లో గౌతమి ఉంటున్నట్లు నిర్ధారణకు వచ్చి ఆమెపై నిఘా పెట్టి గురువారం అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనం చేసినట్లు ఒప్పుకుంది. నవంబర్‌లో చైతన్యపురి మలబార్ జ్యువెల్లర్స్, చైతన్యపురి మంఖాల్, జూబ్లీహిల్స్, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకుంది. దీంతో సరూర్‌నగర్ పోలీసులు ఆమె నుంచి రూ.12 లక్షల విలువ చేసే 19 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఎల్వీ ప్రసాద్ వైద్యుడికి 'జేసీ బోస్ ఫెలోషిప్'



డాక్టర్ జావేద్ అలీ

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ (ఎల్‌వీపీఈఐ) లో క్లినిషియన్ సైంటిస్ట్‌గా పని చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ జావేద్ అలీని 'జేసీ బోస్ ఫెలోషిప్'తో సత్కరించారు. నేత్ర వైద్యంలోని డాక్రియాలజీలో ఆయన చేసిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ ఫెలోషిప్‌ను సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్ (ఎస్ఈఆర్‌బీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (భారత ప్రభుత్వం) అందజేసింది. ఆయన తన పరిశోధనకు నెలకు రూ. 25 వేల చొప్పున ఫెలోషిప్, ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.15 లక్షల రీసెర్చ్ గ్రాంట్‌ను అందుకుంటారు. ఇన్‌స్టిట్యూట్ కూడా ప్రతి ఏడాది ఓవర్‌హెడ్ ఫండింగ్ కూడా పొందుతుందని ఎల్వీపీఈఐ వర్గాలు తెలిపాయి.

పసి ప్రాణాలకు ముప్పు.. అజాగ్రత్త వద్దు

(5వ పేజీ తరువాయి)

అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 2,276 గుర్తింపు పొందిన పాఠశాలలున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో సుమారు 8.30 లక్షల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. చాలామందిని వారి తల్లిదండ్రులు పాఠశాలలకు సంబంధించిన బస్సుల్లోనే పంపిస్తుంటారు. పదుల సంఖ్యలో మాత్రమే సొంత వాహనాలపై తీసుకెళ్తుంటారు.

కొందరు డ్రైవర్లు.. నిర్లక్ష్యం..



జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

నగరంలో స్కూల్ బస్సులను నడిపే వారిలో 60 ఏళ్లు దాటిన డ్రైవర్లు ఉన్నా, లైసెన్స్‌లు లేకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మహానగరంలో విద్యాసంస్థలకు సంబంధించిన 2,359 బస్సులు తిరుగుతున్నాయి. వాటిలో సుమారు 60 శాతం బస్సులకు ఫిట్‌నెస్ లేదని అధికారులే ఒప్పుకుంటున్నారు. ఇది పరోక్షంగా బస్సుల్లో వేలాది మంది విద్యార్థుల ప్రాణాలు పణంగా పెడుతున్న స్కూల్ యాజమాన్య నిర్లక్ష్యానికి రవాణా శాఖాధికారులు మద్దతు ఇచ్చినట్టే. ట్యాక్స్‌లు.. ఫిట్‌నెస్, రెన్యూవల్స్, పర్మిట్‌లు ప్రతియేటా చేయించాలంటే ఒక్కో వాహనానికి సుమారు రూ. లక్ష వరకు ఖర్చు ఉంటుంది. దాంట్లో కొంత భాగం అక్రమ మార్గంలో అందిస్తే ఆ గొడవే ఉండదన్న సూత్రాన్ని వంట బట్టించుకున్న యాజమాన్యాలకు.. ఆమ్యామ్యాలకు కక్కుర్తి పడే అధికా రులు తోడవడంతో.. చిన్నారులను స్కూళ్లకు తరలించే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్కూల్ వాహనాలకు సంబంధించి ఏదైనా ప్రమాదం జరిగితే ఆఘమేఘాల మీద ఉన్నతాధికారులు వాలిపోతుంటారు. అదే వేగాన్ని సాధారణ రోజుల్లోనూ కొనసాగిస్తూ రోడ్లపై తిరిగే వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చిన్నారుల జీవితాలను రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది.

తల్లిదండ్రులూ ఇవి పాటించాలి..

- చిన్నారులను స్కూల్‌కు పంపే బస్సులు, ఆటోలు, వ్యాన్‌లలో లిమిట్‌కు వించి విద్యార్థులను కూర్చొబెట్టకుండా డ్రైవర్లపై దృష్టి సారించాలి.
- ఒక పిల్లాడిని బస్సు ఎక్కించేందుకు వెళ్తున్న సమయంలో మరొకరిని వెంట అసలే తీసుకెళ్లకూడదు. అలాగే బస్సు ఎక్కిస్తున్న వారిని జాగ్రత్తగా లోపల కూర్చోబెట్టాలి.
- ఓవర్ లోడింగ్ విద్యార్థులకు ప్రమాదకరంగా మారడంతోపాటు నిబంధనలకు విరుద్ధమైన ఆ చర్యపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- డ్రైవర్ల లైసెన్స్, వాహన ఫిట్‌నెస్, ఇతర పత్రాలను తల్లిదండ్రులు తనిఖీ చేస్తుండాలి.
- డ్రైవర్ల ప్రవర్తనపై కూడా కన్నేసి ఉంచాలి. సీనియారిటీ లేనివారిపై ఫిర్యాదు చేయాలి.

గత ప్రమాదాలు..

- 2018 జనవరి 21న వనస్థలిపురంలోని ప్రైవేట్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న అంజలి(6) స్కూల్ బస్సు ఎక్కింది. బస్సు క్లీనర్ చిన్నారిని సీటులో కూర్చోబెట్టకపోవడంతో డోర్ వద్ద నిలబడింది. ఈ క్రమంలో డ్రైవర్ స్పీడ్ బ్రేకర్ వద్ద నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో ప్రమాదవశాత్తు అందులో నుంచి ఎగిరి కిందపడి మృతిచెందింది.
- 2018 జూలై 10న హయత్‌నగర్‌లోని శాంతినికేతన్ స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతున్న యశ్వంత్ పాఠశాలకు వెళ్తున్నాడు. ఈ సమయంలో తండ్రి, అన్నతో వెంట వచ్చిన తమ్ముడు తన్వీష్(3) అనుకోకుండా బస్సు కిందకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు.
- 2018 జూలై 16న మేడిపల్లి పరిధిలోని పర్వతాపూర్ లక్ష్మీనగర్‌కు చెందిన బాలకృష్ణ కుమారుడు ప్రణీత్‌కుమార్(రెండున్నరేళ్లు) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం 5 గంటల సమయంలో అటుగా వెళ్తున్న బస్సు బాలుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- 2018 ఆగస్టు 27న ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 16 నెలల ప్రతీక మృతిచెందింది. అన్నయ్యను బస్సు ఎక్కించేందుకు తల్లితో కలిసి వెళ్లిన చిన్నారి బస్సు కిందకు వెళ్లి చనిపోయింది.
- 2023 నవంబర్ 18న జవహర్‌నగర్‌లో భవ్యశ్రీ(రెండున్నరేళ్లు) కూడా బస్సు చక్రాల కింద నలిగిపోయింది. అన్నను బస్సు ఎక్కించేందుకు తల్లితో కలిసి వెళ్లిన చిన్నారి బస్సు పక్కకు నిలబడింది. అన్నను తల్లి బస్సు ఎక్కిస్తుండగా.. అనుకోకుండా చక్రాల వద్దకు వెళ్లగా డ్రైవర్ ముందుకు తీసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది.
- 2023 డిసెంబర్ 16న చర్లపల్లి డివిజన్ బీఎన్‌రెడ్డి నగర్‌లో ప్రణయ్(3) బస్సు కిందకు వెళ్లి చనిపోయాడు. అక్క, అన్న ఇద్దరు స్కూల్ బస్సులో వెళ్లేందుకు ఇంటి బయటకు వచ్చారు. ఈ సమయంలో ఇంటి అరుగుపై కూర్చున్న ప్రణయ్ అనుకోకుండా బస్సు కిందకు వెళ్లడంతో మృతిచెందాడు.
- హబ్సిగూడ రవీంద్రనగర్‌లో గురువారం జవాలన(ఏడాదిన్నర) మృతిచెందింది. అన్నను స్కూల్‌కు పంపించేందుకు తండ్రితో కలిసి వచ్చిన చిన్నారి కిందకు దిగింది. ఆడుకుంటూ బస్సు కిందకు వెళ్లగా.. డ్రైవర్ గమనించకుండా ముందుకు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది.



నటి పావల శ్యామలకు చెక్కును అందచేస్తున్న మనం సైతం కాదంబరి కిరణ్

నటి పావల శ్యామలకు ఆర్థిక సహాయం

బంజారాహిల్స్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న సీనియర్ నటి పావల శ్యామలకు మనం సైతం ఫౌండేషన్ అండగా నిలబడింది. సంస్థ నిర్వాహకుడు కాదంబరి కిరణ్ శివారు ప్రాంతాల్లో వృద్ధాశ్రమంలో ఉంటున్న ఆమెను కలిసి గురువారం 25 వేల రూపాయల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా కాదంబరి కిరణ్ మాట్లాడుతూ ఆర్థిక అవసరాలు, అనారోగ్యం బారిన పడ్డ వారి వివరాలు తెలుసుకొని వారికి మనం సైతం అండగా నిలుస్తుందని తెలిపారు. సినీ పరిశ్రమలో పేద కార్మికులకు, అవసరాల్లో ఉన్న పేదలకు సహాయం చేసేందుకు ఫౌండేషన్‌ను స్థాపించినట్టు చెప్పారు.

రేపటి నుంచి గైనకాలజీ సదస్సు

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రసూతి గైనకాలజీ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 9 తేదీ వరకు 66వ ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆఫ్ ప్రసూతి గైనకాలజీ 2024 సదస్సును మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించనున్నట్లు ఎఫ్ఓజీఓ ట్రెజరర్, ప్రసూతి గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ ఛైర్‌పర్సన్, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్ శాంత కుమారి తెలిపారు. ఈ మేరకు పంజాగుట్టలోని మెర్క్యురీ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 7వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభించనున్నారని తెలిపారు. గౌరవ అతిథులుగా మంత్రులుదామోదర్ రాజ నరసింహ, సీతక్క హాజరుకానున్నారని చెప్పారు. సినీ పరిశ్రమకు చెందిన రానా దగ్గుబాటి, నాగ్ అశ్విన్, శోభితా ధూళిపాళ, శ్రీలీల, ప్రియాంక దత్, స్వప్నా దత్, పాలక్ గులియా రానున్నారన్నారు. దాదాపు పదకొండు వేల మంది సభ్యులు ఈ సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐసీవోజీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ టీ వింధ్య, బీ అరుణ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సుభాషితం



అది అసాధ్యం

లభేత సిక తాసు తైలమపి యత్నతః పీడయన్
పిబేచ్చ మృగతృష్ణికాసు సలిలం పిపాసార్దితః
కదాచి దపి పర్యటన్ శశవిషాణ మాసాదయేత్
న తుప్రతినివిష్ట మూర్ఖజనచిత్తమారాధయేత్


మూర్ఖులైన వారిని మార్చడం ఎంత కష్టమో భర్తృహరి తన నీతి శతకంలోని ఈ శ్లోకంలో వర్ణించాడు.

దాన్ని ఏనుగు లక్ష్మణకవి...

తివిరి యిసుమున దైలంబు దీయవచ్చు
దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు
దిరిగి కుందేటికొమ్ము సాధింపవచ్చు
జేరి మూర్ఖుల మనసు రంజింప రాదు... అంటూ తెలుగువారికి పద్యరూపంలో సమర్పించాడు.

భావం: ఇసకలోంచి నూనెను ఏదో విధంగా తీయవచ్చు. ఎండమావుల్లో పరుగులెత్తి ఎక్కడో ఒక చోట నీరు తాగవచ్చు. కుందేటి కొమ్మును, ఎక్కడెక్కడో తిరిగి, ఎంతో కష్టపడి సంపాదించనూవచ్చు. కానీ మూర్ఖులైన వ్యక్తులకు నచ్చజెప్పడం, వారి మనసుకు నచ్చే పని చేయడం సాధ్యం కాదు.

స్వానుభవం



పద్మభూషణ్ కె.ఐ.వరప్రసాదరెడ్డి

దయలేని హృదయంలో దేవుడు ఉండడు

"నా ఆధ్యాత్మిక గురువుగా ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావు గారిని ఎంచుకున్నాను. ఆయన దగ్గర నేను మంత్రోపదేశం లాంటివి ఏవీ తీసుకోలేదు కానీ... ఆయనను అనుసరిస్తాను. ఒక రోజు ఆయన నాకు హఠాత్తుగా ఫోన్ చేశారు. "వరప్రసాద్‌గారూ! నన్ను గురువుగా భావిస్తానంటారు. ఒక మాట అడగొచ్చా?" అన్నారు. ఆయన అడిగే పద్ధతి కాస్త విచిత్రంగా అనిపించింది. "అదేవిటండీ! అడగండి" అన్నాను. "తప్పకుండా మాట నిలబెడతారా?" అని అడిగారు. "చెప్పండి గురువుగారూ!" అన్నాను. "నేను చెప్పిన తరువాత కాదనకుండా చెయ్యాలి. మీకన్నా వయసులో చిన్నవాణ్ణయినా... ఇది అడుగుతున్నాననుకోవద్దు. ఆదేశిస్తున్నాను" అన్నారు. "సరే... చెప్పండి" అన్నాను. "రేపు ఉదయం ఉజ్జయిని ఆలయంలో భస్మహారతి తీసుకోండి" అన్నారు. "దేనికి గురువుగారూ!" అని అడిగాను. "అడగొద్దని చెప్పాను కదా! 'నాది ఆదేశం' అన్నాను కదా! మళ్ళీ ప్రశ్నించవద్దు" అన్నారు. నా మనస్సు చివుక్కుమంది. గురువుమాట జవదాటకూడదు కదా! ఎలా వెళ్ళాలి? అని ఆలోచిస్తున్నాను. అప్పుడు మా ఇంట్లో ఉన్న మా బంధువుల అమ్మాయి "ఏమిటి మామయ్యా! అంత ఆందోళనగా ఉన్నారు?" అని అడిగింది. "ఉజ్జయిని వెళ్ళాలి. ఎలా వెళ్ళాలో, అక్కడికి చేరుకోడానికి విమానాలు ఉన్నాయో లేదో తెలీదు. రేపు ఉదయం భస్మహారతి తీసుకోవాలి" అని చెప్పాను. "భస్మహారతి ఉదయం కాదు మామయ్యా! వేకువజామునే ఏ రెండింటికో అవుతుంది" అందామె. 'అంటే ఈరోజే బయలుదేరాలి. గురువుగారు రేపు భస్మహారతికి వెళ్ళమన్నారు. రేపు రాత్రి చేసుకోవచ్చా?' అనేది మరో సందేహం. చివరికి... ఆ రోజే బయలుదేరి ఉజ్జయినికి చేరుకున్నాను. అక్కడ నాకెవరూ తెలీదు. నాకు భస్మహారతి సమయం గురించి చెప్పిన మా బంధువుల అమ్మాయే... ఉజ్జయినిలో ఒక పూజారి తెలుసంటూ ఫోన్ నెంబర్ ఇచ్చింది. ఆయన ఫోన్ ఎత్తడం లేదు. ఏం చెయ్యాలనే సందిగ్ధంలో ఉండగా... ధర్మారెడ్డి గారు ఏదో పని మీద ఫోన్ చేశారు (ప్రస్తుతం టీటీడీ ఇవోగా ఉన్న ఆయన అప్పట్లో ఢిల్లీలో పని చేసేవారు). నేను ఉజ్జయినిలో ఉన్నట్టు ఆయనకు చెప్పాను. "అక్కడ కలెక్టర్ తెలుగు వ్యక్తే. నేను చెబుతాను. మిమ్మల్ని కలుసుకుంటారు" అన్నారు ధర్మారెడ్డి. ఆ తరువాత కలెక్టర్ నన్ను దగ్గరుండి తీసుకువెళ్ళి, భస్మహారతి ఇప్పించారు. మర్నాడు తిరిగి వచ్చేశాను. ఇదంతా ఎందుకని మా గురువుగారు అడగొద్దన్నారు కాబట్టి... నేను అడగలేదు.

ఏడాది తరువాత... మా ఇంటి పురోహితుడితో ఏదో శుభకార్యం గురించి మాట్లాడుతున్నాం. ఆయనకు జ్యోతిషం లాంటివి తెలుసు. నా జాతకచక్రం ఆయన దగ్గర ఉంది. "వరప్రసాద్ గారికి పెద్ద గండం గడిచిపోయింది. నాకు సంతోషంగా ఉంది" అన్నారాయన. "ఏం గడిచింది?" అని అడిగాను. "మీకు ఫలానా సమయంలో మారకం (ప్రాణాపాయం కలిగే సమయం) ఉంది. గ్రహాల సంచారం బాగులేదు. మీరు మంచి పనులు చేస్తారు కాబట్టి దాన్ని దాటతారని తెలుసు. అలాగే దాటారు" అన్నారు. "ఎప్పుడండీ? అని అడిగాను. ఆయన తేదీలు చెప్పారు. గురువుగారు భస్మహారతి తీసుకోమని చెప్పింది కూడా అవే రోజుల్లో. చాగంటివారికి నేను పుట్టిన తేదీ, సమయం, స్థలం లాంటివి ఏవీ తెలీవు. జాతకాల గురించి ఎప్పుడూ మాట్లాడరు. అలాంటి వ్యక్తి ఉజ్జయినికి వెళ్ళాలని ఎందుకన్నారో తెలీదు. ఆయన దగ్గర ఏవైనా శక్తులు ఉన్నాయా? ఏవైనా ఉంటే... ఆయనకు ముందే తెలిసి ఉంటే, పదిరోజుల ముందే చెబుతారు కదా! అంటే ఆయనకు కూడా తెలీదు. ఆయన జాతకాలు చూసే వ్యక్తి కాదు. జాతకాలు చూసే అలవాటు ఉన్న మా పురోహితుడికి నా పట్ల వ్యతిరేకత ఏమీ లేదు. నా గండం గడవాలని పూజలు కూడా చేశారట. కానీ "మీకు ప్రమాదం ఉంది. జాగ్రత్తగా ఉండండి" అని నాకు చెప్పలేదు. ఆయన చెప్పలేదు కాబట్టి... దేవుడు మా గురువుగారిని ప్రేరేపించాడా? మారకం గురించి మా గురువుగారికి ఎలా తెలిసింది? ఆయనలో ప్రేరణ కలిగిందనేది మాత్రం నిజం. ఇలాంటివి తర్కానికీ, మీమాంసకూ నిలబడవు. దేవుణ్ణి నమ్మని మా మేనమామ 'అది యాదృచ్ఛికం' అంటారు. మా అమ్మ 'అంతా దైవసంకల్పం' అంటారు. దేన్ని నమ్మాలి? రెండూ నిజమే కావచ్చు. నన్ను ఉలిక్కిపడేలా చేసిన అనుభవం అది.

ఆ రెండూ ఒక్కటే...

నన్ను కన్న తల్లి ఆస్తికురాలు. నన్ను పెంచిన మా మేనమామ నాస్తికుడు. ఈ రెండిటికీ చాలా తేడా ఉందనుకొనే చిన్నవయసు నాది. నా అయిదో ఏట చదువుకోసం మా మేనమామ ఇంటికి వెళ్ళాను. సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు... అమ్మ భగవద్గీత బోధించేవారు. రాముడు, మార్కండేయుడు, ధ్రువుడు తదితరుల గురించి చెప్పేవారు. పురాణాలు చెప్పేవారు. వీటన్నిటిద్వారా నాలో భక్తిని నింపడానికి ప్రయత్నించేవారు. నేను మళ్ళీ మా మేనమామ ఇంటికి వెళ్ళినప్పుడు... మార్క్సిజం, క్యాపిటలిజం, బలహీనుణ్ణి బలవంతుడు ఎలా పీల్చుకు తింటాడు, శ్రామికుల అదనపు శ్రమే పెట్టుబడిదారుల ఆదాయం... వీటన్నిటి గురించీ వినేవాణ్ణి. మనుషుల్లో దేవుణ్ణి చూడమని అమ్మ చెబుతుంది, మనుషుల్లో దేవుడెక్కడున్నాడని మామయ్య అంటారు. దేవుడనేవాడు లేడని ఆయన చెబుతారు. అంతా గందరగోళంగా ఉండేది. నాకు కొంత వయసు, పరిణతి వచ్చాక... అర్థమైనదేమిటంటే, ఆస్తికత్వం అనేది నాస్తికత్వానికి వ్యతిరేకం కాదని. రెండూ ఒకటే. మార్గాలు వేరు. ఆ రెండిటినీ సమన్వయం చేసుకొనే ప్రయత్నంలో నా ఆలోచనల్లో స్పష్టత వచ్చింది. దేవుడు చేసే పనులే మనం చేస్తే... దేవుడికీ ఇష్టమే కదా! దేవుణ్ణి అర్చించడం, దేవుడు సృష్టించిన కొబ్బరికాయల్నీ, ఆయన సృష్టించిన అరటి పండ్లనీ పెట్టడంలో అర్థమేముంది? అవన్నీ మనకు ఆయన ఇచ్చినవే. అవి మళ్ళీ ఆయనకు ఇవ్వడంలో విశేషం ఏముంది? మనల్ని చూసి పదిమంది అనుసరించినప్పుడే సంతృప్తి కలుగుతుంది. అలాగే దేవుడికైనా మనం ఆయన మార్గంలో పయనిస్తేనే ఆ తృప్తి కలుగుతుంది. సమాజానికి పనికొచ్చే పనులు చేస్తే... ఆయన మెచ్చుకుంటాడు. పూజగదిలో కూర్చొని, దేవుడు ఎక్కడుంటాడు, ఎలా ఉంటాడు? అని తపన పడి, పద్యాలు గుర్తుకు తెచ్చుకొని, మంత్రాలు చదువుకొని అవస్థ పడే బదులు... ఎదురుగా ఉన్న మనిషి అవసరాన్ని గుర్తించడం, ఏదైనా చెయ్యగలిగితే చెయ్యడం అనేది అర్థవంతంగా అనిపించింది. అలా చేస్తే వచ్చే తృప్తి పూజలు, పునస్కారాల ద్వారా వచ్చే దానికన్నా పెద్దది. అందుకే నా ఆస్తికత్వాన్ని సేవారంగంవైపు మళ్ళించాను. నా దగ్గర 1,600 మంది ఉద్యోగులున్నారు. నాతోపాటు వాళ్ళూ యజమానులే. వాళ్ళు నాకోసం పని చెయ్యడం లేదు. వాళ్ళకు వాళ్ళే పని చేసుకుంటున్నారు. ఆ భావన కల్పించాను. వాళ్ళకు ఆర్థికమైన ప్రతిపత్తి కల్పించాను. కమ్యూనిజం చెప్పింది ఇదే, మా అమ్మ చెప్పిందీ ఇదే. ఇలాంటివి చెయ్యకుండా కేవలం పూజలు మాత్రమే చేస్తే అది సంపూర్ణం కాదు. ఆ రెండిటి తాలూకు పరమోద్దేశం సర్వజనీనత. అందరితో సౌజన్యంగా ఉండడం.అయితే హోమం వేరు. హోమం అనేది పర్యావరణం కోసం చేసేది. మనకు వర్షాలు కావాలి. భూమి మీద పడే ఆ వర్షాల వల్లే వృక్షాలు పెరుగుతాయి. ఆహారం సమకూరుతుంది. అందరికీ ఆకలి తీరుతుంది. అదే హోమం ఉద్దేశం. ఆ హోమంలో కూడా మనం కృతజ్ఞతా పూర్వకంగా సమిధలు సమర్పిస్తాం. భక్తిలో కృతజ్ఞతా భావం ఉంది. ప్రేమైకభావం ఉంది.

ఏకైక లక్ష్యం అదే...

అందరిలో భగవంతుడు లేదా ఆత్మ అనేది ఉంది. మానవ జీవన ఏకైక లక్ష్యం అది ఎక్కడినుంచి వచ్చిందో... అక్కడికి తిరిగి చేరుకోవడం. ఈ ఆత్మ పరమాత్మ నుంచి విడివడిన ఒక భాగం. ఆ భాగం ఎన్నో జన్మలు ఎత్తి, అనేక కర్మలూ చేస్తుంది. చిట్టచివరికి దాని లక్ష్యం... పరిశుద్ధమై పరమాత్మను చేరుకోవడం. దాన్ని సాధించాలంటే. కరుణ కలిగి ఉండాలి, సాటి ప్రాణికోటి పట్ల కరుణ, వాత్సల్యం, మమకారం, ప్రేమ, క్షమ... ఇవన్నీ ఉండాలి. కేవలం పూజల ద్వారా అది జరగదు. రావణాసురుడూ అనేక పూజలు చేశాడు. అన్ని వేదాలూ చదివాడు. కానీ అక్కడితో ఆగిపోయాడు. వేరొకరి సొత్తును కావాలనుకున్నాడు. కాబట్టి కేవలం పూజా పునస్కారాలు, వేదవేదాంగాలు చదువుకోవడం భక్తి కాదు. దయలేని హృదయంలో దేవుడు ఉండడు. అది నా గట్టి నమ్మకం. ఈ వివేచన వచ్చిన తరువాత... నేను రెండిటినీ సమన్వయం చేసుకున్నాను. నేను నాస్తికుడిగా మారలేదు, నేను కమ్యూనిస్టునీ కాదు. అలాగని కేవలం పూజలకే పరిమితం కాలేదు.

(పారిశ్రామికవేత్తగా, 'శాంతా బయోటెక్నిక్స్' వ్యవస్థాపకునిగా సుప్రసిద్ధులైన పద్మభూషణ్ కె.ఐ.వరప్రసాదరెడ్డి సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారు.

సంభాషణ: **కృష్ణశర్మ**, ఫొటో: **రాజ్‌కుమార్**

ఆ గుణాలు ఉన్నవారందరూ దేవుళ్ళే...

నా దృష్టిలో భక్తికి అత్యున్నత స్థితి ప్రేమ. పూజలు, పునస్కారాలు అనేవి కోరికలు కోరడానికి కాదు. మనకు ఇప్పటికే ఇచ్చినవాటికి కృతజ్ఞతలు చెప్పడానికి. మనం ఊపిరి పీల్చుకుంటున్నాం. తిన్నది అరిగించుకోగలుగుతున్నాం. అనవసరమైన వ్యర్థాలను తొలగించుకోగలుగుతున్నాం. ఏ అవయవానికీ మనం ఆదేశాలు ఇవ్వడం లేదు. అవే చేసుకుంటూ పోతున్నాయి. వీటన్నిటినీ లోపల ఏదో ఒక శక్తి నడిపిస్తోంది. సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో మన ప్రమేయం లేదు. ఇంత ప్రకృతిని, ఇన్ని వనరులను ఇచ్చిన ఒక శక్తిని దేవుడు అనుకోవచ్చు, బ్రహ్మం అనుకోవచ్చు. 'నిర్గుణ శక్తి' అని కూడా కొందరు చెబుతారు. ఆ శక్తికి కృతజ్ఞత చెప్పడమే భక్తి. తల్లితండ్రులను బిడ్డలు ఎందుకు ప్రేమిస్తారు? వాళ్ళ యోగక్షేమాలు చూస్తారు కాబట్టి. అదే ప్రేమ ప్రతి మానవుడికీ దైవం పట్ల ఉండాలి. క్షమ, సహనం, ఓర్పు, ప్రేమ, వాత్సల్యం, కరుణ... ఇవన్నీ దైవీ గుణాలు. అవి ఉన్న వ్యక్తి దేవుడితో సమానం. అలాంటి వ్యక్తిత్వాలను రూపొందించుకోమనే మనకు పురాణ పురుషులను ఆదర్శంగా చూపించారు.

గీతాసారం


తామరాకు మీద నీటిబొట్టు

జీవితంతో సహా ప్రతి భౌతిక వ్యవస్థా పలు అంశాలను స్వీకరించి, అనేక ఫలితాలను వెలువరిస్తుంది. మనం మన మాటలు, చేతల ఫలితాలను నిరంతరం అంచనా వేసుకుంటూ ఉంటాం. 'ఇది మంచి, ఇది చెడు' అని నిర్ధారిస్తూ ఉంటాం. ఇతరుల ప్రవర్తన గురించి, మన చుట్టూ ఉన్న పరిస్థితుల గురించి కూడా నిర్ధారణలు చేస్తూ ఉంటాం. జీవన పరిణామక్రమంలో పొంచి ఉన్న ప్రమాదాలను, ఆటంకాలను అంచనా వేయడానికి ఈ సమర్థత ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ అటువంటి నిర్ధారణలకు ప్రమాణాలు ఉండవు. కాబట్టి వాటి కోసం అజ్ఞానంతో కూడిన ఊహలు, అభిప్రాయాలు, విశ్వాసాలు, నమ్మకాల మీద ఆధారపడతాం. మన నమ్మకానికి అనుగుణంగా ఏదైనా జరిగితే సంతోషిస్తాం.



"మనస్సును వశంలో ఉంచుకున్నవాడు, జితేంద్రియుడు, అంతఃకరణ శుద్ధి కలిగినవాడు, సర్వప్రాణులలో ఆత్మ స్వరూపుడైన ఉన్న పరమాత్మను తన ఆత్మలో నిలుపుకొన్నవాడు అయిన కర్మయోగి... కర్మలను ఆచరిస్తున్నప్పటికీ ఆ కర్మలు, వాటి ఫలితాలు అతణ్ణి అంటవు" అని 'యోగయుక్తో విశుద్ధాత్మా' అనే శ్లోకంలో శ్రీకృష్ణుడు చెప్పాడు. మన చేసే కర్మల తాలూకు కల్మషం మనకు అంటని స్థితి గురించి భగవంతుడు మనకు ఇచ్చిన హామీ ఇది.

"ద్వేషం, కోరికలు లేని వ్యక్తి... తను అందరిలోనూ, అందరూ తనలోనూ ఉన్నట్టు గ్రహించినవాడు ఏ కర్మలు చేసినా అవి కలుషితమైనవి కావు" అని కూడా శ్రీకృష్ణుడు వివరించాడు. అందరిలోనూ తననే చూసుకున్నప్పుడు... కల్మషంతో కూడిన చర్యలను, నేరాలను చేయలేరన్నది దీని అంతరార్థం. దీనికి మరో అర్థం ఏమిటంటే... ఎవరైతే 'నేను, వాళ్ళు' అనే విభజన దృష్టితో చూస్తూ కర్మలను చేస్తారో... వారి అన్ని కర్మలు కలుషితం అవుతాయి. "కర్మలన్నిటినీ భగవదర్పణం చేసి, ఆసక్తిరహితంగా కర్మలను ఆచరించేవాడికి... తామరాకు మీద నీటి బిందువులా పాపాలు అంటవు" అని 'బ్రహ్మణ్యాధాయ కర్మాణి' అనే శ్లోకంలో శ్రీకృష్ణుడు అంటాడు. అంటే ఆ వ్యక్తి రకరకాల పరిస్థితుల మధ్య జీవిస్తూ కూడా... వాటి ప్రభావానికి లోనుకాకుండా ఉండగలుగుతాడు. మన కర్మలు, ఇతరుల కర్మలు భగవంతుడికి అంకితమైనప్పుడు... విభజనకు తావే లేదు. అప్పుడు మనం ఎదుర్కొనే పరిస్థితులు నాటకాల్లా, ఆటల్లా అనిపిస్తాయి. ఇందులో మనం కేవలం మన పాత్రను పోషిస్తాం. వాటి గుణ, దోషాలతో మనకు సంబంధం లేదు. ఈ స్థితిని శ్రీకృష్ణుడు 'నీటిలో ఉంటూ... నీరు అంటని తామరాకు'తో పోల్చాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

దైవమార్గం



జగజ్జ్యోతి వెలుగులో...

"నేనే కాంతిని, ఆ కాంతి చూపే మార్గం నేనే. ఆ మార్గంలో కనిపించే సత్యాన్ని నేనే. ఆ సత్యంలో ప్రతిఫలించే ప్రేమను కూడా నేనే" అన్నాడు ఏసు క్రీస్తు. క్రీస్తు కాంతిలో దాగున్న ఔన్నత్యం అది. ఒకప్పుడు అగాథమయమైన ఈ విశ్వంలో తొలిసారిగా ప్రసరించింది వెలుగే. ఆరు రోజుల పాటు సాగిన మొత్తం సృష్టిలో, దైవవాక్కుతో పాటు జన్మించినది ఆ కాంతే.

వెలుగు దైవశక్తికి చిహ్నమైతే... చీకటి సైతానుకు సంకేతం. వెలుగంటే చీకటికి భయం. చాలా తప్పులు జరిగేది చీకటిలోనే. అజ్ఞానంతో, అవివేకంతో అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న మానవాళిని... ఆ చీకటి నుంచి విముక్తం చెయ్యడం కోసం మరియా గర్భంలో ఏసు ప్రభువు జన్మించాడు. ఆ క్షణంలో... బాల ఏసు ముఖం నుంచి బెత్లెహేమ్‌లోని పశువుల పాకను ప్రకాశవంతం చేసిన కాంతి... ఆ తరువాత జగత్తు అంతటా వ్యాపించింది. చీకట్లను పటాపంచలు చేసింది. అందుకే అది జగజ్జ్యోతి అయింది. ఆకాశంలో తోకచుక్క తొలి విజయ సంకేతంలా నిలిచింది. సామాన్య శ్రామికులైన పశువుల కాపరులకు సైతం శుభవార్తలా మెరిసింది.

"అలసి సొలసిన జనులారా! నావద్దకు రండి" అనే క్రీస్తు స్వరాన్ని ప్రపంచమంతా వింది. ఆ చల్లని పిలుపు తమకోసమేనని లోకమంతా పరవశించింది. పాపులు, వ్యభిచారులు, తప్పుడు పనులు చేసేవారు, వికలాంగులు... ఆయన చల్లని చూపుల్లో పునీతులు కానివారెవరు? సకల పీడితులు, బాధితులు ఎందరెందరో తమ జీవితాల్లో కొత్త వెలుగులను నింపుకొన్నారు. నిరక్షరాస్యులైన మామూలు వ్యక్తులను సైతం తన పన్నెండుమంది శిష్యగణంలో చేర్చుకొని... తన ప్రసంగవాణిని వినిపించిన ఔదార్యం ఏసు ప్రభువుది. మానవుల కోసం మరణాన్ని సైతం ఇష్టంగా స్వీకరించిన... కలువరిగిరిపై ఎన్నటికీ ఆరని త్యాగజ్యోతి ఆయన. ఆ జగజ్జ్యోతి వెలుగు చూపించే మార్గంలో అందరూ పయనించాలి. ఆ మార్గంలో కనిపించే సత్యాన్ని దర్శించాలి. ఆ సత్యంలో ప్రేమను కనుగొనాలి. దాన్ని తోటివారందరికీ పంచాలి.

● డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024

జెన్ కథ

విశ్వాసమే ఆలంబన

టిబెట్ జెన్ గురువైన మార్పాకి భారతదేశంతో అనుబంధం ఉంది. క్రీస్తు శకం 1012 నుంచి 1097 వరకూ జీవించిన మార్పా... భారతీయ బౌద్ధ గురువు నరోపాకు శిష్యుడు. జ్ఞానార్జన పట్ల అతనికి ఉన్న తపన... భారత్, నేపాల్ దేశాల్లో విస్తృతంగా పర్యటించేలా చేసింది. నరోపాను కలుసుకోవడానికి ముందు మార్పాకి ఒక కపట గురువు తగిలాడు. ఆ గురువు నిజమైన జ్ఞాని కాదు. కానీ అతనికి గొప్ప పేరు ప్రతిష్ఠలు ఉన్నాయి. ఎందరో శిష్యులు ఉండేవారు. ఆ కపట గురువు గురించి విన్న మార్పా అతని దగ్గరకు వెళ్ళాడు. "గురువుగారూ! ఈ క్షణం నుంచి నేను మీ శిష్యుణ్ణి. ఏం చెయ్యాలో ఆజ్ఞాపించండి" అని కోరాడు

"అయితే నిన్ను నువ్వు సంపూర్ణంగా సమర్పించుకో" అన్నాడు ఆ గురువు.

"అలాగే సమర్పించుకుంటున్నాను. తరువాత ఏం చెయ్యాలో సెలవివ్వండి" అని అడిగాడు మార్పా.

ఈ మాటలు ఇతర శిష్యులకు నచ్చలేదు. 'మార్పా మాటల్ని గురువు నమ్మితే... అతణ్ణి ప్రియశిష్యుడిగా స్వీకరిస్తాడు. ఎన్నో ఏళ్ళుగా ఉన్న తమ అందరికీ మార్పా నాయకుడవుతాడు. దీన్ని ఎలాగైనా ఆపాలి' అనుకున్నారు.

"గురువుగారూ! ఆ మార్పా చాలా ప్రమాదకరమైన వ్యక్తిలా, అబద్ధాలకోరులా, కపటిలా ఉన్నాడు. ఎన్నో ఏళ్ళ నుంచీ మీ దగ్గర శిష్యులుగా ఉన్న మేమే మీకు సంపూర్ణంగా సమర్పణ కాలేదు. ఇప్పుడు ఇతను వచ్చి "నేను మీకు సంపూర్ణంగా సమర్పించుకొన్నాను" అంటే ఎలా నమ్మాలి? ముందు ఇతణ్ణి బాగా పరీక్షించాలి. పరీక్షలో నెగ్గితే అప్పుడు అతని మాటలు నమ్మవచ్చు" అన్నారు.

"ఏం చేద్దామో, ఎలా పరీక్షిద్దామో మీరే చెప్పండి" అన్నాడు గురువు.

"ఈ కొండ మీంచి దూకమనండి" అన్నారు శిష్యులు.


"ఇదిగో దూకుతున్నాను" అంటూ దూకేశాడు మార్పా. అతను చచ్చిపోయి ఉంటాడని ఆ గురువు, శిష్యులు అనుకున్నారు. లోయలోకి దిగి చూశారు. అక్కడ పద్మాసనంలో కూర్చొని, ధ్యానం చేస్తూ కనిపించాడు మార్పా.

"ఈ అద్భుతం ఎలా జరిగింది?" అని ప్రశ్నించాడు గురువు.

"నాకేం తెలుసు? ఇది మీ ఘనతే" అన్నాడు మార్పా.

"ఇది యాదృచ్ఛికంగా జరిగి ఉండొచ్చు. మరోసారి పరీక్షించాలి" అన్నారు శిష్యులు. మార్పాను మండుతున్న ఒక ఇంట్లోకి వెళ్ళమన్నారు. అతను ఎలాంటి జంకూ లేకుండా ఆ ఇంట్లో ప్రవేశించాడు. మంటలన్నీ పూర్తిగా ఆరిపోయాక... వాళ్ళు లోపలికి వెళ్ళి చూశారు. ఎటు చూసినా మాడి మసైపోయిన వస్తువులు కనిపించాయి. కానీ ఒక గదిలో మార్పా చెక్కుచెదరకుండా, ప్రశాంతంగా ధ్యానం చేస్తూ కనబడ్డాడు. ఆ శిష్యుల ఆశ్చర్యానికి అంతులేదు. మార్పాకు మరో పరీక్ష పెట్టాలని వాళ్ళు పట్టుపట్టారు. నదీ ప్రవాహం మీద మార్పాను నడిచి వెళ్ళమన్నారు. క్షణం ఆలస్యం చెయ్యకుండా నదిపై నడవడం ప్రారంభించి, నది మధ్యకు వెళ్ళాడు మార్పా.

ఇది చూసిన గురువు 'నాలో నిజంగానే ఏదో మహిమ ఉన్నట్టుందే! నా శిష్యుడే నా మీద విశ్వాసం ఉంచి నదిలో నడవగలిగినప్పుడు... నేనెందుకు నడవలేను?' అనుకొని... నదిలోకి వెళ్ళి మునిగిపోయాడు.



'ఒక గురువు సరైన వాడు కానప్పటికీ... అతణ్ణి విశ్వసిస్తే ఇలాంటి అద్భుతాలు జరుగుతాయా?' అనే సందేహం రావచ్చు. ఒక వ్యక్తికి జబ్బు చేస్తుంది అతడు ఒక బాబాను కలుస్తాడు. ఆ బాబా ఇంత విభూతి ఇచ్చి నోట్లో వేసుకోమంటాడు. ఆ వ్యక్తి అలా వేసుకుంటే... జబ్బు నయం అవుతుంది. అలాగే ఏదో పుణ్య క్షేత్రానికి వెళితే జబ్బు తగ్గుతుందని ఎవరో చెబుతారు. అది జరుగుతుంది. ఇది కేవలం ఆ బాబా వల్లో, క్షేత్రం వల్లనో కాదనీ... వాటిపై రోగికి ఏర్పడిన విశ్వాసం అతనిలో రోగనిరోధక శక్తిని పెంచడమే దానికి కారణమనీ పెద్దలు చెబుతారు. విశ్వాసం, భక్తి, ప్రేమ వల్ల మనలో అంతర్గతమైన మార్పులు జరిగి... మేలు జరుగుతుందనే అభిప్రాయమూ ఉంది. ఆ విధంగా... అద్భుతాలు జరగడానికి విశ్వాసమే ఆలంబన అవుతుంది.

- రాచమడుగు శ్రీనివాసులు

సందేశం

దైవ ప్రసన్నత కోసం...

దైవ ప్రసన్నతను పొందే ఎన్నో మార్గాలను విశ్వాసులకు మహా ప్రవక్త మహమ్మద్ బోధించారు. నిత్య జీవితాలలో మానవులు మంచి పనులు ఆచరించడం ద్వారా మాత్రమే అల్లాహ్‌కు ప్రీతిపాత్రులవుతారని చెప్పేవారు.



ఒకరోజు ఆయనను ఒక వ్యక్తి కలిసి "మహా ప్రవక్తా! మనిషి ఆచరించే పనులన్నిటిలో దేవుడికి ఎక్కువ ఇష్టమైన ఆచరణ ఏది?" అని ప్రశ్నించాడు.

దానికి మహా ప్రవక్త బదులిస్తూ "నమాజ్ చేయడం దైవానికి అత్యంత ప్రీతిపాత్రమైన విషయం" అని చెప్పారు.

"నమాజ్ తరువాత దైవం ఎక్కువగా ఇష్టపడేది ఏవిటి?"

"తల్లితండ్రులకు సేవ చేయడం. వారికి ఏ కష్టం, బాధ కలుగకుండా చూసుకోవడం."

"ఆ తరువాత... ఏ కార్యాచరణ దేవుడికి ప్రీతి కలిగిస్తుంది?" అని అడిగాడు ఆ వ్యక్తి.

"దేవుని మార్గంలో పాటుపడడం" అని చెప్పారు మహా ప్రవక్త.

దైవ ప్రసన్నత పొందడం ఇస్లాంలో విశ్వాసుల అత్యున్నత లక్ష్యం. ఆ లక్ష్యసాధనకోసం క్రమబద్ధమైన జీవనాన్ని అలవరచుకోవాలి. నిత్యం క్రమం తప్పకుండా నిర్దేశిత సమయాల్లో నమాజ్ చేయాలి. జన్మను ఇచ్చిన తల్లితండ్రులు దైవసమానులు. వృద్ధాప్యంలో వారిని ఆప్యాయంగా చూసుకోవాలి. దైవం, ప్రవక్తలు చూపిన బాటలో పయనిస్తూ... తోటివారి ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదపడాలి. ఇవన్నీ దేవునికి ఇష్టమైన విషయాలు. వీటిని ఆచరించేవారిపై అల్లాహ్ కారుణ్యాన్ని వర్షిస్తాడు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శుక్రవారం • 5 జనవరి 2024
cinema@andhrajyothy.com

చీరకట్టులో సంప్రదాయబద్ధంగా



నాగార్జున 'నా సామిరంగ' సినిమాపై ప్రేక్షకుల్లో పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. 1980ల్లో జరిగే కథ కావడం, నాగార్జునకు తోడుగా యువహీరోలు అల్లరి నరేశ్, రాజ్‌తరుణ్ నటించడం ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయనే చెప్పాలి. విజయ్ బిన్ని దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం జనవరి 14న సంక్రాంతికి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులో 'మంగ'గా కీలక పాత్ర పోషిస్తున్న మిర్నా మీనన్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని చిత్రం బృందం విడుదల చేసింది. సంప్రదాయబద్ధంగా చీరకట్టులో ఉన్న మిర్నా మీనన్ స్టిల్ యువతరం మెచ్చేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు, మాస్, యాక్షన్ ఇలా అన్ని రకాల ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని, సంక్రాంతికి సరైన సినిమా ఇదని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఆశికా రంగనాథ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి రచన: ప్రసన్న కుమార్ బెజవాడ, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కెమెరా: శివేంద్ర దాశరథి.

అబ్బురపరిచే చందమామకథలా విశ్వంభర



చిరంజీవి సినిమా అంటే విందుభోజనంలా ఉండాలి. పిల్లల దగ్గర్నుంచి పెద్దలదాకా అందరికీ నచ్చేలా ఉండాలి. పాటలు, డాన్సులు, ఫైట్లు, కథ, కథనం, కామెడీ అన్నీ ఓ రేంజ్‌లో ఉండాలి. మొత్తంగా ఓ చందమామకథలా ఉండాలి. చిరంజీవిని జగదేకవీరుడిగా చూపిస్తేనే జనం ఇష్టపడతారు. అప్పుడే అది పూర్తిస్థాయి చిరంజీవి సినిమా. దర్శకుడు వశిష్ఠ ఈ విషయాన్ని పూర్తిగా అవగతం చేసుకొని తయారు చేసుకున్న కథే 'విశ్వంభర'. అబ్బురపరిచే చందమామకథలా ఈ సినిమా ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. సోషియో ఫాంటసీ కథాంశంతో ఈ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. యముడికి మొగుడు, జగదేకవీరుడు-అతిలోకసుందరి, అంజి గతంలో చిరంజీవి చేసిన ఫాంటసీ చిత్రాలు. వాటిని మించే స్థాయిలో, ఊహించని మలుపులతో ఊహకందని కేరక్టరైజేషన్స్‌తో మరోలోకంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉండనుందని సమాచారం. అందుకే అత్యుత్తమ సాంకేతిక నిపుణులు ఈ సినిమాకు పనిచేస్తున్నారు. సునీల్ ప్రత్యేకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా ఎంపికయ్యారు. కథానుగుణంగా ఇంకొందరు కథానాయికలు ఈ సినిమాకు అవసరం. వారి వివరాలు త్వరలో తెలుస్తాయి. ఇందులో విలన్‌గా ప్రముఖ బాలీవుడ్ నటుడు నటించనున్నాడు. సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్న విషయం తెలిసిందే.

డిప్యూటీ సీఎం భట్టితో చిరంజీవి భేటీ



సినీ నటుడు చిరంజీవి గురువారం డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ ప్రజాభవన్‌కు వెళ్లి, భట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. కశ్మీర్ నుంచి తెప్పించిన శాలువాతో భట్టిని సత్కరించారు. చిరంజీవి దంపతులకు డిప్యూటీ సీఎం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఫిబ్రవరి బరిలోకి ఈగల్



రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఈగల్' చిత్రం విడుదల తేదీ మారింది. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు గతంలో యూనిట్ ప్రకటించింది. అయితే ఈ సంక్రాంతికి రెండు మూడు రోజుల వ్యవధిలోనే అరడజనుకు పైగా పెద్ద హీరోల చిత్రాలు విడుదలవుతుండడంతో కొన్ని సినిమాలకు థియేటర్ల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో గురువారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సంయుక్త సమావేశం నిర్వహించాయి. ఒకేసారి ఎక్కువ సినిమాల విడుదల వల్ల నష్టపోయే అవకాశం ఉండడంతో



దీనిని నివారించేందుకు ఆయా చిత్రాల నిర్మాతలతో చర్చించాయి. నిర్మాత దిల్‌రాజు నేతృత్వంలో సాగిన చర్చలు ఫలించి 'ఈగల్' చిత్రం రిలీజ్‌ను వాయిదా వేసేందుకు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల అంగీకరించారు. తమ చిత్రానికి కొత్త రిలీజ్ డేట్‌ను ఖరారు చేశారు. ఫిబ్రవరి 9న 'ఈగల్'ను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ 'ఈగల్ సినిమా విడుదల వాయిదాకు అంగీకరించిన నిర్మాతలకు ధన్యవాదాలు. ఇదొక మంచి పరిణామం. మేమంతా కలసి తీసుకున్న నిర్ణయం ఇది'న్నారు. దీంతో సంక్రాంతి బరిలో నిలిచే సినిమాలపై స్పష్టత వచ్చింది. జనవరి 12న మహేశ్‌బాబు 'గుంటూరు కారం', తేజ సజ్జ 'హను-మాన్', 13న వెంకటేశ్ 'సైంధవ్', 14న నాగార్జున 'నా సామిరంగ' చిత్రాల విడుదల ఖాయమైనట్లే.

చిన్నతనంలోనే మార్ఫింగ్‌కి గురయ్యా..



యువతరం ఎక్కువగా ఇష్టపడే హీరోయిన్లలో జాన్వీకపూర్ ముందు వరుసలో ఉంటారు. ఎక్కువగా వార్తల్లో నిలిచే కథానాయికల లిస్ట్‌లో కూడా జాన్వీ ఒకరని చెప్పొచ్చు. ఇటీవల డీప్ ఫేక్ వీడియోలు హీరోయిన్లనే కాక సగటు స్త్రీలను కూడా భయపెడుతున్న తరుణంలో వాటి గురించి రీసెంట్‌గా స్పందించి చర్చనీయాంశమయ్యారు జాన్వీ. 'ఇలాంటి అంశాల గురించి నేను పెద్దగా స్పందించను. ఎందుకంటే నేనేం మాట్లాడినా నా పుట్టుపూర్వోత్తరాల గురించి మాట్లాడటం, అవాకులు చవాకులు రాసేయడం చాలామందికి అలవాటైపోయింది. అందుకే సాధ్యమైనంత వరకూ ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ వచ్చాను. కానీ.. రష్మిక ఈ వీడియోలకు గురి అవ్వడం.. దానిపై ఆమె స్పందించిన తీరు, ఆ పోరాడిన విధానం నిజంగా అభినందనీయం. ఈ విషయంలో ఆమెను అభినందించకుండా ఉండలేను. నేను చిన్నతనంలోనే ఈ తరహా మార్ఫింగ్ వీడియోలకు గురయ్యాను. నా 15 ఏటే నా ఫేస్‌ని మార్ఫింగ్ చేసి వీడియోలను విడుదల చేశారు. అది చిన్న వయసు, పైగా వాటి ప్రభావం తెలీదు. అందుకే పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు ఇవి మరీ ఎక్కువైపోయాయి. ఈ విషయంలో స్త్రీలు అప్రమత్తంగా ఉండాలి' అంటూ స్పందించారు జాన్వి. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ తారక్ 'దేవర'తో తెలుగుతెరపై సాక్షాత్కరించనున్న విషయం తెలిసిందే.

ఫిబ్రవరిలో ఆట మొదలు



గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 2న విడుదలచేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గీతానంద్ ఈ చిత్రంతో హీరోగా మరో మెట్టు ఎక్కుతాడనే నమ్మకం ఉంది. నేహా సోలంకి తన అభినయంతో ఆకట్టుకుంటుంది. దయానంద్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. విభిన్నమైన కథతో తెరకెక్కిన మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పాత్రలన్నీ గ్రే షేడ్‌లో ఉంటాయి. తన జీవితాన్ని చాలించాలనుకున్న ఓ వ్యక్తి రియల్‌టైమ్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు, ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయనేది ఆసక్తికరంగా ఉంటుంద'న్నారు. మధుబాల కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి అభిషేక్ ఏ ఆర్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: అరవింద విశ్వనాథన్.

చల్లగాలి ప్రేమగీతం



ప్రణవ్, షజ్ఞ శ్రీ హీరో హీరోయిన్లుగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల'. భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత. ఇటీవలే విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కటి ఆదరణ దక్కింది. గురువారం చిత్రబృందం రెండో గీతాన్ని విడుదల చేసింది. 'చల్లగాలి' అంటూ సాగే రొమాంటిక్ గీతాన్ని యూనిట్ గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'పీరియాడిక్ నేపథ్యంలో కథ సాగుతుంది. పుంగనూరు గ్రామంలో జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. తక్కువ బడ్జెట్‌లోనే మంచి సినిమాను తీశాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. వినూత్నమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోందని నిర్మాత తెలిపారు. ప్రేక్షకులను రెండు దశాబ్దాలు వెనక్కు తీసుకెళ్లేలా ఈ సినిమా ఉంటుంది అని ప్రణవ్ చెప్పారు.

బబ్బర్‌షేర్‌గా సల్మాన్?



సల్మాన్‌ఖాన్, కబీర్‌ఖాన్ మళ్లీ కలవనున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో భజరంగీ భాయ్‌జాన్, ఏక్తాటైగర్, ట్యూబ్‌లైట్ చిత్రాలు రూపొందాయి. వీటిలో మొదటిరెండూ బ్లాక్‌బాస్టర్స్ కాగా, 'ట్యూబ్‌లైట్' మాత్రం ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. త్వరలో మళ్లీ సల్మాన్‌ని డైరెక్ట్ చేయనున్నారు కబీర్‌ఖాన్. ఈ కథకు 'బబ్బర్‌షేర్' అని టైటిల్‌ని కూడా ఫిక్స్ చేశారాయన. ఈ కథ గురించి బాలీవుడ్‌లో ప్రస్తుతం చర్చ నడుస్తోంది. ఊహకందని కథాకథనాలతో ఈ స్క్రిప్ట్‌ని కబీర్ రెడీ చేశారని సమాచారం. దాంతో చాలామంది హీరోలు ఈ ప్రాజెక్ట్‌ని సొంతం చేసుకోడానికి ప్రయత్నాలు చేశారని వినికిడి. అయితే.. కబీర్‌ఖాన్ మాత్రం తన మనసులో ఆ కథకు వేరొకర్ని కథానాయకుడిగా ఊహించలేకపోతున్నారట. అందుకే.. ఎవరు ఎంత ప్రయత్నించినా తను మాత్రం సల్మాన్ కోసమే వెయిట్ చేశారట. గత ఏడాది అగస్ట్, సెప్టెంబర్ నెలల్లో ఈ సినిమాకు సంబంధించిన చర్చలు సల్మాన్, కబీర్‌ల మధ్య జరిగాయని వినికిడి. ఈ నెల చివరికల్లా బౌండెడ్ స్క్రిప్ట్‌తో సల్మాన్‌ని ఆయన కలవనున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

సినిమా స్థాయికి తగిన సంఖ్యలో థియేటర్లు ఇవ్వాలి

తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. కె. నిరంజన్‌రెడ్డి నిర్మాత. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి సినిమా విశేషాలను విలేకరులతో పంచుకున్నారు.



కె. నిరంజన్ రెడ్డి

● 'హను-మాన్' నిర్మాతగా నాకు తొలి చిత్రం. భారీ స్థాయిలో రూపుదిద్దుకోవడం, సంక్రాంతికి విడుదలవుతుండడం ఆనందాన్నిచ్చాయి. హాలీవుడ్‌లో సూపర్‌హీరో ఫ్రాంచైజీలో చాలా చిత్రాలు వచ్చాయి. అలాంటి ఫ్రాంచైజీ మనకు కూడా ఒకటి ఉండాలని ఈ సినిమా చేశాం. ఆంజనేయస్వామిని మన సంస్కృతిలో సూపర్‌హీరో అనుకోవచ్చు. సినిమా చూసిన ప్రేక్షకులంతా హనుమంతుడిని దర్శించుకున్న అనుభూతికి లోనవుతారు.

● ఈ సినిమా కోసం మేం మూడేళ్లు కష్టపడ్డాం. ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన వచ్చింది. దాంతో కంటెంట్‌కు కావాల్సినవన్నీ ఎక్కడా రాజీపడకుండా సమకూర్చాం. ముందు అనుకున్న బడ్జెట్ కన్నా ఐదు రెట్లు ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. 'హను-మాన్' వీఎఫ్ఎక్స్ క్వాలిటీ అద్భుతంగా ఉంది. ఖర్చు చేసిన ప్రతి రూపాయికి తగిన ప్రతిఫలం తెరపై కనిపిస్తుంది. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా సినిమా స్థాయి పెరుగుతూ వచ్చింది. దానికి తగ్గట్లే సినిమాకు దేశ, విదేశాల్లో మంచి బిజినెస్ జరిగింది.

● సంక్రాంతికి ఎన్ని సినిమాలు బరిలో ఉన్నా 'హను-మాన్' విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. చాలా లాంగ్ రన్ ఉన్న చిత్రమిది. అందుకే ముందుగా ఎక్కువ థియేటర్లలో చేయాలని తొందరపడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 20 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగింది. హిందీలో 200 స్క్రీన్లలో రిలీజ్ చేస్తున్నాం. సంక్రాంతికి ఎక్కువ సినిమాలు విడుదలవుతున్నాయి. దాన్ని దృష్టిలో ఉంచుకొని మా సినిమా స్థాయికి తగిన సంఖ్యలో థియేటర్లు ఇవ్వాలని పరిశ్రమ పెద్దలను కోరుతున్నాం. 'హను-మాన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చిరంజీవి గారు అతిథిగా వస్తున్నారు. బిజీ షెడ్యూల్‌లోనూ వెసులుబాటు చేసుకొని రవితేజ గారు కోటి అనే పాత్రకు వాయిస్ ఓవర్ ఇచ్చారు. వారికి ధన్యవాదాలు. మా బేనర్‌లో చేయబోయే కొత్త చిత్రాలను ఫిబ్రవరిలో ప్రకటిస్తాం.

ప్రేమకథకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు



కిశోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమకథ'. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మాతలు. శివశక్తి రెడ్ డీ దర్శకుడు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమకథ' చిత్ర నేపథ్యం నిజ జీవిత సంఘటనలకు దగ్గరగా ఉంటుంది. ప్రేక్షకులు కథాంశంతో కనెక్ట్ అవుతారు' అన్నారు. 'నటీనటులు అంతా కష్టపడి మంచి సినిమా చేశారు. మధుర శ్రీధర్, ధీరజ్, శింగనమల కల్యాణ్ సాయం చేశారు. ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని నిర్మాతలు కోరారు. మా సినిమాలో ఇద్దరు అందమైన హీరోయిన్లు ఉన్నారు, వారి నటన ఆకట్టుకుంటుందని కిశోర్ చెప్పారు. 'ప్రేమకథ' చిత్రం ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని దియా తెలిపారు.

జాలరి జీవిత పోరాటం



మత్స్యకారుల జీవితం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రేవు'. వంశీ రామ్, స్వాతీ భీమ్ రెడ్డి జంటగా నటించారు. ఎల్బీ శ్రీరామ్ అతిథి పాత్ర పోషించారు. సముద్రంలోని మత్స్యసంపదపై ఆధిపత్యం కోసం జరిగే పోరాటం నేపథ్యంలో దర్శకుడు హరినాథ్ పులిచర్ల తెరకెక్కించారు. ఏ. ఆర్ ఫిలిం టీమ్, విజయా టాకీస్ సంయుక్తంగా నిర్మించాయి. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం టీజర్, పోస్టర్‌ను సీనియర్ నటుడు మురళీమోహన్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హరినాథ్ రియలిస్టిక్ అప్రోచ్‌తో ఈ చిత్రం తీశాడు. మంచి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'రేవు' చిత్రం ఫస్ట్ కాపీ సిద్ధమైంది. ఫిబ్రవరిలో విడుదల చేస్తాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు.

వజ్రం లాంటి పింకీ

సుమన్, శుభలేఖ సుధాకర్, రవి అట్లూరి ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'పింకీ'. కిరణ్, మౌర్యాణి జంటగా నటించారు. సీరపు రవికుమార్ దర్శకత్వంలో పసుపులేటి వెంకట రమణ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాత సన్నాహాలు చేస్తు



న్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'రవికుమార్ చెప్పిన కథ నచ్చి 'పింకీ' చిత్రాన్ని నిర్మించాను. దర్శకుడు అన్నీ తానై ఈ చిత్రాన్ని రూపొందించాడు' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది నా తొలి చిత్రం. మా నిర్మాత ఖర్చుకు వెనుకాడకుండా నిర్మించారు. డైమండ్ కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో 'పింకీ' కథ సాగుతుంది. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్' అని తెలిపారు. దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు అని కిరణ్ చెప్పారు.

ఎలా ఆడకూడదో చూపించారా?


ట్రోఫీతో కెప్టెన్లు రోహిత్-ఎల్గర్

అత్యంత వేగంగా ముగిసిన మ్యాచ్‌గా కేప్‌టౌన్ టెస్ట్ సరికొత్త రికార్డు సృష్టించింది. పేసర్లు రాజ్యమేలిన మ్యాచ్‌లో.. వికెట్లు టపటపా నేలరాలాయి. బ్యాటర్లు ఆడిన తీరుచూస్తే.. టెస్టుల్లో ఎలా ఆడకూడదో చూపించారనిపిస్తోంది. మ్యాచ్‌లో 33 వికెట్లు కూలినా ఒక్క ఎల్బీ కూడా లేదంటే.. పిచ్‌లోని అదనపు బౌన్సే పెద్ద బ్రహ్మపదార్థమన్న విషయం అవగతమవుతోంది. ఇలాంటి వికెట్‌పై పాతుకు పోవాలంటే టెక్నికల్‌గా బలంగా ఉండడంతోపాటు క్రీజులో సహనం ప్రదర్శించాలి. అలాంటి ఆట టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లీలో మినహా.. ఏ ఒక్కరిలోనూ కనిపించ లేదు. విరాట్ కళాత్మక ఆటను ప్రదర్శించగా.. వైట్‌బాల్ క్రికెట్‌కు అలవాటుపడిన మిగతా వారు దూకుడుగా ఆడే క్రమంలో వికెట్లు పారేసుకొన్నారు. ఎక్కువగా బౌన్స్ అయ్యే బంతులను వదిలేసిన కోహ్లీ.. కొంచెం షార్ట్ పిచ్ అయినా షాట్లు ఆడాడు. పటిష్ట డిఫెన్స్‌తోపాటు అతడు కొట్టిన కొన్ని కవర్ డ్రైవ్‌లు ముచ్చటగొలిపాయి. కానీ, ఎవరూ కూడా అతడి ఆటను గమనించి.. ఆ విధంగా బ్యాటింగ్ చేయడానికి ప్రయత్నించకపోవడం బాధాకరం. రైజ్ అవుతున్న బంతిని ఎలా డిఫెన్స్ ఆడాలో తెలియక జైస్వాల్ అవుటయ్యాడు. శరీర బరువును వెనుక కాలి మీదకు వేగంగా మార్చకపోవడమనే బలహీనత గిల్ బ్యాటింగ్‌లో మరోసారి బహిర్గతమైంది. ఈ మ్యాచ్‌లో యువ ఆటగాళ్లు కనీసం డిఫెన్స్ ఆడే ప్రయత్నం కూడా చేయలేదు. ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్ ఆడాలంటే నేటి తరం క్రికెటర్లు ఆటతోపాటు మైండ్‌సెట్‌ను కూడా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. (ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

{ 'సెంచూరియన్ ఓటమితో మా లోపాలను సరిదిద్దుకున్నాం. ముఖ్యంగా బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచాం. అలాగే బ్యాటింగ్‌కు కష్టంగా మారిన పిచ్‌పై ఆధిక్యాన్నీ సాధించగలిగాం. సిరాజ్, బుమ్రా ఉత్తమ బౌలింగ్‌తో జట్టుకు గెలుపు నందించారు. అలాగే దక్షిణాఫ్రికాలో ఆడడం ఎప్పుడూ సవాల్‌గానే ఉంటుంది' }

- రోహిత్ శర్మ

రోజున్నరే..



పేసర్ల దన్నుతో భారత్ ఘనవిజయం

సఫారీల ఖేల్ ఖతం

దక్షిణాఫ్రికా గడ్డపై టీమిండియా అద్వితీయ ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ ఓటమికి ప్రతీకారంగా.. సఫారీల బాక్సులు బద్దలయ్యే రీతిలో అత్యంత వేగంగా టెస్టును ముగించింది. ఇక తొలి రోజు తరహాలోనే రెండో రోజూ వికెట్ల జాతర కొనసాగింది. ఈసారి బూమ్ బూమ్ బుమ్రా నిప్పులు చెరగడంతో ఆతిథ్య బ్యాటర్లు చకచకా పెవిలియన్‌కు చేరారు. దీంతో కేవలం 79 పరుగుల లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ ఛేదించిన రోహిత్ సేన కేప్‌టౌన్‌లో తొలిసారి విజయగర్వంతో సంబరాలు చేసుకుంది. అయితే ఇంతటి క్లిష్టమైన పిచ్‌పై ఓపెనర్ మార్‌క్రమ్ వీరోచిత శతకంతో అబ్బురపరచడం విశేషం.

1 కేప్‌టౌన్‌లో టెస్టు గెలిచిన తొలి ఆసియా జట్టుగా భారత్. దక్షిణాఫ్రికాపై ఎక్కువసార్లు (3) ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా శ్రీనాథ్‌తో సమంగా నిలిచిన బుమ్రా.

2 ఆసియాకు అవల ఎక్కువసార్లు 5 వికెట్లు సాధించిన బౌలర్లలో చంద్రశేఖర్, కుంబ్లే, ఇషాంత్‌లతో కలిపి బుమ్రా (8 సార్లు) రెండో స్థానంలో ఉన్నాడు. కపిల్ (9 సార్లు) టాప్‌లో కొనసాగుతున్నాడు.

3 సఫారీ నేలపై అత్యధిక టెస్టు వికెట్లు (38) తీసిన మూడో భారత బౌలర్‌గా బుమ్రా. అనిల్ కుంబ్లే (45), శ్రీనాథ్ (43) ముందున్నారు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 55; భారత్ తొలి ఇన్నింగ్స్: 153; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 106; ఎల్గర్ (సి) కోహ్లీ (బి) ముకేష్ 12; జోర్జి (సి) రాహుల్ (బి) ముకేష్ 1; స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1; బెడింగమ్ (సి) రాహుల్ (బి) బుమ్రా 11; వెరీనె (సి) సిరాజ్ (బి) బుమ్రా 9; జాన్సెన్ (సి అండ్ బి) బుమ్రా 11; కేశవ్ (సి) శ్రేయాస్ (బి) బుమ్రా 3; రబాడ (సి) రోహిత్ (బి) ప్రసిద్ధ్ 2; బర్గర్ (నాటౌట్) 6; ఎన్‌గిడి (సి) జైస్వాల్ (బి) బుమ్రా 8; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 36.5 ఓవర్లలో 176 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-37, 2-41, 3-45, 4-66, 5-85, 6-103, 7-111, 8-162, 9-162, 10-176. **బౌలింగ్:** బుమ్రా 13.5-0-61-6; సిరాజ్ 9-3-31-1; ముకేష్ 10-2-56-2; ప్రసిద్ధ్ 4-1-27-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్టబ్స్ (బి) బర్గర్ 28; రోహిత్ (నాటౌట్) 16; గిల్ (బి) రబాడ 10; విరాట్ (సి) వెరీనె (బి) జాన్సెన్ 12; శ్రేయాస్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 10 ; మొత్తం: 12 ఓవర్లలో 80/3. వికెట్ల పతనం:** 1-44, 2-57, 3-75; **బౌలింగ్:** రబాడ 6-0-33-1; బర్గర్ 4-0-29-1; జాన్సెన్ 2-0-15-1.

- ఈసారి బుమ్రాకు ఆరు వికెట్లు
- మార్‌క్రమ్ అద్భుత శతకం వృథా
- 1-1తో సిరీస్ సమం
- దక్షిణాఫ్రికాతో ఆఖరి టెస్టు


బుమ్రా 13.5-0-61-6

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనను భారత జట్టు అదరగొట్టే రీతిలో ముగించింది. పూర్తిగా పేసర్లు రాజ్యమేలిన ఈ సంచలన రెండో టెస్టులో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించడంతోపాటు, సిరీస్‌ను 1-1తో సమం చేసింది. కేవలం ఐదు సెషన్లలోపే మ్యాచ్ ముగియడం విశేషం. తొలి టెస్టులో భారత్.. ఇన్నింగ్స్ 32 రన్స్ తేడాతో ఓడిన విషయం తెలిసిందే. రెండో రోజు గురువారం పేసర్ బుమ్రా ఆరు వికెట్లతో చెలరేగి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించాడు. దీంతో ఆతిథ్య జట్టు 36.5 ఓవర్లలో 176 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మార్‌క్రమ్ (103 బంతుల్లో 17 ఫోర్లు, 2 సిక్సర్లతో 106) కెరీర్‌లోనే చిరస్మరణీయ శతకం సాధించగా.. మిగిలిన బ్యాటర్లలో ఎల్గర్ (12)ది మాత్రమే అత్యధిక స్కోరు. అనంతరం ఛేదనలో భారత్ 12 ఓవర్లలో 3 వికెట్లకు 80 పరుగులు సాధించి గెలిచింది. జైస్వాల్ (28), రోహిత్ (16 నాటౌట్) రాణించారు. రబాడ, బర్గర్, జాన్సెన్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 55, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 153 పరుగులు సాధించాయి. సిరాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కగా.. కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడిన ఎల్గర్-బుమ్రా సంయుక్తంగా ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచారు.

అటు బుమ్రా, ఇటు మార్‌క్రమ్: 62/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు తొలి సెషన్‌లోనే విగతా ఏడు వికెట్లను కోల్పోయింది. పేసర్ బుమ్రా ఫుల్లర్, లెంగ్త్, షార్ట్ పిచ్ బంతులతో వణికిస్తూ కేవలం ఎనిమిది ఓవర్లలోనే నలుగురిని పెవిలియన్‌కు చేర్చాడు. ఆట ఆరంభం కాగానే బెడింగమ్ వికెట్ తీసిన బుమ్రా మరే బ్యాటర్‌ను కూడా కుదురుకోనీయలేదు. వరుసగా వికెట్లు తీస్తూ వెళ్లడంతో జట్టు 111/7 స్కోరుతో నిలిచింది. కానీ మరో ఎండ్‌లో మార్‌క్రమ్ మాత్రం ఏ బౌలర్‌నూ వదలకుండా చెలరేగాడు. ఎప్పుడో ముగియాల్సిన ఆట అతడి బ్యాటింగ్ కారణంగానే 78 పరుగుల ఆధిక్యం వరకు వెళ్లింది. వాస్తవానికి మార్‌క్రమ్ 73 పరుగుల వద్దే అవుట్ కావాల్సి ఉన్నా కీపర్ రాహుల్ క్యాచ్ అందుకోలేకపోయాడు. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రసిద్ధ్ ఓవర్‌లో 4,6,6,4తో 20 రన్స్ రాబట్టాడు. ఆ వెంటనే బుమ్రా ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో 99 బంతుల్లోనే సూపర్ సెంచరీని పూర్తి చేశాడు. ఈ దశలో కెప్టెన్ రోహిత్ బంతిని సిరాజ్‌కు ఇచ్చి ఫలితం సాధించాడు. 32వ ఓవర్‌లో ఆఫ్ స్టంప్ వైపు వేసిన లెంగ్త్ బాల్‌ను మార్‌క్రమ్ పుల్ షాట్ ఆడాడు. అయితే బ్యాట్ ఎడ్జ్ తీసుకుని బంతి గాల్లోకి లేవగా లాంగాఫ్‌లో రోహిత్ సులువైన క్యాచ్ తీసుకున్నాడు. దీంతో భారత్ ఎదురుచూపులు ఫలించాయి. ఆ తర్వాత రబాడ (2)ను ప్రసిద్ధ్, ఎన్‌గిడిని బుమ్రా అవుట్ చేయంతో సఫారీల పోరాటం ముగిసింది.


మార్‌క్రమ్ (106)

జైస్వాల్ జోరు: ఛేదించాల్సింది స్వల్ప స్కోరే అయినా.. భారత్ రెండో ఇన్నింగ్స్ ధాటిగా సాగింది. ఉన్నది కాసేపే అయినా ఓపెనర్ జైస్వాల్ టీ20 ఆటతీరుతో చెలరేగాడు. తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు బాదగా మొత్తంగా 23 బంతుల్లో 6 ఫోర్లతో 28 రన్స్ సాధించి ఆరో ఓవర్‌లో వెనుదిరిగాడు. అప్పటికే జట్టు 44 రన్స్ సాధించింది. గిల్ (10)ను రబాడ బౌల్డ్ చేశాడు. పదో ఓవర్‌లో రోహిత్, కోహ్లీ (12) చెరో ఫోర్ సాధించారు. రోహిత్ క్యాచ్‌ను జోర్జి వదిలేయగా.. విజయానికి నాలుగు పరుగుల దూరంలో కోహ్లీ వెనుదిరిగాడు. అయితే శ్రేయాస్ (4 నాటౌట్) చక్కటి ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

టెస్టు చరిత్రలో తొలిసారి

ఒకటిన్నర రోజుల్లోనే 33 వికెట్లు నేలకూలడంతో మొత్తంగా రెండో టెస్టు కేవలం 106.2 ఓవర్లలోనే ముగిసింది. అదీ కేవలం ఐదు సెషన్లలోనే కావడం మరో విశేషం. ఇక 642 బంతుల్లోనే టెస్టులో ఫలితం రావడం 147 ఏళ్ల టెస్టు చరిత్రలో ఇదే ప్రథమం. గతంలో 656 బంతుల్లో ఆసీస్-దక్షిణాఫ్రికా టెస్టు, 672 బంతుల్లో విండీస్-ఇంగ్లండ్ టెస్టు, 788 బంతుల్లో ఇంగ్లండ్-ఆసీస్ టెస్టు, 792 బంతుల్లో ఇంగ్లండ్-ఆసీస్ టెస్టుల ఫలితాలు వచ్చాయి.

మన ప్రదర్శన మెరుగయ్యేనా?

రా. 7.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో..

ఆసీస్ మహిళలతో నేడు తొలి టీ20


మంధాన

నవీ ముంబై: మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌లో భారత్-ఆస్ట్రేలియా తలపడబోతున్నాయి. సొంత గడ్డపై ఆడుతున్నా భారత బ్యాటర్లు స్థాయికి తగ్గట్టు రాణించకపోవడం ఆందోళనకరం. దూకుడుగా ఆడడంలో బ్యాటర్లు తడబాటుకు లోనవుతుండగా..కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫామ్‌లేమి తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు భారత్‌కు పూర్తి భిన్నమైన రీతిలో ఆసీస్ అన్ని విభాగాల్లో అద్భుతంగా ఆడుతోంది.

• అరుణకు రజతం

భువనేశ్వర్: సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి అరుణారెడ్డి రజతం సాధించింది. అరుణ 11.867 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ప్రణతి దాస్ (రైల్వేస్) స్వర్ణం నెగ్గగా.. శతాక్షి (మహారాష్ట్ర) కాంస్యం దక్కించుకొంది.

• ప్రణవి హాఫ్ సెంచరీ

హైదరాబాద్ గెలుపు

న్యూఢిల్లీ: ప్రణవి చంద్ర (88 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో.. సీనియర్ మహిళల వన్డే ట్రోఫీలో హైదరాబాద్ బోణీ చేసింది. గ్రూప్-డిలో గురువారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ 50 ఓవర్లలో 225/9 స్కోరు చేసింది. ధారా గుజ్జర్ 5 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో బెంగాల్ 49.3 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది.

• ఆస్ట్రేలియా 116/2


సిడ్నీ: ఆస్ట్రేలియా-పాకిస్థాన్ మధ్య మూడో టెస్ట్ రెండో రోజు ఆటకు వర్షం, వెలుతురు లేమి అడ్డంకిగా నిలిచాయి. దాంతో గురువారం 46 ఓవర్ల ఆటే సాధ్యమైంది. ఓవర్‌నైట్ 6/0 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్‌జట్టు ఆట ఆపివేసే సరికి రెండు వికెట్లకు 116 పరుగులు చేసింది. ఖవాజా (47), వార్నర్ (34) అవుటయ్యారు. పాకిస్థాన్ మొదటి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

నేటినుంచి రంజీ ట్రోఫీ

న్యూఢిల్లీ: దేశవాళీ టోర్నీ రంజీట్రోఫీకి రంగం సిద్ధమైంది. రెండు నెలలకు పైగా జరిగే ఈ టోర్నమెంట్‌కు శుక్రవారం తెరలేవనుంది. ఎలిట్, ప్లేట్ విభాగాలుగా జరిగే ఈ టోర్నీలో 38 జట్లు తలపడనున్నాయి. 35 ఏళ్ల వెటరన్లు రహానె, పుజార భారీ స్కోర్లు చేయడం ద్వారా సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాలని భావిస్తున్నారు. కాగా.. విశాఖలో బెంగాల్‌తో ఆంధ్ర, దిమాపూర్‌లో నాగాలాండ్‌తో హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ల్లో తలపడతాయి.

స్టంపింగ్ రివ్యూ.. ఇక ఇలా

నిబంధనల్ని సవరించిన ఐసీసీ



దుబాయ్: స్టంపింగ్ నిబంధన దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేలా ఐసీసీ కీలక నిర్ణయం తీసుకొంది. ఇప్పటివరకు వికెట్ కీపర్ స్టంపౌట్‌కు అప్పీలు చేస్తే..ఫీల్డ్ అంపైర్ దాన్ని థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేసేవాడు. థర్డ్ అంపైర్ తొలుత బ్యాటర్ క్యాచ్ అవుట్ అయ్యాడేమో పరిశీలించి, ఆ తర్వాత స్టంపౌట్‌ను కూడా చూసేవాడు. ఇక నుంచి అలా జరగదు. కొత్త నిబంధన ప్రకారం..వికెట్ కీపర్ స్టంపౌట్‌కు అప్పీలు చేస్తే థర్డ్ అంపైర్ కేవలం ఆ విజువల్స్‌ను మాత్రమే పరిశీలిస్తాడు. క్యాచ్ ద్వారా అవుట య్యాడా లేదా అన్న విషయాన్ని చూడడు. ఒకవేళ క్యాచౌట్‌కు అప్పీలు చేయాలనుకొంటే ఫీల్డింగ్ టీమ్ ప్రత్యేకంగా డీఆర్ఎస్‌ను కోరాల్సి ఉంటుంది. గతనెల 12నుంచే ఈ నిబంధన అమల్లోకి వచ్చింది.

బిజినెస్

వివో నుంచి ప్రీమియం ఫోన్ ఎక్స్ 100



న్యూఢిల్లీ: స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ వివో మార్కెట్లోకి ప్రీమియం విభాగంలో వివో ఎక్స్ 100 సిరీస్ హ్యాండ్‌సెట్లు విడుదల చేసింది. వీటి ధర రూ.63,999 నుంచి ప్రారంభమవుతుంది. ప్రీమియం ఫోన్ల విభాగంలో తమ స్థానం పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో వీటిని మార్కెట్లోకి తెచ్చినట్టు వివో ప్రకటించింది. కస్టమర్లకు అద్భుతమైన ఫొటోగ్రఫీ అనుభూతిని కలిగించాలన్న తమ ప్రయత్నానికి ఈ ఎక్స్ సిరీస్ ఫోన్లు ఆలంబనగా నిలుస్తాయని కంపెనీ ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్ హెడ్ వికాస్ తగ్రా తెలిపారు. టెలిఫొటో సన్‌షాట్ ఫీచర్ వీటి ప్రత్యేకత. ఈ ఫీచర్ కారణంగా సూర్యోదయం, సూర్యాస్తమయాలను ఇది అద్భుతంగా ఫొటో తీయగలుగుతుంది. వీటిలో ఎక్స్ 100 ప్రో హ్యాండ్‌సెట్ (16 జీబీ+512 జీబీ) ధర రూ.89,999 కాగా 12 జీబీ+256 జీబీ సామర్థ్యం గల ఎక్స్ 100 వేరియెంట్ ధర రూ.63,999. 16జీబీ+512 జీబీ సామర్థ్యం గల ఎక్స్ 100 వేరియెంట్ ధర రూ.69,999.

సరికొత్తగా.. బజాజ్ చేతక్

2 వేరియంట్లలో లభ్యం

ప్రారంభ ధర 1.15 లక్షలు



న్యూఢిల్లీ: దేశీయ వాహన కంపెనీ బజాజ్ ఆటో.. అప్‌డేటెడ్ చేతక్‌ను గురువారం మార్కెట్లోకి విడుదల చేసింది. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే స్క్రీన్‌తో కూడిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ రెండు (అర్బన్, ప్రీమియం) వేరియంట్లలో లభించనుంది. వీటి ధరలను రూ.1,15,001, రూ.1,35,463గా నిర్ణయించారు. ఇవి ఢిల్లీ ఎక్స్‌షోరూం ధరలు. 3.2 కిలోవాట్ బ్యాటరీతో కూడిన ఈ స్కూటర్.. పూర్తి చార్జింగ్‌తో 127 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. అంతేకాదు, గంటకు 73 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో దూసుకుపోతుందని కంపెనీ వెల్లడించింది. కాగా ఈ స్కూటర్ కొనుగోలుదారులకు కంపెనీ టెక్‌ప్యాక్‌ను ఆప్షనల్‌గా అందుబాటులోకి తెచ్చింది. టెక్‌ప్యాక్ ద్వారా టర్న్ బై టర్న్ నావిగేషన్, మ్యూజిక్, కాల్ కంట్రోల్స్, హిల్ హోల్డ్ మోడ్ వంటి ఫీచర్లను వినియోగించుకునే వీలుంటుంది. అంతేకాదు, సెల్ఫ్ క్యాన్సెలింగ్ టర్న్ ఇండికేటర్స్, ఎలక్ట్రానిక్ హ్యాండిల్ అండ్ స్టీరింగ్ లాక్స్, సీట్ స్విచెస్, హెల్మెట్ బాక్స్ ల్యాంప్, రివర్స్ గేర్ మోడ్ వంటి ఫీచర్లు కూడా ఈ స్కూటర్లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. బజాజ్ ఆటో ఇప్పటివరకు లక్షకు పైగా ఎలక్ట్రిక్ చేతక్‌లను మార్కెట్లో విక్రయించింది.

కోలుకుంటున్న కొలువుల మార్కెట్

ఈ ఏడాది 8.3% పెరగనున్న నియామకాలు



న్యూఢిల్లీ: జాబ్స్ మార్కెట్ గాడిన పడుతోంది. గత ఏడాది ఐదు శాతం తగ్గిన నియామకాలు ఈ సంవత్సరం 8.3 శాతం పెరగనున్నాయి. ఆన్‌లైన్ జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండ్‌ఇట్ జరిపిన వార్షిక సర్వేలో ఈ విషయం తేలింది. గత ఏడాది డిసెంబరులో నియామకాలు అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే రెండు శాతం పెరిగాయి. ఇది సానుకూల అంశమని.. ఈ ఏడాది ఉద్యోగ మార్కెట్ బాగుంటుందనేందుకు సంకేతమని తెలిపింది.

ఈ రంగాల్లో ఎక్కువ అవకాశాలు

తయారీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), ఆటోమోటివ్, రిటైల్, ట్రావెల్ అండ్ టూరిజం రంగాల్లో ఈ సంవత్సరం నియామకాల జోరు ఎక్కువగా ఉంటుందని ఫౌండ్‌ఇట్ సర్వే తెలిపింది. బీఎఫ్ఎస్ఐ విభాగంలో ఫైనాన్షియల్ అనాలిసిస్, రిస్క్ మేనేజ్‌మెంట్, కంప్లయెన్స్ రంగాల్లో నైపుణ్యాలు ఉన్న నిపుణులకు మంచి అవకాశాలు ఉన్నట్టు పేర్కొంది. ఐటీ రంగానికి వస్తే కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీల్లో నైపుణ్యాలు ఉన్న వారికి ఈ సంవత్సరం కూడా తిరుగుండదని పేర్కొంది.

కలిసొచ్చే అంశాలు

ఏఐ కోసం చేస్తున్న పెట్టుబడులు, వృద్ధి రేటు కొనసాగించేందుకు కంపెనీలు అనుసరిస్తున్న విధానాలు, వ్యూహాత్మక మార్గదర్శకత్వం ఈ సంవత్సరం నియామకాలు పెంచనుంది. వీటికి తోడు కంపెనీలు సంప్రదాయ వ్యాపార విధానాలకు తోడు పర్యావరణ పరిరక్షణ విధానాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీంతో ఈ రంగంలో నైపుణ్యాలు ఉన్న వారికీ ఉద్యోగ అవకాశాలు పెరగనున్నాయి. ఈ రంగాల్లో తగిన నైపుణ్యాలు ఉన్న నిపుణులు చాలినంత మంది లభించకపోతే, మంచి నైపుణ్యాలు ఉన్న నిపుణులను పార్ట్ టైమర్స్‌గా నియమించుకునేందుకూ కంపెనీలు వెనుకాడక పోవచ్చని తెలిపింది.

గత ఏడాది ట్రెండ్స్ ఎలా ఉన్నాయంటే..

2022తో పోలిస్తే 2023లో నియామకాలు తగ్గినా కొన్ని రంగాల్లో మాత్రం నియామకాలు పెరిగాయి. మారిటైమ్, షిప్పింగ్ రంగంలో 28%, రిటైల్, ట్రావెల్ అండ్ టూరిజం రంగాల్లో 25% నియామకాలు పెరిగాయి. డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్ పుణ్యమాని అడ్వర్‌టైజింగ్, మార్కెట్ రీసెర్చ్, పబ్లిక్ రిలేషన్స్ రంగంలోనూ నియామకాలు 18% పెరిగాయి. ఎన్‌జీఓలు, సోషల్ సర్వీస్ రంగాల్లోనూ 2022తో పోలిస్తే 2023లో నియామకాలు 12% జోరందుకున్నాయి.

ఐటీ రంగంలో ఢమాల్: అయితే అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించే ఐటీ, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో గత ఏడాది నియామకాలు 18% పడిపోయాయి. అమెరికా, యూరోపియన్ దేశాల్లో నెలకొన్న ఆర్థిక అనిశ్చితితో ఐటీ కంపెనీలు ముందు జాగ్రత్త పడటం, తగిన నైపుణ్యాలు ఉన్న నిపుణులు పెద్దగా దొరక్కపోవడం ఇందుకు ప్రధానకారణం. హెల్త్‌కేర్, ఫార్మా, బయోటెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ, తయారీ రంగాల్లోనూ గత ఏడాది నియామకాలు 8% నుంచి 12% తగ్గాయి.

రూ.3.24 లక్షల కోట్ల లాభం

- భారీగా పెరిగిన మార్కెట్ సంపద
- రెండ్రోజుల తర్వాత లాభాల్లోకి సూచీలు
- 491 పాయింట్లు బలపడిన సెన్సెక్స్

ముంబై: గత రెండు రోజులు నష్టాలు చవిచూసిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు గురువారం మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. రియల్టీ, పవర్, ఆర్థిక సేవల రంగ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. సెన్సెక్స్ 490.97 పాయింట్లు పెరిగి 71,847.57 వద్దకు చేరుకుంది. ఒక దశలో సూచీ 598 పాయింట్ల మేర ఎగబాకి 71,955 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, 141.25 పాయింట్ల లాభంతో 21,658.60 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 18 లాభపడ్డాయి. కాగా, ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.3.24 లక్షల కోట్లు పెరిగి రూ.368.33 లక్షల కోట్లకు చేరుకుంది.

జ్యోతి సీఎన్‌సీ ఐపీఓ ధర శ్రేణి రూ.315-331: గుజరాత్‌కు చెందిన జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఈ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధర శ్రేణిని కంపెనీ రూ.315-331గా నిర్ణయించింది. ఈ ఏడాదిలో ఐపీఓకు వస్తున్న తొలి కంపెనీ ఇదే.

ఒక్కరోజే వెండి రూ.1,900 డౌన్

రికార్డు గరిష్ఠాలకు చేరువైన బంగారం, వెండి మళ్లీ దిగివచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం రూ.420 తగ్గి రూ.63,550కి పరిమితమైంది. కిలో వెండి ఏకంగా రూ.1,900 తగ్గి రూ.76,900 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి రేట్లు తగ్గడమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,042 డాలర్లు, సిల్వర్ 23.05 డాలర్లకు తగ్గాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,380 ▼	58,100 ▼	78,000 ▼
ముంబై	62,774 ▼	57,501 ▼	71,779 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ

హైదరాబాద్	582

5 జనవరి

చిత్తూరు	608
గోదావరి	585
విజయవాడ	585
విశాఖపట్నం	625
వరంగల్	584

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85
వరంగల్	85
కరీంనగర్	85
మహబూబ్‌నగర్	85
కర్నూలు	85
విశాఖపట్నం	84
గోదావరి	89
విజయవాడ	89
గుంటూరు	85
ఒంగోలు	85
చిత్తూరు	85

సెబీ ఈడీగా తెలుగు వ్యక్తి జీఆర్ఎం రావు



న్యూఢిల్లీ: మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా గోవిందాయపల్లి రామ్మోహన్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మూడు సంవత్సరాల కాలానికి ఈడీగా సెబీ నియమించింది. ఆయన అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ ఫ్రాడ్ ఎగ్జామినర్స్ (ఏసీఎఫ్ఈ) నుంచి సర్టిఫైడ్ ఫ్రాడ్ ఎగ్జామినర్ సర్టిఫికెట్ కలిగి ఉన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇంజనీరింగ్, ఎంబీఏ డిగ్రీ పట్టాను అందుకున్న రామ్మోహన్ రావు.. ముంబై విశ్వవిద్యాలయంలో లా డిగ్రీని కూడా పూర్తి చేశారు. కాగా ఈడీ హోదాలో సెబీలో దర్యాప్తు, అంతర్గత తనిఖీ విభాగాలను ఆయన పర్యవేక్షిస్తారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులు కావడానికి ముందు ఆయన సెబీ ఈస్టర్న్ రీజినల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆ హోదాలో ఆయన తనిఖీలు, ఇన్వెస్టర్ సర్వీస్ కేంద్రాల ఏర్పాటు, ఇన్వెస్టర్ చైతన్యం, ఫిర్యాదుల పరిష్కారం వంటి విభిన్న శాఖలను నిర్వహించారు.

విమాన ప్రయాణికులకు స్వల్ప ఊరట

- ఎయిర్ టికెట్లపై ఇంధన చార్జీని ఉపసంహరించుకున్న ఇండిగో
- రూ.300 నుంచి రూ.1,000 వరకు తగ్గనున్న టికెట్ రేట్లు

IndiGo

న్యూఢిల్లీ: ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న ఇంధన చార్జీని ఉపసంహరించుకుంటున్నట్టు దేశీయ విమానయాన సంస్థ ఇండిగో గురువారం ప్రకటించింది. దీంతో కొన్ని దూర ప్రాంత ప్రయాణ మార్గాల్లో విమాన చార్జీలు రూ.1,000 వరకు తగ్గనున్నాయి. 61.8 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో దేశంలో అతిపెద్ద ఎయిర్‌లైన్స్‌గా కొనసాగుతోంది. విమాన ఇంధనం (ఏవియేషనల్ టర్బైన్ ఫ్యూయల్-ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో గత ఏడాది అక్టోబరు 6 నుంచి ఇండిగో దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లపై అదనంగా ఇంధన చార్జీ కూడా వసూలు చేయడం ప్రారంభించింది. ప్రయాణ దూరాన్ని బట్టి ఈ చార్జీని రూ.300 నుంచి రూ.1,000 వరకు వసూలు చేస్తూ వచ్చింది.

అయితే, ఈ నెల ఒకటి నుంచి కేంద్రం ఏటీఎఫ్ ధరలను కాస్త తగ్గించింది. ఈ నేపథ్యంలో ఇంధన చార్జీని ఉపసంహరించుకుంటున్నట్టు, ఈ నెల 4 (గురువారం) నుంచి ఇది అమల్లోకి వస్తుందని ఇండిగో వెల్లడించింది. కాగా, విమాన చార్జీలను నిర్ణయించే విషయంలో స్వీయ నియంత్రణ పాటించడంతో పాటు ప్రయాణికుల ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గత నెలలో ఎయిర్‌లైన్స్‌కు సూచించింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు రూ.800 కోట్ల నిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రుణాల రూపంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ దాదాపు రూ.800 కోట్లు సమీకరించింది. అన్ సెక్యూర్డ్, లిస్టెడ్, నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల రూపంలో ఈ నిధులను సమీకరించింది. కంపెనీ జారీ చేసిన నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లలో స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, సింగపూర్ రూ.400 కోట్లు, క్రెడిట్ సొల్యూషన్ ఇండియా ట్రస్ట్ రూ.300 కోట్లు, ఆదిత్య బిర్లా స్పెషల్ రూ.100 కోట్లు పెట్టుబడులు పెట్టినట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ బాండ్లపై కూపన్ రేటు 13.275% ఉంది. ఈ నిధులు కలిపితే.. నవంబరు నుంచి ఇప్పటి వరకూ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, జీఎంఆర్ గోవా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, జీఎంఆర్ విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్స్ సంయుక్తంగా రూ.8,400 కోట్లు సమీకరించినట్లవుతుంది.

రూ.40 కోట్లతో హైదరాబాద్‌లో రెయిన్‌బో కొత్త ఆసుపత్రి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ హైదరాబాద్‌లో మరో ఆసుపత్రిని ప్రారంభించింది. రూ.40 కోట్ల ఏర్పాటు చేసిన కొత్త ఆసుపత్రిలో 60 పడకలు ఉంటాయని, దీంతో రెయిన్‌బో, దాని అనుబంధ కంపెనీల మొత్తం పడకల సామర్థ్యం 1,715 పడకల స్థాయికి చేరుతుందని కంపెనీ వెల్లడించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులతో హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఈ కొత్త ఆసుపత్రిని ప్రారంభించారు. ఇది హైదరాబాద్‌లో రెయిన్‌బోకు 8వ ఆసుపత్రి. కాగా వచ్చే ఐదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఎన్‌సీఆర్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లోని ద్వితీయ శ్రేణి నగరాల్లో మొత్తం 1,000 పడకలను అదనంగా సమకూర్చుకోవాలని రెయిన్‌బో భావిస్తోంది.

ఆర్మూర్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

» పదవి కోల్పోయిన పండిత్ వినీత

ఆర్మూర్‌టౌన్, జనవరి 4 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం గురువారం నెగ్గింది. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకడంతో వినీత తన పదవిని కోల్పోయారు. ఆర్మూర్ మునిసిపాలిటీలో మొత్తం 36మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే, అవిశ్వాస తీర్మానంపై మునిసిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం నిర్వహించిన సమావేశానికి 20మంది బీఆర్ఎస్, నలుగురు బీజేపీ కౌన్సిలర్లతోపాటు ఎక్స్ ఆఫీషియో సభ్యుడి హోదాలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానానికి సరిపడా కోరం సభ్యులు హాజరుకావడంతో తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్‌లో పాల్గొన్న వారంతా అవిశ్వాసానికి మద్దతు పలికారు. చైర్‌పర్సన్ వర్గీయులు ఈ సమావేశానికి హాజరుకాలేదు. అవిశ్వాస తీర్మాన ప్రతిని అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నారు. నూతన చైర్మన్ ఎన్నికపై త్వరలోనే ప్రకటన రానుంది. అవిశ్వాస తీర్మానం నెగ్గిన వెంటనే కౌన్సిలర్లు బస్సులో క్యాంపునకు బయలుదేరి వెళ్లిపోయారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికిన బీజేపీ.. చైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్‌కు సహకరిస్తుందా లేదా చూడాల్సి ఉంది.

బీఆర్ఎస్ నేతలు.. దోపిడీ దొంగలు: పొన్నం



ఎల్కతుర్తి/హైదరాబాద్(ఆంధ్రజ్యోతి), జనవరి 4: బీఆర్ఎస్ నేతలు తెలంగాణ ఖజానాను దోపిడీ దొంగల్లా దోచుకున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 390 డెకాయిట్(దోపిడీదారుల) సెక్షన్‌కు బీఆర్ఎస్ నాయకులందరూ అర్హులేనని విమర్శించారు. న్యాయవాదిగా చట్టాల గురించి తెలిసి తాను మాట్లాడుతున్నానని, కానీ బీఆర్ఎస్ నాయకులకు చట్టాలు, రాజ్యాంగం గురించి తెలియదని విమర్శించారు. పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు అమలుచేయని బీఆర్ఎస్ నాయకులు.. ఏర్పాటై నెల రోజులు కూడా పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆయన దుయ్యబట్టారు. నెల రోజుల్లోనే ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశామని చెప్పారు. మిగతా వాటి కోసం ప్రతీ గ్రామంలో ప్రజా పాలన గ్రామసభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పొన్నం తెలిపారు. కాగా, రాష్ట్రంలోని లాండ్రీ, దోబీఘాట్, హెయిర్ సెలూన్‌లకు అందించే ఉచిత విద్యుత్ పథకాన్ని నిలిపివేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యుత్ శాఖను కోరారు. ఈ పథకం కింద డిస్కంలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఫార్మా సిటీని ఏర్పాటు చేయబోం: కోదండరెడ్డి

యాచారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో ఎట్టి పరిస్థితుల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయబోమని, ప్రతిపాదిత భూముల్లో కాలుష్యరహిత పరిశ్రమలు, ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి అన్నారు. గురువారం యాచారంలోని తన నివాసంలో కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, నిర్వాసిత రైతుల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫార్మాసిటీని ప్రభుత్వం రద్దు చేయడంలేదని, దానిని వేరే ప్రాంతానికి తరలించి మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద, కందుకూరు, కడ్తాల మండలాల పరిధి గ్రామాల్లో సేకరించిన భూముల్లో కాలుష్యరహిత పరిశ్రమలు, మెగా టౌన్‌షిప్, కాలేజీల స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఫార్మాసిటీ రద్దు అంశంపై బీజేపీకి అవగాహనే లేదని విమర్శించారు.

కేసీఆర్ 420.. కేటీఆర్ మోసగాడు: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గిరిజనులను. దళితులను బీఆర్ఎస్ మోసం చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. అందుకే నంబర్ వన్ 420 కేసీఆర్ అని, కేటీఆర్ మోసగాడు అని వ్యాఖ్యానించారు. దళితుడిని సీఎం చేస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. నెల రోజుల్లోనే హామీలను అమలు చేయలేదని కాంగ్రెస్ 420 అని కేటీఆర్ వ్యాఖ్యానించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను ఒకసారి నెమరువేసుకోవాలని కేటీఆర్‌కు సూచించారు.

బీఆర్ఎస్‌ను వీడిన ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్

» మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

ఆదిలాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత కొంత కాలంగా అడ్డి భోజారెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారం జోరుగా సాగింది. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అడ్డిభోజారెడ్డి పార్టీని వీడడంతో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందంటున్నారు. అడ్డి భోజారెడ్డి డీసీసీబీ చైర్మన్ పదవీ కాలం మరో 13 నెలలు మిగిలి ఉండడంతో.. మళ్లీ పదవి కాలాన్ని పొడగించుకునేందుకే కాంగ్రెస్‌లో చేరాడన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కేసీఆర్ హయాంలో అన్యాయం జరిగింది

» సమస్యలు పరిష్కరించాలని భట్టికి ఉద్యోగుల వినతి

నల్లకుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గెజిటెడ్, మున్సిపల్ ఉద్యోగులు తొమ్మిదేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కరించాలని ఆయా ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం గెజిటెడ్, మున్సిపల్ ఉద్యోగులపై అక్రమ కేసులు బనాయించి తీవ్ర అన్యాయానికి గురిచేసిందని వారు ఆరోపించారు. తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాస్‌రావు, పరమేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.తాజ్‌మహల్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అవలంబించిన వైఖరి, తదితర అంశాలపై భట్టివిక్రమార్కకు వివరించారు.

బీఆర్ఎస్ గుర్తింపు రద్దు చేయాలి: టీపీసీసీ

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ గుర్తుపై 420 అని ముద్రించి బుక్‌లెట్‌ను విడుదల చేసిన బీఆర్ఎస్ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు పంపిన లేఖలో కోరారు. రాజకీయాల్లో విలువలు కాపాడలేని ఇలాంటి పార్టీలను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. అలాగే, కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని కామాటిపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయంగా కాంగ్రెస్‌ను విమర్శిస్తే బాధ లేదని, విమర్శలకు ప్రతివిమర్శలు చేసే దమ్ము కాంగ్రెస్‌కు ఉందని అన్నారు. కాగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి విమర్శించారు. రేవంత్‌రెడ్డి అక్రమంగా సంపాదించారని నిందించడం సిగ్గుచేటని అన్నారు.

కేసీఆర్ నివాసం వద్ద మహిళ హల్‌చల్

బంజారాహిల్స్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం వద్ద గురువారం ఓ మహిళ హల్‌చల్ చేసింది. తనకు కేసీఆర్ అన్యాయం చేశారంటూ హంగామా సృష్టించింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 14లోని కేసీఆర్ నివాసానికి గురువారం ఏపీ ముఖ్యమంత్రి జగన్ రాక నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఎల్‌బీనగర్‌కు చెందిన వెంకటమ్మ అనే మహిళ అక్కడకు వచ్చి.. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు తనకు ఏమి చేయలేదంటూ హల్‌చల్ చేసింది. తన భర్త పక్షవాతంతో మంచాన పడ్డాడని, కేసీఆర్ ప్రభుత్వం కనీసం వైద్యం కూడా చేయించలేదని ఆరోపించింది. కేసీఆర్‌కు ఓటు వేసి గెలిపించామని, అయినా ఎప్పుడూ అందుబాటులో లేరని, ఎర్రవల్లికి వెళ్లినా, బంజారాహిల్స్‌కు వచ్చినా కేసీఆర్‌ను కలవనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఖమ్మం నుంచి సోనియా!

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత కూడా కాంగ్రెస్ నేతలు బలంగా తీసుకువెళ్లగలిగారు. ఈ నేపథ్యంలోనే సోనియా బ్రాండ్‌ను లోక్‌సభ ఎన్నికల్లోనూ గట్టిగా ఉపయోగించాలన్న చర్చ రాష్ట్ర పార్టీలో వచ్చింది. అందులో భాగంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే సోనియా రాష్ట్రం నుంచి పోటీ చేయాలని కోరుతూ తీర్మానం చేసి అధిష్ఠానానికి పంపారు. తాజాగా బుధవారం జరిగిన టీపీసీసీ సమావేశంలోనూ ఈ అంశంపై మరోసారి చర్చ జరిగింది. అందులో భాగంగానే సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేయాలని మరోసారి తీర్మానం చేశారు. రెండోసారి తీర్మానం తర్వాత సోనియా కార్యాలయం నుంచి రాష్ట్ర నేతలకు సానుకూల సందేశం అందినట్లు తెలిసింది. రాష్ట్రం నుంచి పోటీ చేయడానికి ఆమె అంగీకరించారని, అందుకు తగ్గట్టుగా కార్యాచరణను రూపొందించాలని సూచించారని సమాచారం. ఢిల్లీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో సోనియా పోటీకి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర నేతలు దృష్టి సారించారు.

రాష్ట్రంలో పాతుకుపోయేందుకు

సోనియాగాంధీ పోటీ చేయడానికి రాష్ట్రంలోని పలు లోక్‌సభ స్థానాలను పరిశీలించినప్పటికీ చివరకు ఖమ్మం నుంచి రంగంలోకి దించాలనే నిర్ణయానికి వచ్చారు. ఖమ్మం ఎంపికలో పలు అంశాలు పనిచేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ఇక్కడ కాంగ్రెస్ చాలాబలంగా ఉంది. నియోజవర్గ గత ఎన్నికల చరిత్రను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకున్నారు. కొత్త రాష్ట్రంలో అధికారంలో పాతుకుపోయేందుకు ఉద్దేశించిన బలమైన రాజకీయ వ్యూహంలో భాగంగానే రాష్ట్ర పార్టీ నేతలు సోనియాగాంధీని ఇక్కడ రంగంలో దించాలనే పట్టుదలను ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో పదేళ్ల విరామం తర్వాత కాంగ్రెస్ సాధారణ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మరింత సుస్థిరంగా ఉండాలంటే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలవాలి. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలున్నాయి. అందులో 12కు పైగా గెలిస్తే గత నెల రాష్ట్రంలో బొటాబొటి మెజారిటీతో అధికారానికి వచ్చిన పార్టీ మరింత దూకుడుగా పాలనను సాగించగలదు. అన్ని రకాల ఒత్తిడులు తట్టుకొని తన ఎజెండాను అమలు చేయగలదు. తమ కష్టానికి సోనియాగాంధీ లాంటి అగ్రనేతలు పోటీ చేయడం తోడైనపుడు మాత్రమే ఇలాంటి విజయాలు సాధించగలమని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఖమ్మం నుంచి సోనియా పోటీ చేయడానికి సంబంధించిన నామినేషన్ పత్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు దాఖలు చేస్తారని సమాచారం. ఎన్నికల సమయంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి, ఆ సభకు సోనియాగాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు.

ఢిల్లీకి దగ్గరి దారి

ఒకప్పుడు ఢిల్లీకి యూపీ దగ్గరి దారి అనే వారు. యూపీలో కాంగ్రెస్ నామమాత్రం అయినప్పటికీ 2004లో 145 సీట్లు సాధించి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనుభవంతో కాంగ్రెస్ దక్షిణాదిని ఢిల్లీకి దగ్గరి దారిగా భావిస్తోంది. కేంద్రంలో హంగ్ ఏర్పడితే బీజేపీయేతర సంకీర్ణానికి నేతృత్వం వహించగల సంఖ్యలో సీట్లు సాధించడం తెలంగాణ, కర్ణాటకల్లో భారీ విజయాల వల్లే సాధ్యమవుతుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. అందుకే, తెలంగాణలో సోనియా గాంధీ పోటీ చేయడం ద్వారా తెలంగాణలో మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల వంటి దక్షిణాది రాష్ట్రాల్లో కూడా విజయాలను ప్రభావితం చేయగలరని ఆశిస్తున్నారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కలిపి 109 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకల్లో కలిపి 45 స్థానాలున్నాయి. తెలంగాణలో సోనియాగాంధీ పోటీ చేయడం ద్వారా ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మూడ్ తీసుకురావచ్చని, దాంతో ముస్లిం, ఇతర సెక్యులర్ శక్తులను చీలకుండా కాంగ్రెస్ వైపు మొగ్గేట్లు చేయవచ్చని, తద్వారా రెండు రాష్ట్రాల్లో అత్యధిక సీట్లు గెలిచి, కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వస్తే లీడ్ చేయగల స్థాయిలో లోక్‌సభ స్థానాలను సాధించవచ్చని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



దక్షిణాది నుంచి రెండోసారి!

సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తే ఆమె దక్షిణాది నుంచి పోటీ చేయడం ఇది రెండోసారి అవుతుంది. గతంలో 1999లో కర్ణాటకలోని బళ్లారి నుంచి సోనియాగాంధీ పోటీచేసి బీజేపీ నేత సుష్మా స్వరాజ్‌పై విజయం సాధించారు. తర్వాత మళ్లీ పాతికేళ్లకు సోనియా దక్షిణాదిలో భాగమైన ఖమ్మం నుంచి పోటీ చేయడానికి సిద్ధం అవుతున్నారు. ఇందిరాగాంధీ కూడా గతంలో కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి పోటీ చేశారు. 1978లో కర్ణాటకలోని చిక్‌మగళూరు నుంచి పోటీ చేసి గెలిచారు. తర్వాత 1980లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలోని మెదక్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

కేసీఆర్ పాలనలో 'రెవెన్యూ' చిన్నాభిన్నం

» క్రమబద్ధీకరణ పేరుతో వీఆర్ఏలకు టోపీ

» సమస్యల పరిష్కారానికి రేవంత్ చర్యలు

» వీఆర్ఏ జేఏసీ సమావేశంలో కోదండరాం

హైదరాబాద్/పంజాగుట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రెవెన్యూ వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. భూ రికార్డుల అప్‌డేషన్ అని మొదలుపెట్టి, అది పూర్తి కాకముందే, వాటిలో తప్పులు సరిచేయకముందే డిజిటలైజ్ చేశారన్నారు. దీంతో రికార్డులు గందరగోళంగా మారిపోయాయన్నారు. గురువారం సోమాజీగూడలో వీఆర్ఏ జేఏసీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వీసు క్రమబద్ధీకరణ పేరుతో వీఆర్ఏలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. భూ రికార్డులను సరిచేయడానికి గ్రామస్థాయిలోనే పటిష్ఠమైన యంత్రాంగం ఉండాలని, దాన్ని కాపాడుకోవాల్సిన సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందన్నారు. వీఆర్వోలను, వీఆర్ఏలను ఇష్టానుసారంగా ఇతర శాఖల్లోకి పంపించిందని, వీఆర్వోలు సర్వీసు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొందరికి జీతాలు కూడా సరిగా రావడం లేదన్నారు. 15,600 మంది వీఆర్ఏలను స్థానికత సూత్రాన్ని పాటించకుండా దూర ప్రాంతాలకు బదిలీ చేసిందన్నారు. వీరి సమస్యలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుర్తించిందని, వీఆర్ఏలకు ఐడీ నంబర్లు కేటాయించి, జీతాలివ్వాలని ఆదేశించిందన్నారు. 'ధరణి' సమస్యలను పరిష్కరించే పనిని కూడా ప్రారంభించిందన్నారు. గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని, వీఆర్ఏలకు స్థానికతకు తగ్గట్టు పోస్టింగులు ఇవ్వాలని కోరారు. రాండమైజేషన్‌లో భాగంగా 61 మంది రికార్డు అసిస్టెంట్లను ఏ శాఖకు కేటాయించలేదని, వారి సమస్యను పరిష్కరించాలన్నారు. 61 సంవత్సరాలు దాటిన వీఆర్ఏల వారసులకు అర్హతల ఆధారంగా ఉద్యోగాలివ్వాలని కోరారు. 2014 తర్వాత చనిపోయిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు లేక 20 వేల వీఆర్ఏల కుటుంబాలు ఇబ్బంది పడుతున్న పరిస్థితిని ఒకటో తేదీన ముఖ్యమంత్రిని కలిసి వివరించగా మూడో తేదీనే సమస్యను పరిష్కరించారన్నారు. ఉద్యోగులందరికీ ఐదో తేదీలోపు జీతాలు ఇవ్వాలని ఆదేశించారన్నారు. వీఆర్ఏల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రికి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి జేఏసీ కృతజ్ఞతలు తెలిపింది. సమావేశంలో వివిధ సంఘాల నేతలు రామకృష్ణ, రాములు, రమేష్ పాక, పూల్ సత్యనారాయణ, శివకుమార్ పాల్గొన్నారు.

420లు ఎవరో తెలిసే ప్రజలు ఓడించారు

గడీల పాలన వద్దనే కాంగ్రెస్‌ను గెలిపించారు.. ఓటమి పాలైనా వారి అహంకారం తగ్గలేదు

ప్రభుత్వం ఏర్పడి 35 రోజులు కాకుండానే అక్కసు.. బీఆర్ఎస్‌పై శ్రీధర్‌బాబు, సీతక్క ధ్వజం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 420 ఎవరో.. డబుల్ 420 ఎవరో ప్రజలకు తెలుసని, అందుకే ఎన్నికల్లో ఓడించారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు విమర్శించారు. ప్రజలు ఓటమి రుచి చూపించినా బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ అదే అహంకార రీతిలో మాట్లాడుతున్నారని చెప్పారు. వచ్చే లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలిచే అవకాశం లేదని, దీంతో పార్టీ కనుమరుగైయ్యే ప్రమాదం ఉందనే, తమపై నీచమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో మంత్రి సీతక్కతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్పు కావాలని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీల అమలు మొదలు పెట్టామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేస్తే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం ఖర్చును రూ.10 లక్షలకు పెంచి ప్రతి పేద కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చామని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ఇప్పటి వరకు 6 కోట్ల మంది వినియోగించుకున్నారని చెప్పారు. 3500 రోజులు పాలించిన వాళ్లు.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 35 రోజులు కూడా కాకుండానే అక్కసు వెళ్లగక్కి తమ ఓర్వలేని తనాన్ని బయటపెట్టుకున్నారని శ్రీధర్ బాబు విమర్శించారు. ప్రజలకి ఇచ్చిన వాగ్దానాలను ఒకటి తర్వాత ఒకటి పూర్తి చేస్తూ వస్తున్నామన్నారు. ప్రజాపాలన ఎలా ఉంటుందో ప్రజలంతా కళ్లారా చూస్తూనే ఉన్నారని చెప్పారు. ప్రజా దర్బార్ పెడితే వేలాది మంది వచ్చి విజ్ఞప్తులు చేస్తున్నారని, బీఆర్ఎస్ పాలనలో ఒక్కసారైనా ప్రజలను కలిసారా..? వాళ్ల గోస విన్నారా? అని శ్రీధర్‌బాబు నిలదీశారు. గత రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, విభజన హామీల కోసం కేంద్రంపై పోరాడలేదని ఆయన విమర్శించారు. అధికారం పోయిందనే అక్కసు బీఆర్ఎస్ నేతల్లో కన్పిస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గడీలా పాలన కాదు.. గల్లీ బిడ్డల పాలన కావాలనే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని చెప్పారు. ప్రమాణ స్వీకారం చేసిన రోజే రెండు పథకాలు అమలు చేశామన్నారు. ఒకే సారి రుణమాఫీ చేస్తామని చెప్పిన కేసీఆర్ ఐదేళ్ల చేశారని విమర్శించారు. బంగారు తెలంగాణ భ్రమలు కల్పించి రాష్ట్రాన్ని 6 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, పదేళ్ల దోచుకున్న 420లను గుర్తించే ప్రజలు ఎన్నికల్లో ఓడించారని సీతక్క పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు



మన ఇద్దరి ఆదాయాలపై..
విచారణకు సిద్ధమా..?

» వివరాలు వెల్లడించేందుకు నేను రెడీ

» సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి సవాల్

» ఫార్మాసిటీపై యూటర్న్ ఎందుకని ప్రశ్న

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): "మన ఇద్దరి ఆదాయాలపై విచారణ చేయించండి. ఆదాయంపై వివరాలు వెల్లడించేందుకు నేను సిద్ధం" అని అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఎవరిపై ఎన్ని కేసులు ఉన్నాయో..? ఎవరి ప్రస్థానం ఏమిటో..? ఎవరిపై ఆరోపణలు ఉన్నాయో..? అందరికీ తెలుసని అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపించిన రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. తన వద్ద ఆధారాలు ఉన్నాయని, వాటిని సీబీఐకి అందిస్తూ లేఖ కూడా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అందుకే సీబీఐకి లేఖ రాయాలని సూచించాను. జ్యుడీషియల్ విచారణ వద్దని నేనెక్కడా చెప్పలేదు. అసలు విషయాలను పక్కన బెట్టి రేవంత్ నాపై వ్యక్తిగత దూషణలకు దిగారు. జ్యుడీషియల్ విచారణ పేరుతో కాలయాపన చేసి కేసీఆర్‌ను రక్షించాలనుకుంటే నేనేమీ చేయలేను. కాళేశ్వరం ప్రాజెక్టులో బీజేపీ నాయకులకు కమీషన్లు అందితే కాంగ్రెస్ నేతలు విచారణ చేయించాలి. ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి 15 రోజుల్లోనే ఎందుకు యూ టర్న్ తీసుకున్నారు. ఫార్మా కంపెనీలకు భయపడ్డారా..? వాటికి లొంగిపోయారా..? ప్రధాని మోదీని గజదొంగ అంటారా..? రూ.12 లక్షల కోట్ల దోపిడీ చేసింది సోనియా నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం కాదా..? అది గజదొంగ సర్కారు కాదా..?" అని కిషన్‌రెడ్డి నిలదీశారు.

ఆరు గ్యారెంటీలపై కాలయాపన..

ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక లోక్‌సభ ఎన్నికల దాకా కాలయాపన చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ పేరిట ప్రజలను మభ్యపెడుతోందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. దరఖాస్తుల్లో అడిగిన సమగ్ర వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నా.. కొత్తగా సమాచారం ఎందుకు తీసుకుంటున్నారని నిలదీశారు. రాజకీయ దురుద్దేశంతో దరఖాస్తులు తీసుకుంటున్నారు తప్ప, ప్రజలకు కలిగే లబ్ధి ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో బిచాణా ఎత్తేస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటేస్తే.. చెత్త కుప్పలో వేసినట్లేనని కిషన్‌రెడ్డి అన్నారు.

నెల గడవక ముందే అసహనమా?

» ఓటమిని తట్టుకోలేని బీఆర్ఎస్: కూనంనేని

» 17ఏని అడ్డుపెట్టుకుని బీజేపీ బ్లాక్‌మెయిల్

» జగన్-కేసీఆర్ భేటీ రాజకీయమే: నారాయణ

హైదరాబాద్, జనవరి4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని, ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వకుండానే అసహనం వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం మగ్దుంభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల రోజులు కాకముందే బీఆర్ఎస్ హడావుడి చేయడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం, వరంగల్, పెద్దపల్లి, నల్గొండ ,భువనగిరి స్థానాలపై దృష్టిపెట్టామని చెప్పారు.రాష్ట్రంలో రెండు రోజులపాటు జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ , సమితి సమావేశాల్లో శాసన సభ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను విశ్లేషించుకున్నట్లు చెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ 17ఏ తీర్పు విషయంలో సుప్రీంకోర్టు కాలాయాపన చేసిందని, దాన్ని అడ్డుపెట్టుకుని మోదీ ప్రభుత్వం తెదేపా అధినేత చంద్రబాబును, ఏపీ సీఎం జగన్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తోందని విమర్శించారు. ఏపీ సీఎం జగన్ హైదరాబాద్ వచ్చి, మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించడం రాజకీయాల్లో భాగమే అన్నారు.

రెండు సీట్లకు పోటాపోటీ

ఒకటి బీఆర్ఎస్‌కు, మరొకటి కాంగ్రెస్‌కు దక్కే చాన్స్

» 2 పార్టీల్లోనూ భారీగా ఆశావహులు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా పరిధిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఉప ఎన్నిక నిర్వహణకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ఆయా పార్టీల బలాబలాలను బట్టి.. రెండు ఎమ్మెల్సీల్లో ఒకటి అధికార కాంగ్రెస్‌కు, మరొకటి బీఆర్ఎస్‌కు దక్కే అవకాశాలు ఉన్నాయి. దీంతో అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీలు పొందిన వారు, ఎన్నికల్లో పరాజితులైన వారు, సీనియర్ నాయకులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లో ఆశావహుల సంఖ్య భారీగానే ఉంది. ప్రధానంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేష్ కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి, సీనియర్ నేత హర్కారే వేణుగోపాల్.. తమకు అవకాశం కల్పించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. మైనారిటీ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని అధిష్ఠానం నుంచి సంకేతాలు ఉన్నందున తమ పేర్లు పరిశీలించాలని షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫెరోజ్‌ఖాన్ కోరుతున్నట్లు తెలిసింది. ఇటీవలి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన మైనారిటీ వర్గం నేతలు షబ్బీర్ పీర్ అహ్మద్, అలీ మస్కతీ పేర్లు సైతం వినిపిస్తున్నాయి. వీరితోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్, బండ్ల గణేష్ తదితరులు తమకు అవకాశం కల్పించాలని ఇప్పటికే అధిష్ఠానానికి అభ్యర్థనలు పంపినట్టు తెలిసింది. మరోవైపు.. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అవకాశం దక్కక హైకోర్టును ఆశ్రయించిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ ఉండొచ్చని తెలుస్తోంది. కోర్టుకు సంబంధించిన అంశం ఓ వైపు పెండింగ్‌లో ఉన్నప్పటికీ.. దాంతో సంబంధం లేకుండా వారికి అవకాశం కల్పించే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఆశిస్తున్న ఆత్రం సక్కు, జి.నగేశ్‌లో ఒకరికి ఆ అవకాశం దక్కితే.. మరొకరిని ఎమ్మెల్సీగా సర్దుబాటు చేయొచ్చని ప్రచారం జరుగుతోంది. వీరితోపాటు పార్టీ అధిష్ఠానం నుంచి గతంలో హామీలు పొందిన తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదిగిరిరెడ్డి, పీఎల్ శ్రీనివాస్ తదితరుల పేర్లు సైతం తెరపైకి వస్తున్నాయి. వీరిలో అధినేత కేసీఆర్ ఎవరిని అభ్యర్థులుగా నిర్ణయిస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

ఈ సమీక్షలు ఎప్పుడో నిర్వహించాల్సింది

» పార్టీలో కొందరికే న్యాయం జరిగింది

» సంస్థాగత పటిష్ఠతపై పెద్దగా దృష్టి పెట్టలేదు

» కనీసం జిల్లా, మండల కమిటీలూ వేయలేదు


» 'కరీంనగర్' భేటీలో బీఆర్ఎస్ నేతల ఆవేదన

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): "పదేళ్ల అధికారంలో ఉన్నాం.. అప్పుడూ ఇలాగే ముఖ్య నాయకులతో చర్చించి నిర్ణయాలు తీసుకొని ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. పార్టీ కేడర్‌తో సమీక్షలు జరపడం, సమావేశాలు నిర్వహించడం వంటి పనులు ఎప్పుడో చేయాల్సింది" అని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడ్డారు. పార్టీలో కొందరికే న్యాయం జరిగిందని, ఇప్పటికైనా సీనియర్లకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. తెలంగాణ భవన్‌లో గురువారం కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, హుజూరాబాద్, హుస్నాబాద్, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేతలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదనాచారి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడంతోపాటు పార్టీ కేడర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, సీనియర్ కార్యకర్తలు క్షేత్రస్థాయి పరిస్థితులపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పని చేస్తున్న వారికి గుర్తింపు లేదని, అధికారంలో ఉన్న పదేళ్లలో న్యాయం జరగకపోగా.. అడుగడుగునా నిర్లక్ష్యానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీని సంస్థాగతంగా పటిష్ఠం చేయడంపై అధిష్ఠానం దృష్టి పెట్టలేదని, గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటులోనూ విఫలమైందని ఆరోపించినట్లు తెలిసింది.

మా ఎమ్మెల్యేలెవరూ కాంగ్రెస్‌లోకి వెళ్లరు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలెవరూ.. కాంగ్రెస్‌లో చేరే ప్రసక్తేలేదని, పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, తమ పార్టీ గేట్లు తెరిస్తే.. ఆ పార్టీలో ఒక్కరు కూడా మిగలరని మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళ్తారని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, వాళ్లు ఒక్కరిని తీసుకెళ్తే...బీఆర్ఎస్‌లోకి పది మంది ఎమ్మెల్యేలు వస్తారని జోస్యం చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వినోద్‌కుమార్‌ను గెలిపించుకుంటామని తెలిపారు.

పార్టీ ఆదేశాలు ధిక్కరిస్తే కఠిన చర్యలు: కేటీఆర్



పార్టీ ఆదేశాలు ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసంలో జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్‌దావ వసంతసురేష్, జడ్పీటీసీ సభ్యులు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌పై అవిశ్వాస తీర్మాన పెడుతున్నారంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అబద్ధమని జడ్పీటీసీ సభ్యులు వివరించారు. కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

తండాలు, గ్రామాలకు
రోడ్ల అనుసంధానం జరగాలి

» నాణ్యత విషయంలో రాజీపడొద్దు: మంత్రి సీతక్క



హైదరాబాద్/ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, తండాలకు మండల కేంద్రాల నుంచి రోడ్ల అనుసంధానం జరిగేలా ఇంజినీరింగ్ విభాగాలు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం కార్యక్రమాలపై గురువారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అణగారిన ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు రోడ్లు అవసరమని, రోడ్ల నిర్మాణంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పాత్ర కీలకమని చెప్పారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, నాసిరకం పనులు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. శాఖాపరమైన సమస్యలు, పెండింగ్ బిల్లుల విషయాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానని, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తానని మంత్రి సీతక్క వెల్లడించారు. అంధుల కోసం ఆర్టీసీ బస్సుల్లో సౌండ్ వాయిస్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ విషయంపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో చర్చించామని, త్వరలోనే ఈ సదుపాయం రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి వస్తుందని హామీ ఇచ్చారు. మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో అంధుల లిపి రూపకర్త లూయిస్ బ్రెయిలీ 125వ జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి త్వరలోనే దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు.

రూ.14.25 కోట్లు విడుదల చేయండి: వ్యాప్కోస్

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యాప్కోస్(వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇండియా), ప్రభుత్వం కోరిన విధంగా వివిధ ప్రాజెక్టులకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు తయారుచేస్తుంది. ప్రస్తుతం, ఆయా డీపీఆర్‌ల తయారీ కోసం అయిన ఖర్చులకు సంబంధించిన నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం చుట్టూ తిరుగుతోంది. తెలంగాణలో 9 ప్రాజెక్టుల డీపీఆర్‌లకు సంబంధించి... రూ.14.25 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని కోరుతూ నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌కు వ్యాప్కోస్ అధికారులు లేఖ రాశారు.

12న కృష్ణా బోర్డు అత్యవసర భేటీ

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఈ నెల 12వ తేదీన అత్యవసర సమావేశం నిర్వహించనుంది. బోర్డులో నిధులు కొరత, వేతనాల చెల్లింపు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కృష్ణాబోర్డులో నిధులన్నీ ఖాళీ అయ్యాయి. తెలుగు రాష్ట్రాలు చెల్లింపులు చేయకపోవడంతో ఖజానా అంతా కరిగిపోయింది. ఉద్యోగులకు జీతాలు అందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బోర్డు నిర్వహణకు అత్యవసరంగా నిధులు విడుదల చేయాలని తెలుగు రాష్ట్రాలను అధికారులు కోరనున్నారు.

ఆర్టీసీలో అద్దె బస్సుల సమస్యలపై కమిటీ

» మంత్రి పొన్నం ఆదేశాలతో బస్సుల యజమానులతో ఆర్టీసీ అధికారుల చర్చలు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అమలుతో అద్దె బస్సుల్లో ఏర్పడిన సమస్యలను పరిశీలించేందుకు ఉన్నత స్థాయి అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఆ కమిటీ సిఫారసులకు అనుగుణంగా అద్దె బస్సు యజమానుల సమస్యలు పరిష్కరించనున్నట్లు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. అద్దె బస్సుల్లో రద్దీ పెరగడంతో డీజిల్ వినియోగం, టైర్లపై అదనపు భారంతో నిర్వహణ ఖర్చులు పెరగడం, సీటింగ్ సామర్థ్యం 56కు మందికే బీమా సదుపాయం ఉండటం.. ఓవర్‌లోడ్‌తో ఏర్పడే అన్ని సమస్యలకు ఆర్టీసీయే బాధ్యత తీసుకోవాలని అద్దె బస్సుల యజమానులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆర్టీసీలో సుమారు 2,550కి పైగా అద్దె బస్సులు ఉన్నాయి. వాటి యజమానులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించిన ఆయన.. వారితో చర్చించాలని సంస్థ ఎండీ సజ్జనార్‌ను ఆదేశించారు. దీంతో తెలంగాణ అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మధుకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి బృందం బస్ భవన్‌లో సజ్జనార్‌తో పాటు సీఓఓ రవీందర్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై సమస్యలపై చర్చించారు.

సమాచార, పౌర సంబంధాల శాఖ
డైరెక్టర్ పదవి నుంచి రాజమౌళి తొలగింపు

సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకుడు(డైరెక్టర్) బి.రాజమౌళిని ఆ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. రాజమౌళిని డైరెక్టర్‌గా నియమిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 సంవత్సరం ఏప్రిల్ 19న జీవో 875ను జారీ చేసింది. అయితే ఆ జీవోను ఉపసంహరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా జీవో 12ను జారీ చేసింది.

ఆదివాసీ గూడేలకు 515 కోట్లతో సౌర వెలుగులు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో నివాసం ఉండే ఆదిమజాతి గిరిజనుల గూడేల్లో సౌర విద్యుత్ వెలుగులు నింపాలని కేంద్రం నిర్ణయించింది. ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జన్‌మాన్) కింద 2023-24 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ఈ పథకం కోసం రూ.515 కోట్ల సహాయం అందించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఒక్కో ఇంటికి 0.3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ఫలకాలు బిగించనున్నారు. అలాగే ఈ ప్రాంతాల్లో మల్టీపర్పస్ కేంద్రాలు(ఎంపీసీ)ల్లో సౌర విద్యుత్ దీపాలు పెట్టనున్నారు. దీనికోసం ఒక్కో ఎంపీసీకి రూ.లక్ష సహాయాన్ని కేంద్రం ఇవ్వనుంది. తెలంగాణలో వివిధ జిల్లాల్లో చెంచులు, కోలామ్‌లు, గోండులు, కొండరెడ్లు, తోటి వంటి ఆదిమజాతి తెగకు చెందిన గిరిజనులు ఉన్నారు. ఈ తెగలకు మాత్రమే ఈ పథకం అమలు కానుంది.

ఎస్సీ, ఎస్టీలకు పరీక్ష ఫీజు.. మినహాయింపు ఇవ్వకపోవడంపై నోటీసులు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పరీక్ష ఫీజులో మినహాయింపు ఇవ్వకపోవడంపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం కేంద్ర హోంశాఖ, సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) డైరెక్టర్‌కు నోటీసులు జారీచేస్తూ.. వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

జర్నలిస్టుల సంక్షేమంపై త్వరలో ఉన్నతస్థాయి భేటీ: పొంగులేటి



జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి త్వరలో ఓ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఐజేయూ, టీయూడబ్ల్యూజే ప్రతినిధులు సచివాలయంలో మంత్రి పొంగులేటితో గురువారం భేటీ అయ్యారు. జర్నలిస్టులకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇతర సంక్షేమ చర్యలపై జనవరి 15 తర్వాత నిర్వహించే ఉన్నతస్థాయి స్థాయి సమావేశంలో సంబంధిత ఉన్నతాధికారులతో చర్చిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల ఇంటిస్థలాలకు గత ప్రభుత్వాలు జారీ చేసిన జీవోలు, వాటి ద్వారా ఇచ్చిన స్థలాలతో పాటు స్వాధీనం చేయకుండా ఉన్న వాటి వివరాలు అందజేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించామని చెప్పారు.

ఎన్‌టీపీసీ రెండో దశకు గ్రీన్‌సిగ్నల్

» నిర్మాణం కోసం సంప్రదింపులు జరపాలి
» అవసరాలకు తగ్గట్టు సామర్థ్యం పెంచాలి
» అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం



హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ రెండో దశకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా తెలంగాణ అవసరాలు తీర్చడానికి 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ ప్లాంట్‌ను ఎన్‌టీపీసీ నిర్మించాల్సి ఉంది. గత ప్రభుత్వం ఒకటో దశ(1600 మెగావాట్ల)కు మాత్రమే అనుమతినివ్వడంతో.. రెండో దశను ఎన్‌టీపీసీ చేపట్టలేదు. రాష్ట్రప్రభుత్వం కోరినా.. కోరకపోయినా రెండోదశ(2400 మెగావాట్ల)ను చేపట్టి, ఇతర రాష్ట్రాలకు కరెంట్‌ను విక్రయిస్తామని కొన్ని నెలల కిందట రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ ప్రకటించిన విషయం విదితమే. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని, సత్వరం రెండో దశ నిర్మాణం చేపట్టేలా ఎన్‌టీపీసీతో సంప్రదింపులు జరపాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విద్యుత్ సంస్థలపై గురువారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. దీనికి ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీతోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) అంచనాల ప్రకారం 2031-32 నాటికి పెరగనున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఆయా వ్యవస్థల సామర్థ్యం పెంపొందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సింగరేణి కట్టనున్న 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనులను సత్వరం చేపట్టాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.

విన్నపాలు వినవలె..

పాలమూరు ఎత్తిపోతలకు పెండింగ్ అనుమతులు వచ్చేలా చూడండి

» కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్‌కు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వినతి
» జాతీయ హోదా ఇవ్వలేం.. 60% నిధులిస్తామన్న షెకావత్
» అదనపు ఐపీఎస్ పోస్టులివ్వండి.. ఆస్తుల విభజనకు సహకరించండి
» అమిత్ షాను కోరిన సీఎం రేవంత్
» మూసీ రివర్ ఫ్రంట్, గృహ నిర్మాణానికి సహకరించాలని హర్దీప్ పురికి వినతి
» టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై యూపీఎస్సీ చైర్మన్‌తో నేడు రేవంత్, ఉత్తమ్ భేటీ



షెకావత్‌కు వినతిపత్రం అందిస్తున్న రేవంత్, ఉత్తమ్

న్యూఢిల్లీ, హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): "తెలంగాణలోని కరువు, ఫ్లోరైడ్ పీడిత జిల్లాలకు సాగు, తాగు నీరు అందిచేందుకు చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అత్యంత కీలకమైనది. దీని ద్వారా హైదరాబాద్ నగరానికీ తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటికే పలు అనుమతులు లభించాయి. సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లోని హైడ్రాలజీ, ఇరిగేషన్ ప్లానింగ్, కాస్ట్ ఎస్టిమేట్ అండ్ బీసీ రేషియో, అంతరాష్ట్ర డైరెక్టరేట్ అనుమతులు కేంద్ర జల సంఘం పరిశీలనలో ఉన్నాయి. వాటికి వెంటనే ఆమోదం వచ్చేలా చూడండి" అని సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరారు.

2021 జూలై 15న కేంద్రం జారీ చేసిన గెజిట్ ప్రకారం 2022 సెప్టెంబరు 13న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)కు డీపీఆర్‌ను సమర్పించామని నివేదించారు. ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.55086 కోట్లు అని పేర్కొన్నారు. దేశంలో ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలన్నా సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) అనుమతి తప్పనిసరని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఎత్తిపోతలకు మైనర్ ఇరిగేషన్‌లో మిగిలిన 45 టీఎంసీలతో పాటు కృష్ణా డెల్టాకు పోలవరం ద్వారా తరలించే 80 టీఎంసీల్లో సాగర్ ఎగువ రాష్ట్రాలు వాడుకోవడానికి ఇచ్చిన వెసులుబాటుతో 45 టీఎంసీల (మొత్తం 90 టీఎంసీలు) నికర జలాలు దక్కాయని గుర్తు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగు నీరు, 1,226 గ్రామాలతో పాటు హైదరాబాద్‌కు తాగు నీరు సరఫరా చేయాల్సి ఉందని.. ఈ ప్రాధాన్యతల దృష్ట్యా కేంద్ర జల సంఘంలోని ఆయా డైరెక్టరేట్లతో పాటు టీఏసీ అనుమతి వచ్చేలా చూసి జాతీయ హోదా కల్పించాలని విన్నవించారు. కాగా, పాలమూరు ఎత్తిపోతలకు అదనపు నిధుల కేటాయింపుపై షెకావత్ సానుకూలంగా స్పందించారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. సీఎం రేవంత్ సమక్షంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014 నుంచి ఏ ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వలేదని కేంద్ర మంత్రి గుర్తు చేశారని చెప్పారు. అయితే, ఇతర పథకాల కింద 60 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ భేటీలో కాళేశ్వరం గురించిన ప్రస్తావన రాలేదని ఉత్తమ్ మీడియాకు చెప్పారు.

సీఎం అయ్యాక తొలిసారి షా వద్దకు రేవంత్

తెలంగాణకు అదనంగా ఐపీఎస్‌లను కేటాయించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను సీఎం రేవంత్ కోరారు. రాష్ట్ర విభజన సమయంలో 76 మంది ఐపీఎస్‌లను మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. జిల్లాల విభజన రీత్యా, వివిధ శాఖల పర్యవేక్షణకు 29 మంది అదనపు ఐపీఎస్‌లను ఇవ్వాలని షాను కోరారు. కాగా, కొత్త బ్యాచ్ నుంచి ఈ మేరకు కేటాయిస్తామని షా హామీ ఇచ్చారు. నార్త్ బ్లాక్‌లోని షా కార్యాలయానికి వెళ్లిన రేవంత్.. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆయనతో సమావేశమయ్యారు. పునర్విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల విభజనను పూర్తి చేయాలని, పదో షెడ్యూల్ పరిధిలోని సంస్థల వివాదాన్ని పరిష్కరించాలని, ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్ విభజనను సాఫీగా పూర్తి చేయాలని, చట్టంలో పేర్కొనకుండా ఉన్న సంస్థలను ఏపీ క్లెయిమ్ చేసుకుంటుండడంపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. యాంటీ నార్కొటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ.88 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ.90 కోట్లు అదనంగా కేటాయించాలని కోరారు. రాజ్‌భవన్, హైకోర్టు, లోకాయుక్త, ఎస్‌హెచ్‌ఆర్సీ భవనాలను వినియోగించుకున్నందున రూ.408 కోట్లు ఏపీ నుంచి ఇప్పించాలని రేవంత్ కోరారు. కాగా, సీఎం తొలుత ఏఐసీసీ కార్యాలయంలో పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రులను కలిశారు.

సవరించిన మెట్రో ప్రతిపాదనలు ఆమోదించండి

తాము సవరించిన హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రతిపాదనలను ఆమోదించాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రి హర్దీప్‌సింగ్ పురీని సీఎం రేవంత్ కోరారు. సంయుక్తంగా చేపట్టే విషయాన్ని పరిగణించాలని విన్నవించారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని.. కేంద్రం సహకారం అవసరమని వివరించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించామని.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వాటిని ఇచ్చేందుకు అనుమతివ్వాలన్నారు. గృహ నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, కేసీఆర్ పాలనలో టీఎస్‌పీఎస్సీ పూర్తిగా విఫలమైందని, పేపర్ లీకులతో భ్రష్టుపట్టిందని ఉత్తమ్ మండిపడ్డారు. పటిష్ఠంగా తీర్చిదిద్దేందుకు శుక్రవారం యూపీఎస్సీ చైర్మన్‌తో సీఎంతో కలిసి సమావేశం కానున్నట్లు చెప్పారు. సీఎం వెంట సీఎస్ శాంతికుమారి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఆర్థికశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక వ్యవహారాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ సి.మురళీధర్ ఢిల్లీ వచ్చారు.



మేడిగడ్డకు ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టెస్ట్

» కుంగుబాటుకు గల కారణాలపై అన్వేషణ
» వారంలోగా ఫలితాలు వచ్చే అవకాశం
» సుందిళ్ల, అన్నారంలో గ్రౌటింగ్ తర్వాత పరీక్షలు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు గల కారణాలను అన్వేషించడానికి ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టెస్ట్(ఈఆర్‌టీ) చేపడుతున్నారు. బ్యారేజీని పరీక్షించే ప్రక్రియ గురువారమే ప్రారంభమైంది. వారం రోజుల్లో బ్యారేజీ కుంగుబాటుకు గల కారణాలు తెలుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది అక్టోబరు 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకులో పిల్లర్లు కుంగిన విషయం విదితమే. ప్రస్తుతం బ్యారేజీ ఎగువ భాగంతోపాటు దిగువ భాగంలో కాఫర్‌డ్యామ్ నిర్మాణం చేపడుతున్నారు. అయితే, బ్యారేజీ కుంగుబాటుకు గల కారణాలను తెలుసుకోవడానికి ఓ ప్రైవేట్ సంస్థతో పరీక్షలు చేయిస్తున్నారు. ఎలక్ట్రికల్ పరికరాల సాయంతో బ్యారేజీ ఏ విధంగా కుంగిందనే అంశంపై ఓ అంచనాకు రానున్నారు. ప్రస్తుతం బ్యారేజీలో కుంగిన ప్రదేశంలో పరీక్షలు చేస్తుండగా... వారం రోజుల అనంతరం బ్యారేజీలో మిగిలిన బ్లాకుల వద్ద కూడా ఈ పరీక్షలు చేయనున్నట్లు తెలిసింది. ఎక్స్‌రే ఫిల్మ్ మాదిరిగా ఈఆర్‌టీ పరీక్ష ఫలితాలు వెలువడనున్నాయి. అధికారుల నివేదిక ప్రకారం 16, 17, 18, 19, 20, 21 పిల్లర్లు ప్రభావితమయ్యాయని చెబుతున్నా... మొత్తం 11 పిల్లర్లపై కుంగుబాటు ప్రభావం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీయే ఈ పరీక్షలు చేయిస్తోంది. మరోవైపు.. సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో బుంగలు ఏర్పడిన చోట గ్రౌటింగ్ ప్రక్రియ నడుస్తోంది. ఇది పూర్తయ్యాక ఈ రెండు బ్యారేజీల్లోనూ ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ పరీక్షలు చేయనున్నారు.

జీతాలు పడ్డాయోచ్

(మొదటిపేజీ తరువాయి)

పలికింది. దీనిపై ఉద్యోగులు, పింఛనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకమీదట ఇదే విధానం అమలు కావాలని ఆకాంక్షిస్తున్నారు. 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు ఆలస్యం కావడం మొదలైంది. అలవికాని హామీలు, కొత్త పథకాలకు నిధులను మళ్లించడంతో జీతాలను 12, 20 తేదీల వరకు చెల్లిస్తూ వచ్చారు. దీన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిరసించాయి. జీతాల ఆలస్యంతో నెల వాయిదాలు చెల్లించలేక పోతున్నామని, బ్యాంకుల దృష్టిలో డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నామని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో చెల్లించాలంటూ కొన్ని సంఘాలు ఆందోళన బాట పట్టాయి. అప్పటి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశాయి. కాగా, కీలకమైన గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం ఈ విషయంలో పెద్దగా పోరాటం చేయలేకపోయాయి. దాంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నెల ఆలస్యంగా ఇస్తూ వచ్చింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించింది. దీనికితగ్గట్లే.. ఈ నెల 2న కొన్ని జిల్లాల ఉద్యోగులకు వేతనాలు, 3న పింఛన్లు, 4న మిగిలిపోయిన జిల్లాల ఉద్యోగులకు వేతనాలు చెల్లించారు. సాధారణంగా ఉద్యోగులకు ప్రతి నెలా సగటున రూ.3,250 కోట్లు, పింఛనర్లకు రూ.1,100 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రూ.4,300-4,500 కోట్లను ఖజానా నుంచి విడుదల చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మొత్తాన్ని సర్దుబాటు చేసింది.

సర్కారు చేతికి ధరణి!

ఇకపై రికార్డుల నిర్వహణ ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలోనే..

» ఎన్ఐసీ లేదా టీఎస్‌టీఎస్‌కు చాన్స్
» ముమ్మర కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
» ప్రస్తుతం టెర్రాసిస్ అనే ప్రైవేటు సంస్థ నేతృత్వంలో ధరణి రికార్డుల నిర్వహణ
» ఆ సంస్థను తప్పించేందుకు సన్నాహాలు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ధరణిపై మరో కీలక నిర్ణయం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ధరణి రికార్డులను ఒక ప్రైవేటు సంస్థ నిర్వహిస్తుండగా, ఆ బాధ్యతలను ప్రభుత్వమే చేపట్టేందుకు కసరత్తు మొదలైంది. ధరణిలో 83 లక్షలకుపైగా వ్యవసాయ ఖాతాలు ఉన్నాయి. వీటితో పాటు నిషేధిత భూముల వివరాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన భూముల సమాచారం ధరణి పోర్టల్‌లో నిక్షిప్తమై ఉంది. ప్రస్తుతం ధరణి నిర్వహణ బాధ్యతలను టెర్రాసిస్ అనే ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోంది. ఆ సంస్థను తప్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్), టీఎస్‌టీఎస్ (తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్), సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)లలో ఏదో ఒక దానికి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి ఇటీవలే ఆయా సంస్థలను అధికారులు సంప్రదించినట్లు సమాచారం. వాస్తవానికి 2018లో భూరికార్డుల ప్రక్షాళన సమయంలోనే ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎల్ఆర్ఎంఎస్)కు సాఫ్ట్ వేర్ డిజైన్, డెవలప్‌మెంట్, ఇంప్లిమెంటేషన్ కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ కంపెనీల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ను ఆహ్వానించింది. ఇందులో ఐఎల్ఎఫ్ఎస్ అనే కంపెనీ ఈ ప్రాజెక్టును దక్కించుకుని ప్రభుత్వంతో అగ్రిమెంట్ చేసుకుంది. ఆ తర్వాత ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎల్ఆర్ఎంఎస్) పేరును బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నవంబరు 2న ధరణి పోర్టల్‌గా మార్చింది. ఈ ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న ఐఎల్ఎఫ్ఎస్.. తమ కంపెనీకి చెందిన మెజారిటీ షేర్లను సింగపూర్‌కు చెందిన ఓ కంపెనీకి విక్రయించింది. ఆ షేర్లను కొనుగోలు చేసిన కంపెనీ టెర్రాసిస్‌గా పేరు మార్చుకొని ధరణి నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. అప్పటి నుంచి ఈ పోర్టల్ ద్వారానే భూములకు యాజమాన్యం హక్కులు కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సంస్థ నిర్వహణ బాధ్యతల కాంట్రాక్ట్ (ఒప్పందం) గత ఏడాది సెప్టెంబరులో ముగిసినా.. మళ్లీ అదే సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. అయితే, కోట్ల విలువ చేసే భూముల వివరాలు విదేశానికి చెందిన ప్రైవేట్ సంస్థ చేతిలో ఉండడం అంత మంచిది కాదన్న అభిప్రాయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఈమేరకు ధరణి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వ సంస్థలకే అప్పగించాలని భావిస్తోంది. అలాగైతేనే.. ప్రభుత్వ, ప్రైవేట్ భూరికార్డులు, రైతుల వివరాలు, ఇతర సమాచారం భద్రంగా ఉంటుందని, ఎలాంటి అక్రమాలకు తావుండదని అంచనా వేస్తోంది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా ధరణి ద్వారా జరిగే భూ క్రయవిక్రయాలు మినహా, మరే ఇతర కార్యకలాపాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. 33 రకాల టెక్నికల్ మ్యాడ్యుల్స్ కింద వచ్చే దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పూర్తిగా ఆపేసింది. ఈ నేపథ్యంలోనే ధరణి పేరును భూమాతగా మార్చి, ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనసాగించాలని కాంగ్రెస్ సర్కార్ యోచిస్తోంది.

కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్

» 4 వారాల్లో నియామకాల ప్రక్రియను పూర్తిచేయాలి
» ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్



హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో 16 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియకు అడ్డంకులు తొలగిపోయాయి. తప్పుగా అనువాదం చేసిన నేపథ్యంలో అభ్యర్థులందరికీ నాలుగు మార్కులు కలపాలని.. సమాధాన పత్రాలకు మళ్లీ మూల్యాంకనం చేయాలని పేర్కొంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం కొట్టివేసింది. తప్పులు ఉన్నాయని అభ్యర్థులు పేర్కొంటున్న వివాదాస్పద ప్రశ్నలపై ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్వతంత్ర నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ కమిటీ నిర్ణయం తర్వాత నియామక ప్రక్రియను పూర్తిచేయాలని సూచించింది. ఈ మొత్తం ప్రక్రియను నాలుగు వారాల్లో ముగించాలని రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలికి ఆదేశాలను జారీచేసింది. పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 2022 ఏప్రిల్‌లో నోటిఫికేషన్ జారీచేసిన నియామక మండలి.. అదే ఏడాది ఆగస్టు 30న తుది రాత పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రంలో 13 ప్రశ్నల్లో తప్పులున్నాయని.. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలంటూ పలువురు అభ్యర్థులు ఆధారాలతో సహా బోర్డుకు విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై బోర్డు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మేఘావత్ ఓంకార్, పలువురు అభ్యర్థులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ధర్మాసనం.. నాలుగు ప్రశ్నలు తప్పుగా ఉన్నట్లు గుర్తిస్తూ.. నాలుగు మార్కులను కలపాలని ఆదేశించింది. ఈ తీర్పుపై పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, పోస్టులకు ఎంపికైన ఇతర అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ అప్పీళ్లపై జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. నియామక మండలి తరఫున న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. సాంకేతిక అంశాలకు అనువాదాలు అవసరం లేదని పేర్కొన్నారు. విషయ నిపుణులతో పకడ్బందీగా పేపర్ తయారు చేయించామని.. కానిస్టేబుల్ ఫలితాలు సైతం వెల్లడించినందున ఈ దశలో జోక్యం చేసుకోరాదని కోరారు. ప్రతివాదుల తరఫున రమేశ్ చిల్లా, ఎస్ఎస్ అర్జున్ కుమార్ వాదనలను వినిపించారు. అనువాదం తప్పుగా చేశారని.. దీనివల్ల తెలుగు మీడియం విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. ప్రశ్నల్లో తప్పొప్పులను విషయ నిపుణులు తేల్చాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్వతంత్ర నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి.. అభ్యర్థులు తప్పుగా ఉన్నాయని పేర్కొంటున్న ప్రశ్నల్లో అభ్యంతరాలపై నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. సదరు కమిటీ నిర్ణయం మేరకు రిక్రూట్‌మెంట్‌లో తదుపరి ప్రక్రియను చేపట్టాలని సూచించింది. ఈ ప్రక్రియను 4 వారాల్లో పూర్తిచేయాలని స్పష్టం చేసింది.

68 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు రద్దు?

» టెండర్ దశలో ఉన్నవి, పనులు ప్రారంభంకానివి..
» వీటి స్థానంలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకం అమలు

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సర్కారు హయాంలో మంజూరై అసలు టెండర్లు కాని, టెండర్లు అయి పనులు మొదలవని 68 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు రద్దనున్నాయి. వీటి స్థానంలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. దీనికోసం రెండు పడక గదుల ఇళ్ల పథకంపై ఆరా తీస్తోంది. అసలు ఎన్ని మంజూరు చేశారు? ఎన్ని పూర్తయ్యాయి? పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని? పనులే మొదలుకాని, టెండర్ దశలో ఎన్ని ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తోంది. ఆ తర్వాత వివిధ దశల నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తిచేసేందుకు చర్యలు వేగిరం చేయనున్నట్లు సమాచారం. కాగా, రద్దు చేసిన ఇళ్లకు వచ్చిన దరఖాస్తుల స్థానంలో.. ప్రజా పాలనలో 'ఇందిరమ్మ ఇల్లు' కోసం వచ్చినవాటిని పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. డబుల్ బెడ్ రూం ఇల్లు దక్కనివారు.. 'ఇందిరమ్మ ఇల్లు'కు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో పనులు ప్రారంభంకాని డబుల్ ఇళ్ల రద్దులో ఇబ్బంది, సమస్యలు ఉండవని సర్కారు భావిస్తోంది. మరోవైపు డబుల్ బెడ్ రూం పథకం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించింది..? వాటిలో ఎంత ఖర్చు చేసిందనే వివరాలతో పాటు, పథకం అమలుకు రుణం తీసుకున్నారా? లేదా అనే వివరాలను కూడా ప్రస్తుత సర్కారు సేకరిస్తోంది. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం మొత్తం 2,91,057 'డబుల్ బెడ్ రూం' ఇళ్లు మంజూరు చేసింది. అయితే, ఈ స్థాయిలో నిర్మాణాలు జరగలేదు. మొత్తం 1.40 లక్షల ఇళ్ల పనులే పూర్తయ్యాయి. ఇందులో ఎన్నికలకు కొద్ది నెలల ముందు జీహెచ్ఎంసీలో 68 వేలు, మిగతాచోట్ల 28 వేల ఇళ్లు పంపిణీ చేశారు. 44 వేల ఇళ్లను కేటాయించలేదు. 85 వేల ఇళ్ల పనులు 80-90 శాతం పూర్తయినట్లు సమాచారం. వీటన్నింటిని వేగంగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరోవైపు డబుల్ ఇళ్లకు బీఆర్ఎస్ సర్కారు రూ.11 వేల కోట్ల మేర ఖర్చు చేసినట్లు సమాచారం.

ఏడాదిన్నర పాపను చిదిమేసిన స్కూల్ బస్సు

- అన్నను తండ్రి బస్సెక్కిస్తుండగా అక్కడికి వెళ్లిన పాప
- గమనించని డ్రైవర్.. వెనుక చక్రం కిందపడి మృతి


తండ్రితో జవాలన (ఫైల్)

రామంతాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్నను తండ్రి స్కూల్ బస్సు ఎక్కిస్తుండగా ఇంట్లోంచి అక్కడికి ఏడాదిన్నర పాప బుడి బుడి అడుగులతో వచ్చి నిల్చుంది. డ్రైవర్‌తో మాటల్లో పడిపోయిన ఆ తండ్రి, పాప అక్కడికి రావడాన్నే గమనించలేదు. తర్వాత బస్సును డ్రైవర్ ముందుకు కదిలించడంతో వాహనం వెనుక చక్రం నేరుగా పాప పైనుంచి వెళ్లింది. కళ్లముందే శరీరం ఛిద్రమై పాప దుర్మరణం పాలైంది. హైదరాబాద్ హబ్సిగూడలో ఈ విషాద ఘటన జరిగింది. రవీంద్ర నగర్‌లో కేరళకు చెందిన మిథున్ కుటుంబం నివసిస్తోంది. మిథున్‌కు భార్య, కుమారుడు, కుమార్తె జవాలన (18నెలలు) ఉన్నారు. మిథున్ కుమారుడు ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం బాబును ఎక్కించుకునేందుకు స్కూల్ బస్సు వచ్చి ఇంటి ముందు ఆగింది. కుమారుడిని బస్సెక్కించిన మిథున్, డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. అంతలో మిథున్ కుమార్తె జవాలన బస్సు వద్దకు రావడం.. మిథున్‌తో మాటలు ముగించేసిన డ్రైవర్, బస్సును ముందుకు కదిలించడం... వెనుక చక్రం కింద పాప పడటం క్షణాల్లో జరిగిపోయాయి. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

డిగ్రీ పరీక్షలో ప్రశ్న పునరావృతం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 4: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఓ ప్రశ్నపత్రంలో ఒకే ప్రశ్న రెండు సార్లు ఉండడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. గురువారం నిర్వహించిన బీకాం 5వ సెమిస్టర్ ఈ-కామర్స్ పేపర్‌లో ఈ పొరపాటు జరిగింది. సెక్షన్-ఏ లో ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జీ, హెచ్ పేరుతో ఇచ్చే 8 ప్రశ్నల్లో 5 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. అయితే వాటిలో బీ, హెచ్..లలో ఒకటే ప్రశ్నను అడిగారు. దాంతో విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. ప్రశ్న పునరావృతం కావడంతో ఒక చాన్స్ కోల్పోయామని, తమకు అన్యాయం జరిగిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

రాజమహేంద్రిలో నేటి నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు

రాజమహేంద్రవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రెండవ తెలుగు మహాసభలకు రాజమహేంద్రవరం ముస్తాబైంది. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీఎస్ఎన్.రాజు(చైతన్యరాజు) గురువారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువులో గల గైట్ కళాశాలల ప్రాంగణంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఈ మహాసభలు జరగనున్నాయి.

కేసు నుంచి తప్పిస్తానని చెప్పి రూ.లక్ష లంచం!

- నార్కట్‌పల్లి ఎస్సై సైదాబాబు సస్పెండ్

నల్లగొండ జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఓ సివిల్ వివాదంలో జోక్యం చేసుకొని, నిందితుడిని కేసు నుంచి తప్పిస్తానని చెప్పి రూ.లక్ష లంచం తీసుకున్న ఓ ఎస్సైని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వేటుపడిన ఆ అధికారి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎస్సై సైదాబాబు. నెల రోజుల క్రితం ఓ సివిల్ వివాదంలో సైదాబాబు డబ్బులు తీసుకున్నారని బాధితులు నేరుగా అప్పటి ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై ప్రత్యేక బృందాల ద్వారా ఉన్నతాధికారులు విచారించారు. అమ్మనబోలుకు చెందిన వ్యక్తిని కేసు నుంచి తప్పించేందుకు ఎస్సై సైదాబాబు లంచంగా లక్ష రూపాయాలు తీసుకున్నట్లు నిర్ధారించారు. ఈ నివేదిక ఆధారంగా ఐజీ తరుణ్‌జోషీ, ఎస్సై సైదాబాబును సస్పెండ్ చేశారు. సైదాబాబుపై అవినీతి ఆరోపణలతో ఐదేళ్లలో మూడుసార్లు సస్పెన్షన్‌కు గురికాగా ఒకసారి హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ అయ్యారు.

భద్రాద్రి జిల్లాలో 650 కేజీల గంజాయి పట్టివేత

లక్ష్మీదేవీపల్లి, జనవరి 4: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు గురువారం రూ. 1.62 కోట్ల విలువైన 650 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీదేవీపల్లి మండలంలోని రేగళ్ల క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో ఇది లభ్యమైంది. కొత్తగూడెం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ, రాజస్థాన్‌కు చెందిన సుందర్‌లాల్, సురేశ్ అనే వ్యక్తులు తమ లారీలో మూంగ్‌దాల్ లోడ్‌తో ఏపీలోని రాజమండ్రికి వచ్చారని తెలిపారు. వాటిని అక్కడ దింపి తిరుగు ప్రయాణంలో రాజమండ్రి దగ్గరలోని అటవీ ప్రాంతం నుంచి గంజాయిని లోడ్ చేసుకుని స్వరాష్ట్రానికి బయలు దేరారని చెప్పారు. లక్ష్మీదేవీపల్లి పోలీసులకు చిక్కినట్లు వెల్లడించారు.

కన్నకొడుకుకి విషమిచ్చి కడతేర్చిన నాన్న

అయిజ, జనవరి 4: భార్య మీద అనుమానం, కోపంతో ఓ భర్త తన కన్నకొడుకునే చంపేశాడు. ఎలుకల మందు, నిద్ర మాత్రలు కలిపిన నీళ్లను తాగించి అభంశుభం తెలియని తన రెండేళ్ల కొడుకు ప్రాణం తీశాడు. అదే నీళ్లను తాను తాగి ఆత్మహత్యాయత్నం కూడా చేశాడు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో తల్లి కుమారితో కలిసి నివాసముండే భార్గవ్‌కు పల్లవితో 2019లో వివాహమైంది. భార్గవ్, పల్లవి దంపతులకు కూతురు నవిత, కుమారుడు నంద కిశోర్(2) ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న భార్గవ్ నిత్యం పల్లవిని వేధిస్తుండేవాడు. పల్లవి ఇల్లు దాటి వెళ్లకుండా గొలుసులుతో కట్టి బంధించేవాడు. ఈ వేధింపులు తాళలేకపోయిన పల్లవి.. భర్త, పిల్లలను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. నందకిశోర్ తండ్రి దగ్గర, నవిత నాయనమ్మ కుమారి దగ్గర రోజూ నిద్రించేవారు. అయితే, భార్య మీద కోపంతో ఉన్న భార్గవ్ డిసెంబరు 29న ఎలుకలమందు, నిద్రమాత్రలను పొడిగా చేసి నీళ్లలో కలిపి వాటిని తాను తాగి, నందకిశోర్‌తోనూ తాగించాడు. పొద్దున్నే నిద్ర లేచి చూసే సరికి తండ్రీకొడుకులు అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన కుమారి వారిని వెంటనే ఆస్పత్రికి తరలించింది. దీంతో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, బుధవారం రాత్రి కూడా భార్గవ్ మళ్లీ అదే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎలుకల మందు, నిద్రమాత్రలు కలిపిన నీళ్లను కొడుకుతో తాగించి తాను తాగాడు. కుమారి గురువారం ఉదయం ఇద్దరినీ ఆస్పత్రికి తీసుకెళ్లగా నందకిశోర్ మరణించాడు. భార్గవ్‌ను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వంద ఎకరాలు కేటాయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వంద ఎకరాల్లో హైకోర్టు భవన నిర్మాణం జరగనుండడం సంతోషకరమని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి అన్నారు. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అడ్వొకేట్ జనరల్‌గా ఉన్నప్పుడు హైకోర్టు పక్కనే ఉన్న హాస్పిటల్ స్థలాన్ని కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఏజీగా నియమితులైన సందర్భంగా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు భవన నిర్మాణ ప్రక్రియలో బార్ అసోసియేషన్ సభ్యులు భాగస్వాములవ్వాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలో కొనసాగుతున్న చలి తీవ్రత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో చలి పులి వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకు పైనే నమోదవుతున్నా చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. సాయంత్రం నుంచే వీస్తున్న శీతలగాలులు.. అర్ధరాత్రి దాటాక కమ్ముకుంటున్న పొగమంచు తెరలు.. తెల్లారి 8 గంటలు దాటినా అలాగే ఉంటున్నాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 12.6, కెరమెరిలో 12.7, ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 12.8, బజార్‌హత్నూర్‌లో 13.1, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరు (యూ)లో 13.5, వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 13.6, రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో 13.9, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రాజేంద్రనగర్‌లో 14.6 డిగ్రీలుగా రికార్డయింది. చలితో వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోస, గుండె జబ్బులున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొట్టాల్లో పశువుల బాధ వర్ణనాతీతంగా మారింది. పలుచోట్ల ఆవులు, గేదెలు వ్యాధుల బారిన పడుతున్నాయి.

60 మంది రైతులపై హత్యాయత్నం కేసులు

- నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమ పనుల నిలిపివేతతోనే
- అన్నదాతల అరెస్టుకు సిద్ధమవుతున్న పోలీసులు
- దిలావర్‌పూర్‌లో బంద్ సక్సెస్.. నేటి నుంచి రిలే దీక్షలు

దిలావర్‌పూర్, జనవరి 4: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ శివారులో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం రద్దును కోరుతూ పోరాడుతున్న రైతుల్లో 60 మందిపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. గురువారం పరిశ్రమ ప్రతినిధి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ 307, 353, 342, 427 సెక్షన్ల కింద హత్యాయత్నం కేసు పెట్టారు. రైతులను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, తమ గ్రామాల మధ్య పంట పొలాల్లో పరిశ్రమ ఏర్పాటును నిరసిస్తూ దిలావర్‌పూర్, గుండంపల్లి రైతులు 3 నెలలుగా ఆందోళన చేస్తున్నారు. రాజకీయ నాయకులను కలుస్తున్నారు. పరిశ్రమ యాజమాన్యం పనులను వేగిరం చేస్తుండడంతో బుధవారం శాంతియుతంగా ఆందోళన చేపట్టేందుకు వెళ్లారు. పనుల్లో ఉన్న కూలీలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, రైతులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు లాఠీచార్జికి దిగారు. కాగా, ఇథనాల్ పరిశ్రమ రద్దయ్యే వరకు పోరాటం ఆపేది లేదని.. ఇందుకోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా వెనుకాడమని పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి స్పష్టం చేసింది. తమకు మద్దతిచ్చే నాయకులను గుండెల్లో పెట్టి చూసుకుంటామని.. చీలికలు తెచ్చి పక్కదోవ పట్టించాలని చూస్తే సహించబోమని హెచ్చరించింది. పరిశ్రమ రద్దు కోరుతూ చేపట్టిన నిరసనలో భాగంగా గురువారం 61వ జాతీయ రహదారి పక్కన పోరాట సమితి సభ్యులు వంటావార్పు నిర్వహించారు. ఇందులో వెయ్యిమంది పైనే గ్రామస్థులు పాల్గొన్నారు. పరిశ్రమపై రైతులు దాడి చేశారని చెప్పడం అబద్ధమని, తాము శాంతియుత నిరసన తెలిపేందుకు వెళ్లామని, కానీ.. యాజమాన్యం, పోలీసులే రెచ్చగొట్టి ఆందోళనను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని నాయకులు ఆరోపించారు. శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. పోరాట సమితి పిలుపు మేరకు దిలావర్‌పూర్ మండల కేంద్రంలో గురువారం బంద్ విజయవంతమైంది. పాఠశాలలతో పాటు వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. అయితే, వంటావార్పు సందర్భంగా జాతీయ రహదారికి అటువైపు భారీగా పోలీసు బలగాలను మోహరించడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోరాట సమితి సభ్యులు జాగ్రత్తలు తీసుకోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.


వంటావార్పులో జాతీయ రహదారిపై భోజనాలు చేస్తున్న గ్రామస్థులు

సూది పోటుకు బైబై!

మధుమేహ రోగులకు అద్భుత వరం.. చెమటతో షుగర్ పరీక్ష చేసే పరికరం

- రక్త పరీక్షలాగే కచ్చితమైన ఫలితం
- నిమిషంలో ఫలితం.. ఖర్చూ తక్కువే
- 'ఆంధ్రజ్యోతి'తో ఎలక్ట్రోకెమికల్ పరికరం ఆవిష్కర్త శ్రీనివాసరావు



(ఏలూరు/ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

రక్త పరీక్షలంటే అందరికీ భయమే..! జేబుకు చిల్లు పడడంతోపాటు సూది గుచ్చినప్పుడు కలిగే బాధను తలచుకుని హడలిపోతుంటారు. అందరి పరిస్థితి ఎలా ఉన్నా మధుమేహ వ్యాధిగ్రస్తులకు మాత్రం సూదిపోటు తప్పదు. టైప్-1 మధుమేహ బాధితులైతే రోజుకు నాలుగు సార్లు పరీక్షించుకుని ఇన్సులిన్ తీసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మధుమేహ పరీక్షలు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ బాధలన్నింటికీ స్వస్తి పలికేలా.. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన ఊసా చిరంజీవి శ్రీనివాసరావు అద్భుతమైన పరికరాన్ని ఆవిష్కరించారు. ఎలక్ట్రోకెమికల్ అనే ఈ పరికరంతో సూది పోటుతో పనిలేకుండా.. కేవలం చెమట చుక్కతో.. అది కూడా ఒకే ఒక్క నిమిషంలో శరీరంలోని గ్లూకోజ్ స్థాయిని నిర్ధారించవచ్చు. చిరంజీవి నాలుగేళ్లపాటు శ్రమించి రూపొందించిన ఈ పరికరానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి పేటెంట్ హక్కును కూడా కట్టబెట్టింది. ఇంతటి ఘనత సాధించిన శ్రీనివాసరావు తెలుగువారే కావడం మనందరికీ గర్వకారణం. ప్రస్తుతం ఆయన కాన్పూర్ ఐఐటీలో సీనియర్ ప్రాజెక్టు సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. చిరంజీవి నిర్వహించిన 'డయాబెటిస్ విత్ స్వెట్ టెస్ట్' ప్రయోగ వివరాలను 'ఆంధ్రజ్యోతి'తో ఇలా పంచుకున్నారు..

ఎలక్ట్రోకెమికల్ పరికరం ప్రత్యేకతను వివరిస్తారా?

సూదులతో గుచ్చి రక్త నమూనాలు సేకరించాల్సిన అవసరం లేకుండా, కేవలం చెమట బిందువులతో పరీక్షలు చేయవచ్చు. ఫలితం కూడా ఒకే ఒక్క నిమిషంలో వచ్చేస్తుంది. నొప్పిలేని ప్రక్రియ ఇది.

రక్తం, చెమట ద్వారా చేసే ఈ పరీక్షల్లో ఫలితం ఒకేలా ఉంటుందా..?

కచ్చితంగా..! రెండు పరీక్షల్లోనూ ఫలితం ఒకేలా ఉంటుంది కాబట్టే సూదులకు స్థానం లేని మా ఈ ప్రయోగానికి పేటెంట్ కూడా పొందాం.

బాధితుల్లో చిన్నారులు కూడా ఉన్నారంటారా?

చిన్నారులతో పాటు వృద్ధులు, ఇతర వయస్సుల కూడా దీని బాధితులే. మా పరిశోధన బృందం సహకారంతో పలు ప్రాంతాల్లో కొంతమంది రోగులను పరీక్షించిన తర్వాత ఈ ఎలక్ట్రోకెమికల్ పరికరాన్ని కనుగొనగలిగాం. నేను టీం లీడర్‌గా వ్యవహరించిన ఈ బృందంలో నచికేత్ ఆశిష్ గోఖలే, సిద్ధార్థ పండా కూడా ఉన్నారు.

ఇలా పరీక్ష చేయాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

పేదలు పడే బాధల నుంచి ఈ ఆలోచన పుట్టింది. చాలా కాలంగా ఈ సూదుల ద్వారా చేస్తున్న పరీక్షలతో మధుమేహ బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధుమేహ నిర్ధారణ పరీక్ష చూసేందుకు సులువుగానే ఉన్నా.. కొన్ని వర్గాలు, వయస్కుల వారికి ఇది రానురానూ ఒక భయానక వాతావరణాన్ని కలిగిస్తుంది. తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌ల్లో పలు గ్రామాల్లో పర్యటించినపుడు ఆ పరిస్థితులను కళ్లారా చూశాను. కాబట్టే ఒక కొత్త ఆవిష్కరణ దిశగా ఆలోచించాను.

18 ఏళ్లలోపు పిల్లలకు మధుమేహం వస్తుందా?

చాలా అవకాశాలున్నాయి. 18 ఏళ్లలోపు పిల్లలకు వచ్చే వ్యాధి టైప్-1గా నిర్ధారణ అయితే, రోజుకి నాలుగు సార్లు పరీక్షించుకొని ఇన్సులిన్ తీసుకోవాలి.

మధుమేహ రోగులకు సూచనలేమైనా ఇస్తారా..?

డైట్ (ఆహారం), వయస్సు, శారీరక శ్రమ ఇలాంటివన్నీ మధుమేహం రావడానికి కారణం కావచ్చు. అందుకే ప్రతీ ఒక్కరూ కనీసం ఏడాదికి ఒక్కసారైనా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

మధుమేహం వారసత్వంగా సంక్రమిస్తుందా?

అందరికీ వచ్చే చాన్స్ లేదు. అపోహ మాత్రమే.

పేటెంట్ హక్కు ప్రక్రియ ఎలా సాగింది?

ప్రయోగ దశలో ఉండగానే మా ఇన్‌స్టిట్యూట్ ద్వారా దరఖాస్తు చేశాం. తొలుత మా ప్రయోగాన్ని పరిశీలించిన తర్వాత మరిన్ని వివరాలు కోరారు. పూర్తి సమాచారం అందించాం. రెండేళ్ల తర్వాత మేం రూపొందించిన 'ఎలక్ట్రో కెమికల్ డివైస్ ఫర్ గ్లూకోజ్ డిటెక్షన్'కు పేటెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా పేటెంట్ కల్పించింది.

కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి

మాది నిరుపేద కుటుంబం. తండ్రి భీమయ్య వాచ్‌మెన్, తల్లి దుర్గ వ్యవసాయ కూలీగా పనిచేసి నన్ను, మా అక్కను చదివించారు. ప్రస్తుతం మా తల్లిదండ్రులు సొంత ఊళ్లోనే ఉన్నారు. నారాయణపురంలోని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎస్సీ చదివాను. ఆంధ్రా విశ్వ విద్యాలయంలో పీజీ చేశాను. ఆ తర్వాత సెంట్రల్ ఎలక్ట్రో కెమికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కారైకుడి (తమిళనాడు)లో పీహెచ్‌డీ పూర్తిచేశాను.

బీఆర్‌ఎస్ నాయకుడిని చెప్పుతో కొట్టిన మహిళ

- విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను నమ్మించిన నేత
- తనతో డిన్నర్‌కు రావాలంటూ ఫోన్‌కు అసభ్య సందేశాలు
- ఇంటికి పిలిపించుకొని దేహశుద్ధి చేసిన బాధితురాలు
- సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో వెలుగులోకి ఘటన

సదాశివపేట, జనవరి 4: తనను వేధింపులకు గురిచేస్తుండటంతో ఓ మహిళ, బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ నియోజకవర్గ స్థాయి నేతను చెప్పుతో కొట్టింది. విదేశాల్లో ఉద్యోగమిస్తానని మహిళకు చెప్పి, ఆమె ఫోన్‌కు అసభ్య మెసేజ్‌లు పంపడంతో చిర్రెత్తిపోయిన బాధితురాలు అతడిని ఇంటికి పిలిపించుకొని మరీ దేహశుద్ధి చేసింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సంగారెడ్డి నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ నాయకుడు నగేశ్ కొన్నిరోజుల క్రితం సదాశివపేటకు చెందిన ఓ మహిళకు విదేశాల్లో కొలువు ఇప్పిస్తానని నమ్మబలికాడు. తర్వాత తనతో కలిసి డిన్నర్‌కు రావాలని కోరుతూ ఆమె ఫోన్‌కు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపాడు. అతడికి గట్టిగా బుద్ధి చెప్పాలనుకున్న బాధితురాలు, ఇంటికొస్తే అన్నీ మాట్లాడుకుందాం అని చెప్పి పిలిపించుకుంది. తన ఇంటివద్దకు నగేశ్ రాగానే ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతడిని చెప్పుతో కొట్టింది. నగేశ్‌ను బాధితురాలు కొడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై సదాశివపేట స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా బీఆర్‌ఎస్ నాయకుడిపై చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకోవాలని తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వెల్లడించారు.

కన్హా శాంతివనంలో కొవిడ్ కలకలం!

- ఓ కార్యక్రమానికి వచ్చిన విదేశీయులు
- ఐదుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ..
- వాస్తవాలు వెల్లడించని నిర్వాహకులు
- ప్రభుత్వ వైద్య శిబిరం ఏర్పాటు
- ఒకరి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలింపు



షాద్‌నగర్/నందిగామ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో కొవిడ్ కేసులు కలకలం రేపుతున్నాయి. శాంతివనంలో 15 రోజుల పాటు నిర్వహించే ఓ కార్యక్రమానికి పలు దేశాల నుంచి అతిథులు భారీగా వచ్చారు. అయితే వచ్చిన వారికి కొవిడ్ పరీక్షలేవీ నిర్వహించకపోవడంతో కన్హా శాంతివనంలో కొవిడ్ కొత్త వేరియెంట్ జేఎన్1 వైరస్ విజృంభించిందని అక్కడి ప్రభుత్వ వైద్య శిబిరం సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటివరకు తాము నిర్వహించిన కొవిడ్ పరీక్షల్లో ఐదుగురికి పాజిటివ్‌గా తేలిందని తెలిపారు. అయితే వైరస్ బాధితుల సంఖ్య ఎక్కువే ఉందని, శాంతివనంలోనే వారికి ప్రైవేటుగా వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిసింది. దీనిపై నిర్వాహకులు నోరు విప్పట్లేదు. శాంతివనంలో కొవిడ్‌తో బాధపడుతున్న ఓ విదేశీయుడి పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఇటు శాంతివనంలో కొవిడ్ ప్రబలుతోందనే సమాచారం బయటకు పొక్కడంతో సమీపంలోని చేగూరు వాసులు భయాందోళన చెందుతున్నారు. స్థానికులు వందలాది మంది శాంతివనంలో పనులకు వెళ్తుంటారని, మహమ్మారి విజృంభిస్తే తాము కూడా వైరస్ బారిన పడతామని భయపడుతున్నారు. శాంతివనంలో కొవిడ్ పాజిటివ్ వ్యక్తులు బయటతిరగకుండా చర్యలు తీసుకోవాలని, ఇక్కడికి వచ్చే విదేశీయులందరికీ కొవిడ్ పరీక్షలు నిర్వహించాలని అధికారులను కోరుతున్నారు. ఇదే విషయమై షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో జయలక్ష్మీ మాట్లాడుతూ.. కరోనా వ్యాపిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వైరస్ లక్షణాలున్నట్లు కన్పిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఆ ఐఏఎస్, ఐపీఎస్‌ల భవితవ్యమేంటి?

- 13 మంది కొనసాగింపుపై సందిగ్ధత
- తెలంగాణ అధికారులు ఏపీకి వెళ్లాల్సిందేనా?
- ఇప్పటికే కీలక బాధ్యతల్లో కొనసాగింపు
- డీవోపీటీ వెళ్లిపొమ్మంటే.. అంతే సంగతులు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల 'క్యాడర్' అంశం చర్చనీయంగా మారింది. హైకోర్టు సూచనలు, వివరణల నేపథ్యంలో భవిష్యత్తులో ఈ బ్యూరోక్రాట్లు ఏ రాష్ట్రంలో కొనసాగుతారన్నది సందిగ్ధంగా మారింది. ఏ రాష్ట్ర కేడర్ అధికారులు ఆ రాష్ట్రానికి వెళ్లిపోవాలంటూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీవోపీటీ) ఆదేశిస్తే.. వీరి పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 13 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల క్యాడర్ నిర్ధారణ అంశంపై కేంద్రమే తుది నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు బుధవారం తేల్చి చెప్పింది. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్(క్యాట్) చేసిన కేటాయింపులు చెల్లవని, రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను అనుసరించాలని స్పష్టం చేసింది. దీంతో వీరి భవిత్యం ఏమిటన్న చర్చ సాగుతోంది. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాల ప్రకారం.. ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణీ ప్రసాద్, ఎం.ప్రశాంతి, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలి, అనంతరాము, ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిషేక్ మొహంతి, అభిలాష బిస్త్ వంటివారిని ప్రత్యూష్ సిన్హా కమిటీ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది. కానీ.. క్యాట్ మాత్రం వారిని తెలంగాణకు కేటాయించడంతో ఇక్కడే కొనసాగుతున్నారు. హైకోర్టు ఇచ్చిన స్పష్టత నేపథ్యంలో వీరు ఇక్కడే ఉంటారా? లేక ఏపీకి వెళ్లిపోవాల్సిందేనా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఈ అంశం డీవోపీటీ పరిధిలోకి వెళ్లింది. తెలంగాణ అధికారులను ఏపీకి పంపించే విషయంలో డీవోపీటీదే తుది నిర్ణయం. ఒకవేళ వీరంతా ఏపీకి వెళ్లాల్సిందేనని డీవోపీటీ ఆదేశిస్తే.. తప్పకుండా పాటించాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞప్తి చేసినా.. డీవోపీటీ అంగీకరించకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. గతంలో తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ వై.శ్రీలక్ష్మి ఏపీకి డిప్యూటేషన్‌పై వెళ్లడానికి డీవోపీటీకి దరఖాస్తు చేయగా కేంద్రం తిరస్కరించింది. అయితే, శ్రీలక్ష్మిని ఏపీకి పంపడానికి ఏపీ సీఎం జగన్, అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ అంగీకరించారు. ఇదే విషయాన్ని డీవోపీటీకి తెలపడంతో డిప్యూటేషన్‌కు సమ్మతి లభించింది. మరో సందర్భంలో సీనియర్ ఐపీఎస్ స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ నుంచి ఏపీకి పంపాలని నిర్ణయించారు. ఇదే విషయాన్ని ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు డీవోపీటీకి తెలిపాయి. ఈలోగా ఆయన ఏపీకి వెళ్లారు. అయితే, డీవోపీటీ అందుకు సమ్మతించలేదు. దాంతో ఆయన తిరిగి తెలంగాణకు రావాల్సి వచ్చింది. అంటే.. క్యాడర్ మార్పు దాదాపు అసాధ్యమే. డీవోపీటీ ఓకే చెబితేనే.. పక్క రాష్ట్రానికి డిప్యూటేషన్లుంటాయి. ఐఏఎస్ వర్గాలు కూడా డిప్యూటేషన్ వినహా.. ఒక క్యాడర్‌కు చెందిన బ్యూరోక్రాట్లు మరో రాష్ట్రంలో పనిచేయడానికి వీలుపడదని వివరిస్తున్నాయి. ప్రస్తుతం సీఎం రేవంత్, ఏపీ సీఎం జగన్ మధ్య సత్సంబంధాలు లేవు. ఈ పరిస్థితుల్లో డిప్యూటేషన్‌కు చాన్స్ ఉంటుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

కీలక స్థానాలు ఖాళీ..!

ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాల మేరకు ఏ రాష్ట్రానికి కేటాయించిన అధికారులు అక్కడే ఉండాలని ఒక వేళ డీవోపీటీ నిక్కచ్చిగా చెబితే.. రాష్ట్రంలో కీలక స్థానాలు ఖాళీ అవుతాయి. రోనాల్డ్ రోస్ జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్నారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీప్రసాద్, అదనపు కార్యదర్శిగా ఎం.ప్రశాంతి కొనసాగుతున్నారు. మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యదర్శిగా వాకాటి కరుణను ఇటీవలే ప్రభుత్వం నియమించింది. కేంద్ర సర్వీసుల నుంచి రాగానే ఆమ్రపాలిని హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమించింది. వీరంతా ఏపీకి వెళ్తే.. ఆ స్థానాలు ఖాళీ అవుతాయి.

అభ్యంతరాలకు చాన్స్..!

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల అభ్యంతరాలు, అభిప్రాయాలను తీసుకోవాలంటూ హైకోర్టు కేంద్రానికి సూచించింది. ఆ అభిప్రాయాల మేరకు కేటాయింపులపై నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. కానీ.. కేంద్రం ప్రత్యూష్ సిన్హా కమిటీ కేటాయింపులనే అమలు చేయాలన్న సంకల్పంతో ఉంది. అలాంటప్పుడు కేడర్ మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తోంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.



జేఎన్‌టీయూహెచ్‌లో పార్ట్ టైమ్ పీజీ

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూహెచ్)- పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంటెక్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. వీటిని ఉద్యోగులకు ప్రత్యేకించారు. దరఖాస్తు నాటికి హైదరాబాద్ పరిధిలో కనీసం ఏడాదిపాటు ఉద్యోగం చేసిన అనుభవం తప్పనిసరి. దరఖాస్తుతోపాటు ఒరిజినల్ సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లకు ఎటువంటి స్కాలర్‌షిప్ లభించదు.

స్పెషలైజేషన్‌లు: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్స్, ఇంజనీరింగ్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్, ఇండస్ట్రియల్ మెటలర్జీ, బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ప్రత్యేకించారు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో హెచ్‌ఆర్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌కు ఎంసీఏ ఉత్తీర్ణులు; బయోటెక్నాలజీకి ఎమ్మెస్సీ(ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/లైఫ్‌సైన్సెస్/బయోటెక్నాలజీ)/బీవీఎస్సీ/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్‌కు ఏదేని డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/అగ్రికల్చర్); పీజీ(సైన్సెస్/కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటీ)/ఎంసీఏ పూర్తిచేసి ఉండాలి. వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్‌కు ఎమ్మెస్సీ (జియోఫిజిక్స్/ జియాలజీ/ హైడ్రాలజీ/ రిమోట్ సెన్సింగ్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/అగ్రికల్చర్/జియోస్పేషియల్/ఎర్త్ సైన్సెస్/అట్మాస్ఫిరిక్ సైన్సెస్/ వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్‌కి ఎమ్మెస్సీ(జియోఇన్ఫర్మాటిక్స్/ జియోమాటిక్స్/ మేథ్స్/ ఫిజిక్స్/ జాగ్రఫీ/ అగ్రికల్చర్/వాటర్ రిసోర్సెస్/వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/జియోస్పేషియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎర్త్ రిసోర్సెస్/ఓషన్ సైన్సెస్)/ఎంసీఏ/ఎంబీఏ పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని మూడేళ్ల డిగ్రీ పాసైతే చాలు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం గంట. ఇందులో మొత్తం 60 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఎంటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో సంబంధిత స్పెషలైజేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంబీఏ అభ్యర్థులకు అనలిటికల్/రీజనింగ్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంట్రెన్స్ టెస్ట్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. టెస్ట్ తేదీలను త్వరలో ప్రకటిస్తారు.

ముఖ్య సమాచారం

- **ట్యూషన్ ఫీజు:** సెమిస్టర్‌కు రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 20
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ మార్కుల పత్రాలు; టీసీ; అనుభవం సంబంధిత పత్రాలు; నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్, సర్వీస్ సర్టిఫికెట్; మెడికల్ సర్టిఫికెట్ (దివ్యాంగులకు మాత్రమే)
- **పరీక్ష కేంద్రం:** జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఐఐఎం రోహ్‌తక్‌లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా, పీజీ, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ప్రోగ్రామ్‌ను అనుసరించి జాతీయ పరీక్ష స్కోర్ లేదా సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్, అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

- వెబ్‌సైట్: www.iimrohtak.ac.in

పీజీ ప్రోగ్రామ్(పీజీపీ)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ సంబంధిత సబ్జెక్టులు, రెండో ఏడాది ఎలక్టివ్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ఏడాదికి మూడు టర్మ్‌లు చొప్పున మొత్తం ఆరు టర్మ్‌లు ఉంటాయి. మూడో టర్మ్ చివరలో రెండు నెలల సమ్మర్ ఇంటర్న్‌షిప్; నాలుగో టర్మ్‌లో గ్లోబల్ బిజినెస్ సిమ్యులేషన్; అయిదో టర్మ్‌లో మార్క్‌స్ట్రాట్ సిమ్యులేషన్; ఆరో టర్మ్‌లో క్యాప్‌స్టోన్ సిమ్యులేషన్, ఇంటిగ్రేటివ్ ప్రాజెక్ట్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఎంబీఏ డిగ్రీ ప్రదానం చేస్తారు.

ఎలక్టివ్ స్పెషలైజేషన్‌లు: ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అండ్ స్ట్రాటజీ.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023 అర్హత పొంది ఉండాలి. క్యాట్ స్కోర్‌కు 60 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.2928
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 5

డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(డీపీఎం)

- ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్. విదేశీయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏ/సీఏ స్/ఎల్‌ఎల్‌బీ ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు; అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ కోర్సులు చేసినవారు; నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు 2024 జూన్ 1 నాటికి ఏడాది అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. ఏ కోర్సులోనైనా 55 శాతం మార్కులు ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 డిసెంబరు 31 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. క్యాట్/జీఆర్‌ఈ/జీమ్యాట్/యూజీసీ నెట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఐఐఎం సంస్థల నుంచి పీజీడీఎం/ఎంబీఏ పూర్తిచేసిన వారిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్: ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, రీసెర్చ్ ఆప్టిట్యూట్ సంబంధిత ప్రశ్నలు ఇస్తారు.

ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.34,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. నిబంధనల ప్రకారం మెరిట్ ఫెలోషిప్ కింద రెండో ఏడాది నెలకు రూ.10,000; మూడు, నాలుగు సంవత్సరాల్లో నెలకు రూ.15,000 చెల్లిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి రూ.2,50,000 ఇస్తారు. జాతీయ, అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2928
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **డీపీఎం రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 15
- **ఇంటర్వ్యూలు:** ఏప్రిల్, 15, 16
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 25
- **రిపోర్టింగ్ తేదీ:** జూన్ 6

ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్, స్పోర్ట్స్ పర్సన్స్, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్స్‌కు ఉద్దేశించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఉల్‌స్టర్ యూనివర్సిటీ (యూకే)లో ఎమ్మెస్సీ(స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్) అడ్మిషన్ పొందే వీలుంది.
- ఈ ప్రోగ్రామ్‌ను బ్లెండెడ్ లెర్నింగ్ - ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సెషన్స్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటరాక్టివ్ సెషన్స్, లైవ్ ప్రాజెక్ట్‌లు, ఇండస్ట్రియల్ విజిట్స్ ఉంటాయి.
- **అర్హత:** ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగాల్లో అనుభవం ఉండాలి. స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్ టెస్ట్(ఆన్‌లైన్), ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్ టెస్ట్:** ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్, స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ సంబంధిత ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 9

విదేశీ విద్య కొన్ని భ్రమలు

ఇప్పటి యువతలో విదేశాల్లో చదువుకోవాలనే ఆకాంక్ష ఎక్కువ. అయితే దీనికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రం అనుమానాలు, అపనమ్మకాలు కూడా ఎక్కువే. అయితే విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, సంబంధిత అకడమిక్ నిపుణులతో మాట్లాడినప్పుడు పలు అంశాలపై మనోళ్ల అనుమానాలకు అర్థం లేదని అనిపించింది. అవేంటో చూద్దాం.



ఖర్చు ఎక్కువ

విదేశీ చదువు అంటే ఖర్చుతో వ్యవహారం అనుకుంటారు. అయితే ఎంచుకున్న కోర్సు ఇన్‌స్టిట్యూషన్ తదితరాలను అనుసరించి వ్యయం ఉంటుంది. అంతేతప్ప ఏ కోర్సు తీసుకున్నా ఒకేరకమైన ఖర్చు ఉండదు. కొన్నిసార్లు విదేశీ యూనివర్సిటీలు, అక్కడి ప్రభుత్వాలు ఇచ్చే స్కాలర్‌షిప్స్‌తో చాలా వరకు భారాన్ని తగ్గించుకోవచ్చు. ఆన్ క్యాంపస్ జాబ్స్ టీచింగ్ అసిస్టెన్స్, రీసెర్చ్ అసిస్టెన్స్‌తోనూ ఒకింత ఉపశమనం పొందవచ్చు.

➡ ఇండియన్ యూనివర్సిటీలతో పోల్చుకుంటే విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకు అయ్యే వ్యయం ఎక్కువే. అయితే భారత దేశంలోని టైర్ వన్ పట్టణాల్లోని కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో బీటెక్, మేనేజ్‌మెంట్ కూడా వ్యయభరితమే. అదే విదేశాల విషయానికి వస్తే కొన్ని వర్సిటీలు బ్రైట్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజుల్లో పాతిక నుంచి డెబ్బయ్ అయిదు శాతం మేర మినహాయింపును ఇస్తున్నాయి.

స్థానిక భాష రాకున్నా పర్వాలేదు

సాధారణంగా ఇంగ్లీష్ బోధన లేని దేశాలను విద్యార్థులు తమ జాబితా నుంచి తొలగిస్తూ ఉంటారు. అయితే అలా తీసేయాల్సిన పని లేదు. చాలా దేశాలు ఇప్పుడు ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ కోసం ఇంగ్లీష్‌లో బోధనకు ముందుకు వస్తున్నాయి. అయితే ఇంగ్లీషులో బోధన ఉన్నంత మాత్రాన స్థానిక భాష అక్కర లేదు అన్నట్లు కాదు. లోకల్ లాంగ్వేజ్ ఎంత బాగా తెలిస్తే చదువు అంత బాగా ముందుకు సాగుతుంది అని ప్రొఫెసర్లు చెబుతుంటారు. అలాగే అక్కడే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని అనుకుంటే లోకల్ భాష తెలియకుంటే ఎలా అన్నదే ప్రశ్న. జర్మనీలో చదవాలనుకుంటే జర్మన్ లాంగ్వేజ్ నేర్చుకోవడం మంచిది. ఆ దేశం అనే కాదు ఎక్కడైనా శాశ్వతంగా లేదంటే తాత్కాలికంగా ఉండాలనుకునే వ్యక్తులకు స్థానిక భాషపై పట్టు అవసరం.

చాలా దేశాల్లో చదువులు ఉచితం

కొన్ని యురోపియన్ దేశాల విషయంలో ఇది నిజం కూడా. అయితే ట్యూషన్ ఫీజులు మాత్రమే పూర్తిగా లేకుంటే సబ్సిడీతో కానీ ఉంటాయి. ఉదాహరణకు నార్వే, ఫిన్లాండ్, స్వీడన్, డెన్మార్క్ తదితర దేశాలు ఫీజు మినహాయింపు లేదంటే సబ్సిడీ ఆఫర్స్ ఉంటాయి. జర్మనీలో ఆఫర్ చేసే అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ట్యూషన్ ఫీజులే ఉండవు. అయితే అకామిడేషన్, ఫుడ్ తదితర సొంత అవసరాలకు ఇండియన్ మనీలో ఏటా ఎనిమిది నుంచి పదిలక్షల మేర వ్యయమవుతుంది. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

స్కాలర్‌షిప్స్ సాధించడం సులువు

అమెరికా, బ్రిటన్ విద్యా సంస్థల్లో చేరి స్కాలర్‌షిప్‌లు సాధించడం చాలా సులువు అనుకుంటారు కొంత మంది విద్యార్థులు. అయితే స్కాలర్‌షిప్స్ రావాలంటే మంచి అకడమిక్ ట్రాక్ రికార్డ్ ఉండాలి. అలాగే కొన్ని స్కాలర్‌షిప్స్ మెరిట్ బేస్ట్ ఉంటే మరి కొన్ని నీడ్ బేస్డ్‌గా ఉంటాయి. ఆయా సెక్షన్‌లకే ఇవి అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా చాలా స్కాలర్‌షిప్స్ గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ విద్యార్థుల కోసం మాత్రమే ఉంటాయి. అండర్ గ్రాడ్యుయేషన్‌కు అందుబాటులో ఉండేవి చాల తక్కువ.



➡ యూకే, అమెరికా ప్రభుత్వాలు కూడా భారతీయ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తాయి. యూకే ప్రభుత్వం ఇచ్చే 'కామన్వెల్త్ మాస్టర్స్ స్కాలర్‌షిప్', 'కామన్వెల్త్ షేర్డ్ స్కాలర్‌షిప్', 'చెవనింగ్ స్కాలర్‌షిప్'లను - అకడమిక్ మెరిట్, ఫైనాన్షియల్ బ్యాక్‌గ్రౌండ్, ఎక్స్‌పీరియెన్స్ తదితరాలను పరిగణనలోకి తీసుకుని మంజూరు చేస్తారు. 'ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్స్'ను కూడా మంజూరు చేస్తాయి. అయితే కొన్ని సంస్థలు విదేశీ విద్యార్థులకు ఫీజుల్లో పూర్తిగా, కొంత మేర మినహాయింపును ఇస్తాయి. ఇలాంటి వాటికి గ్యారంటీ అంటూ ఏమీ ఉండదు. నిధుల అందుబాటు, అకడమిక్ రికార్డు తదితరాలు ఆధారంగా వీటిని ఇస్తారు. అమెరికాలోని ఐవీ లీగ్ కాలేజీలు మరో అడుగు ముందుకేశాయి. వాటి అలూమ్నీ కూడా కార్పస్ ఫండ్‌తో అర్హులకు స్కాలర్‌షిప్స్‌ను అందిస్తుంటాయి.

దరఖాస్తు ప్రక్రియ క్లిష్టం

కోర్సు ఏదైనప్పటికీ విదేశీ వర్సిటీల దరఖాస్తు ప్రక్రియ దాదాపుగా ఒకేలా ఉంటుంది. అకడమిక్ అర్హతల నుంచి ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిసియెన్సీలో అడిగే స్కోర్‌లు కూడా దాదాపుగా ఒకేలా ఉంటాయి. చాలా వరకు యూనివర్సిటీలు స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, లెటర్స్ ఆఫ్ రికమెండేషన్‌ను అడుగుతాయి. ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిసియెన్సీలో గ్రేడులను చూస్తాయి. స్కాలర్‌షిప్స్‌ను అందించే సంస్థలకు కూడా ఇవే అవసరమవుతాయి. అయితే దరఖాస్తు ప్రక్రియ, సెలెక్షన్ వంటివి సుదీర్ఘంగా సాగే వ్యవహారమే అయినప్పటికీ ఎక్కడా క్లిష్టత అంటూ ఏమీ ఉండదని సంబంధిత అకడమిక్ నిపుణులు అంటారు.

లెర్నింగ్ కష్టం

విదేశాల్లో చదువు అంటే కొద్దిగా కష్టంగానే అనిపిస్తుంది. అడాప్టబిలిటీ కోసం కష్టపడటం తప్ప మరో మార్గం లేదు. అయితే కోర్సు తీరుతెన్నులపై అవగాహన కోసం వారం నుంచి పదిరోజుల పాటు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ ఉంటుంది. మరో విషయం, అక్కడ కోర్సులు ఎక్కువగా ఇండస్ట్రీ నిర్దేశితంగా ఉంటాయి. కేస్ స్టడీలు ఉంటాయి. కేవలం థియరీ బోధనకే పరిమితం కావు. ప్రాక్టికల్ ఓరియెంటెడ్‌గా ఉంటాయి. ఫ్యాకల్టీ మెంబర్స్‌కు కూడా పది నుంచి పదిహేనేళ్ళ వరకు ఇండస్ట్రీ అనుభవం ఉంటుంది. ప్రాక్టికల్ ప్రపంచంతో మమేకమయ్యే థియరీలు ఉంటాయి. ఇండస్ట్రీలో ఏమి జరుగుతుందో అదే నేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ మార్పునకు తగ్గట్టు అడ్జస్ట్ కావడమే కాదు, ఎదగాల్సిన అవసరం మన విద్యార్థులకు ఉంటుంది.

డిగ్రీ వ్యవధి ఎక్కువ

విదేశీ వర్సిటీల్లో నాలుగేళ్ళ కాలవ్యవధి కలిగిన డిగ్రీ కోర్సులు ఉంటాయి. మన దగ్గర ఇంజనీరింగ్, మెడిసిన్ తప్ప ఇతర యూజీ విద్యార్థులను అలా చదివించడానికి విద్యాలయాలు వెనకాడుతాయి. అమెరికన్ వర్సిటీలు చాలావరకు ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. అంటే కోర్సుకు నిర్దేశించిన క్రెడిట్స్‌ను ముందస్తుగా పూర్తి చేయగలిగితే మూడేళ్ళకే డిగ్రీని ఇస్తాయి. అందుకోసం ప్రతి సెమిస్టర్‌లో అదనంగా కొన్ని కోర్సులను తీసుకోవాలి. అలా బరువు పెంచుకోవడమే కాదు, సమ్మర్ క్లాసులకు కూడా హాజరై ముందుగానే కోర్సు పూర్తిచేసుకోవచ్చు. అయితే ఈ వెసులుబాటుపై ఎక్కువ మందికి అవగాహన ఉండదు.

క్షేమమేనా

విదేశాలకు పిల్లలను పంపడం అంత క్షేమం కాదన్న భ్రమలో చాలా మంది తల్లిదండ్రులు ఉంటారు. అప్పుడప్పుడు జరిగే కొన్ని సంఘటనలు వారిని ఇలా ఆలోచించేలా చేస్తాయి. ఇందులో నిజం వేరుగా ఉంది. వాస్తవానికి అకామిడేషన్ తదితర అంశాల్లో యూనివర్సిటీలే బాధ్యత తీసుకుంటాయి. సురక్షితమైన ట్రాన్స్‌పోర్టేషన్ సహా విద్యార్థులతో కనెక్ట్ అయ్యే విషయంలోనూ సూచనలు ఇస్తాయి. తద్వారా తమ విద్యార్థులు అంతా సౌకర్యంగా ఫీలయ్యేలా, క్యాంపస్‌లో హాయిగా చదువుకునేలా చూస్తాయి. విద్యార్థులు తమ వర్సిటీకి ఒక మెసేజ్ ఇస్తే చాలు స్పందిస్తాయి. వెంటనే అకడమిక్, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లు రంగంలోకి దిగి ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులను ఆదుకుంటాయి. దీనికోసం యాప్స్‌ను కూడా వర్సిటీలు నిర్వహిస్తూ ఉంటాయి.

స్నేహితులను చేసుకోవడం కష్టం

విదేశీ విద్యార్థులను ఎక్కువగా తీసుకునే యూనివర్సిటీలు తమ స్టూడెంట్స్ మధ్య ఇంటరాక్షన్ కోసం పలు చర్యలు తీసుకుంటాయి. అందుకోసం ప్రత్యేకించి ఈవెంట్స్‌ను నిర్వహిస్తాయి.

ఉద్యోగాలు వస్తాయా?

ఐవీ లీగ్ యూనివర్సిటీలో చదివే వారికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయనేది భ్రమ. టెక్ కంపెనీలు అంటే మొదటి వరుసలో ఉండేవే కాదు అంతకుమించి పెద్ద కంపెనీలు కూడా ఉన్నాయి. వేటికవి కొన్ని నిబంధనలకు లోబడి తమ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌ను నిర్వహిస్తాయి. విదేశాల్లో టూటైర్ పట్టణాల్లోని యూనివర్సిటీ విద్యార్థులకు కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉంటాయి. విద్యార్థి ఏ ఎకనామిక్ సైకిల్‌కు చెందిన వ్యక్తి అన్నది ప్లేస్‌మెంట్స్‌లో ప్రాధాన్యం కలిగి ఉంటుంది. అంటే ఇక్కడ ఐఐఎం, ఐఐటి విద్యార్థులకు మిగిలిన వారికి ఉన్న తేడా మాదిరిగానే ఉంటుంది.

లిటిల్స్



ఏది మంచి? ఏది చెడ్డ?

చైనాలో ఓ పెద్దాయన ఉండేవాడు. జీవితం అంతా అయిపోయింది. ఏదైనా మంచి సలహాలు ఇవ్వడానికే బతికి ఉన్నా అనుకుండేవాడు. తెలివైన వాడు. మంచి ఆలోచనా పరుడు. అతని భార్య, కొడుకు తనను బాగా చూసుకునేవారు. ఆ పెద్దాయనకు ఓ గుర్రం ఉండేది. ఆ గుర్రంతోనే స్నేహం. తన రెండో కొడుకులా చూసుకునేవాడు.


ఒక రోజు తను ఎంతో ప్రేమగా చూసుకునే గుర్రం ఉదయం లేస్తూనే కనపడకుండా పోయింది. పెద్దాయన మనసు గుర్రం మీదనే ఉంది. తను నడవ లేడు. ఆ గుర్రం ఎక్కడ పోయిందనని కొడుకును పంపాడు. కొడుకు వెళ్లి చూసినా కనపడలేదు. పెద్దాయన గుర్రం పోయిందని ఊరంతా తెలిసింది. వారంతా వచ్చి 'పాపం.. పెద్దాయన.. బాధపడకు' అంటూ ఓదార్పు చెబుతోంటే.. 'జరిగేది మంచికే కావొచ్చు' అన్నాడు. పెద్దాయన చాదస్తం అనుకున్నారు జనాలు.

నాలుగు రోజుల తర్వాత ఉదయాన్నే పెద్దాయన నిద్రలేవగానే గుర్రం కనపడింది. తోడుగా మరో గుర్రం ఉంది. జంట గుర్రాలను చూసి ఇంట్లోవారు మురిసిపోయారు. జనాలు కూడా వచ్చి 'నీ అదృష్టమే అదృష్టం' అంటూ తెగ పొగిడారు. అది కూడా పెద్దగా పట్టించుకోలేదు. పైగా 'ఏ నష్టమో ఏమో' అన్నాడు. ఈ పెద్దాయనకు మనశ్శాంతి లేదని తిట్టుకున్నారు జనాలు కొందరు.


ఆ మరుసటి రోజు కొత్త గుర్రంమీద పెద్దాయన కొడుకు స్వారీ చేశాడు. కొత్త గుర్రం వేగంగా పరిగెత్తింది. ఆ గుర్రాన్ని పట్టుకోలేక తన కొడుకు కిందపడిపోయాడు. గాయాలయ్యాయి. కొడుకు బాధతో మూలుగుతున్నాడు. పెద్దాయన కొడుకును పరామర్శించటానికి ఊరిలోని దగ్గరి బంధువులు, స్నేహితులూ వచ్చారు. 'ఇది కూడా ఓ మంచికేలే' అన్నాడు పెద్దాయన. ఇక ఈ పెద్దాయన మారడేమో అని తిట్టుకున్నారు కొందరు. ఇంట్లో కొడుకు, భార్య కూడా తనమీద కోప్పడ్డారు.

ఓ ఐదు రోజుల తర్వాత రాజు ఆదేశాల మేరకు ఊరిలోని మగవాళ్లంతా యుద్ధానికి రావాలి అని దండోరా వేశారు. ఊరిలోని మగవాళ్లనందరినీ సైనికులు వచ్చి తీసుకుపోయారు. ఇష్టం లేదన్నా మగవాళ్లను లాక్కెళ్లారు. పెద్దాయన కొడుక్కి గాయాలు ఉండటంతో అతన్ని తీసుకెళ్లలేదు. ఆ తర్వాత యుద్ధానికి వెళ్లిన వాళ్లంతా భీకరయుద్ధంలో అతని శత్రురాజు దెబ్బకు మరణించారు. ఆ తర్వాత ఆ పెద్దాయన ఎంత గొప్పవాడోనని అందరూ అనుకున్నారు. అలా కొడుకు బతికిపోయాడు ఆ గుర్రం వల్ల. ఏది మంచి? ఏది చెడ్డ? అనుకుంది ఆ పెద్దాయన భార్య.


చుక్కలు కలిపి బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 196

	9	2		6				
5								
4			8	5			9	
		4		7		1	3	
			6		3			
	7	8		4		9		
	5			3	4			8
								5
				2		4	7	

సుడోకు - 195 సమాధానం

5	1	6	7	3	9	2	4	8
2	9	7	8	4	5	6	3	1
3	8	4	1	2	6	5	9	7
4	5	8	2	7	3	9	1	6
1	6	2	5	9	4	8	7	3
9	7	3	6	8	1	4	2	5
6	4	5	9	1	7	3	8	2
8	3	1	4	6	2	7	5	9
7	2	9	3	5	8	1	6	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.